నవంబర్ 2015

115

సంపుటి 10 సంచిక : 6

వెల రు.10/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో.....

నూతన ప్రపంచ నిర్మాణానికి దారేది...!

వేదకాలంలో ఆవు మాంసం ప్రీతికరమైన ఆహారం

సోషలిజమే భవిష్యత్తు

ప్రభుత్వ వైద్యరంగాన్ని బలపర్చాలి, విస్తరించాలి

బిజెపీ ! నీ హిందూత్వాన్ని, నీ ఫాసిజాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను

వ్యూహాత్మక కర్తవ్యాలు - జవాబుదారీతనం

ఎండమావుల చందాన చంద్రబాబు పాలన

విదేశీమారక నిల్వలతో చైనా వ్యూహం

సరళీకరణ విధానాలు - సంక్షోభాలు

బహుముఖ ప్రజ్ఞాశాలి నండూరి ప్రసాదరావు

నవంబర్
2015

115

సంపుటి : 10 సంచిక : 6

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

నూతన ప్రపంచ నిర్మాణానికి దారేది...!
వేదకాలంలో ఆవు మాంసం ప్రీతికరమైన ఆహారం
సోషలిజమే భవిష్యత్తు
ప్రభుత్వ వైద్యరంగాన్ని బలపర్చాలి, విస్తరించాలి
బిజెపీ! నీ హిందూత్వాన్ని, నీ ఫాసిజాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను
వ్యూహాత్మక కర్తవ్యాలు- జవాబుదారీతనం
ఎండమావుల చందాన చంద్రబాబు పాలన
విదేశీమారక నిల్వలతో చైనా వ్యూహం
సరళీకరణ విధానాలు - సంక్షోభాలు
బహుముఖ ప్రజ్ఞాశాలి నండూరి ప్రసాదరావు

స్ఫూర్తి

బహుముఖ ప్రజ్ఞాశాలి

# నండూరి ప్రసాదరావు

యు. రామకృష్ణ

రాష్ట్రంలో ఏర్పడిన తొలి కమ్యూనిస్టు బృందంలో ఆయన సభ్యుడు. ఏడు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు, రైతాంగ, కార్మిక ఉద్యమాలకు ఎనలేని సేవలందించిన కృషీవలుడు. పరమ సనాతన కుటుంబంలో.. అందులోనూ గ్రామాధిపత్యం కలిగిన మొఖాసాదారీ, భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన, వాటిని త్యజించి.. తాను నమ్మిన కష్టజీవుల రాజ్యం కోసం కన్నుమూసే వరకూ అవిశ్రాతంపోరాటం చేసిన ఆదర్శవాది. విప్లవ జీవితంలో అధ్యయనాన్నీ, ఆచరణనూ మేళవించిన ఆచరణశీలి. పార్టీలో జరిగిన అంతరంగిక సైద్ధాంతిక పోరాటంలో చురుకుగా పాల్గొన్న సేనాని. తొలి నాళ్లలో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం ఉన్నప్పుడూ, తెలంగాణా రైతాంగ పోరాటంలోనూ, అత్యవసర పరిస్థితి కాలంలోనూ తనదైన శైలిలో రహస్య జీవితం గడుపుతూ పార్టీ బాధ్యతలను చాకచక్యంగా నిర్వహించిన సుతారి. ఎంతటి నిషేధాలు, నిర్బంధాలు, ఆంక్షలనైనా ఎదుర్కొని ముందుకు సాగిన సాహసి. వయస్సు పైబడటంతో ఐచ్ఛికంగానే తన బాధ్యతల నుంచి విరమించుకొని వాటిని యువతరానికి తానే అప్ప గించిన వివేకి. తొలి రాజ్యసభలో సభ్యుడిగా కమ్యూనిస్టు వాణి వినిపించిన అనర్గళ వక్త. ఆయనే రాష్ట్ర కమ్యూనిస్టు తొలితరం సీనియం నేత నండూరి ప్రసాదరావు.

నండూరి ప్రసాదరావు కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆరుగొలను గ్రామంలో 1917 సెప్టెంబర్ 24న జన్మించారు. వారిది అతి సనాతన మొఖాసాదారీ కుటుంబం.వారి కుటుంబానికి 60 ఎకరాల మాగాణి, 90 ఎకరాల మెట్ట పొలం ఉంది. నండూరి ప్రాథమిక విద్య ఆరుగొలనులో, ఇంటర్మీడియట్ బందరులో, డిగ్రీ బెనారస్‌లో చదివారు. కాంగ్రెస్‌లో పేరు మోసిన నాయకుడు అయ్యదేవర కాళేశ్వరరావు నండూరి పినతండ్రికి బావమరిది. అయ్యదేవర 1923లో మహాత్మాగాంధీని ఆరుగొలనుకు తీసుకువచ్చారు. అప్పటికి నండూరికి పంద కొడేళ్లుంటాయి. ఆనాటి నుంచి నండూరిపై జాతీయోద్యమ ప్రభావం పడింది. బందరులో ఇంటర్ చదివే రోజుల్లో చురుకుగా జాతీయోద్యమ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నారు. అప్పట్లో బులుసు సాంబమూర్తిని అరెస్టు చేసి బందరు కోర్టుకు తీసుకువచ్చారు. దీన్ని సంచలనం చేసేందుకు రోడ్డుపై కార్లు, వాహనాలు వెళ్లకుండా చెట్లు నరికి రహదారికి అడ్డంగా వేసి పారిపోయినవారిలో నండూరి కూడా ఉన్నారు. ఇంటర్‌లో నండూరి 'టూ హిస్టరీస్' (ఇండియా చరిత్ర-బ్రిటన్ చరిత్ర) సబ్జెక్టులు తీసుకున్నారు. పరీక్షల్లో బ్రిటన్ చరిత్ర గురించి రాసేందుకు నండూరికి జాతీయావేశం అడ్డొచ్చి రాయడం మానేశారు. దీంతో పరీక్ష తప్పారు. బందరు నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చి కొంతకాలంపాటు ఇంటివద్దనే గ్రామంలోని విద్యార్థులకు ఇంగ్లీషు పాఠాలు చెప్పేవారు. సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు కీర్తిశేషులు నండూరి రామమోహనరావు వంటి వారు ఆయన వద్దనే ఇంగ్లీషు నేర్చుకున్నారు. 1931లో భగత్‌సింగ్ తదితర విప్లవకారుల ఉరితీత గురించీ, ఆ తరువాత జరిగిన కరాచీ కాంగ్రెస్ సభల గురించీ పత్రికల ద్వారా తెలుసుకుంటూ ఉండేవారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీయడంపై తీవ్రంగా వ్యాకులత చెందారు. టెర్రరిస్టులతో సంబంధాలు పెట్టుకునే యోచనతో ఉత్తర భారతదేశం వెళ్లదలిచారు. చివరికి శాసనోల్లంఘన ఆగిపోయిన తరువాత ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణుడై వారణాసికి వెళ్లి అక్కడ బెనారస్



హిందూ విశ్వవిద్యాలయంలో బిఏ కోర్సులో చేరారు. విప్లవకారులతో సంబంధాలు పెట్టుకొనే ఉద్దేశంతో హాస్టల్లో ఉండకుండా వేరుగా ఓ పెద్ద ఇల్లు తీసుకున్నారు. అక్కడ చంద్ర రాజేశ్వరరావు, ఆయన అన్న రామలింగయ్య వి.వి.గిరి (ఆ తర్వాత భారత రాష్ట్రపతి అయ్యారు), ఆయన తమ్ముడు రామ్మోహనరావు, పేర్రాజు, వెంకటరత్నం కలిసి వంట మనిషిని పెట్టుకొని కామన్ మెస్ నడపడం ప్రారంభించారు. అలా వారందరితో కలిసి బెనారస్‌లో ఏడాదిపాటు ఉన్నారు. అక్కడి యూనివర్సిటీలో చదివేటప్పుడు వి.డి.చితాలే అనే మరాఠీ కమ్యూనిస్టు నాయకుడు ఈ మిత్రద్వయం వద్దకు తరచూ వస్తూ కమ్యూనిజం గురించి విడమర్చి చెపుతూ వారిని ఉత్తేజపరిచేవారు. ఆయన బోధనలు, తమ శ్రద్ధాసక్తుల కారణంగా నండూరి, చంద్ర రాజేశ్వరరావు, పొన్నం వీరరాఘవయ్య, పోలేపెద్ది నరసింహమూర్తి, కాట్రగడ్డ వెంకట నారాయణ తదితరులు కమ్యూనిస్టు అగ్గలరీ సభ్యులుగా చేరారు. అప్పట్లో నండూరి కొంత కాలం పాటు 'వాణి' అనే రాతపత్రిక నడిపారు. ఆ పత్రికను తన విద్యార్థి మిత్రులకు సర్క్యులేట్ చేసేవారు. రాజకీయ తరగతులకూ వెళ్లేవారు. అయితే నండూరికి ఆ యూనివర్సిటీలో బోధించే చదువుపై విరక్తి కలిగింది. చదువు మధ్యలోనే మానేసి స్వగ్రామం తిరిగొచ్చారు. కొన్నినెలల తరువాత తన ఆస్తిపాస్తులన్నీ గ్రామానికి వదిలేసి గుంటూరు బ్రాడీపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని 'ఫ్రెండ్స్ హోం' పేరుతో హోటల్ పెట్టారు. దానికి మేనేజర్‌గా కంభంపాటి జూనియర్ ఉండేవారు. రోజూ సుమారు 30 మంది విద్యార్థులు ఆ హోటల్‌లో భోజనం చేసేవారు. వంటకు ఒక మనిషిని పెట్టుకున్నారు. సర్వీసింగ్ వగైరా పనులన్నీ నండూరే స్వయంగా చూసేవారు. ఆ హోటల్ గుంటూరులో కమ్యూనిస్టులందరికీ కేంద్రంగా ఉండేది. అప్పట్లో ఎస్.వి.ఘాటే ఆ హోటల్‌కు రహస్యంగా వచ్చి వారిని కలిసి వెళ్తుండేవారు. రోజూ సాయంత్రం జ్యూట్ మిల్లుకు వెళ్లి అక్కడ అధ్యయన తరగతులు నడిపేవారు. ఆ కాలంలో గుంటూరులో జరిగిన ఏఐసిసి అధ్యక్షుడు బాబూరాజేంద్రప్రసాద్ (స్వాతంత్ర్యానంతరం తొలి రాష్ట్రపతి) సభలో నల్లజెండాలు ప్రదర్శించాలని విద్యార్థులు పూనుకున్నారు. నండూరి రాత్రికి రాత్రే కూర్చొని 'కాంగ్రెస్ బూర్జువా సంస్థ' అనే చిన్న బుక్‌లెట్‌ను రాశారు. ఈ సంగతి పోలీసులకు తెలిసి నండూరినీ, మిగిలినవారినీ ముందుగానే అరెస్టు చేసి లాకప్‌లో వేశారు. రాజేంద్ర ప్రసాద్ గుంటూరు నుంచి వెళ్లిపోగానే వారిని వదిలేశారు. ఆ

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **బహుముఖ ప్రజ్ఞాశాలి నండూరి ప్రసాదరావు**
యు. రామకృష్ణ ........................ 2

2. **నూతన ప్రపంచ నిర్మాణానికి దారేది...!**
వి. శ్రీనివాసరావు ........................ 4

3. **వేదకాలంలో ఆవుమాంసం ప్రీతికరమైన ఆహారం**
డి.యన్. ఝా ........................ 7

4. **సోషలిజమే భవిష్యత్తు**
ఎస్. వెంకట్రావు ........................ 11

5. **ప్రభుత్వ వైద్యరంగాన్ని బలపర్చాలి, విస్తరించాలి** ........................ 16

6. **బిజెపీ! నీ హిందూత్వాన్ని, నీ ఫాసిజాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను**
సుచిత్రా కృష్ణమూర్తి ........................ 20

7. **వ్యూహాత్మక కర్తవ్యాలు.. జవాబుదారీతనం**
ఎస్. వీరయ్య ........................ 22

8. **ఎండమావుల చందాన చంద్రబాబు పాలన**
కంచల జయరాజ్ ........................ 24

9. **విదేశీమారక నిల్వలతో చైనా వ్యూహం**
సి.పి. చంద్రశేఖర్ ........................ 27

10. **సరళీకరణ విధానాలు సంక్షోభాలు**
ఎ. కోటిరెడ్డి ........................ 30

11. **వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సమీకరించడమే లక్ష్యం**
బివి రాఘవులు ........................ 34



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# ఫాసిస్టు ధోరణులు

మనం ఏ ఆహారం తినాలో వారే నిర్ణయిస్తారు. ఎలాంటి డ్రెస్ వేసుకోవాలో వారే నిర్ణయిస్తారు. ఏం రాయాలో, ఏం మాట్లాడాలో, ఏం చదవాలో, చూడాలో అన్నీ వాళ్లే నిర్ణయిస్తారు. వాళ్లు చెప్పింది వినకపోతే దాడులు చేస్తారు. హత్యలు చేస్తారు..... వాళ్లు మతోన్మాదులు, వారి ధోరణి ఫాసిజం. మతోన్మాదం ముదిరితే ఫాసిజానికి దారితీస్తుంది. ఇప్పుడు మన దేశంలో అదే జరుగుతోంది. హేతువాద భావాలు వ్యక్తం చేసినందుకు ప్రొఫెసర్ కల్బుర్గిని కర్నాటకలో హత్యచేశారు. ఆవు మాంసం తింటున్నాడన్న అలజడి సృష్టించి ఉత్తర ప్రదేశ్‌లో మహమ్మద్ అక్లాఖ్‌ను చంపేశారు. ముంబయిలో పుస్తకావిష్కరణ చేస్తున్న సుదీంద్ర కులకర్ణి మొహంపై ఇంకుపోశారు. ఢిల్లీలోని కేరళ భవన్‌లో ఆవు మాంసం వడ్డిస్తున్నారన్న వదంతి సృష్టించి దాడులు చేయించారు. ఎక్కడన్నా అమ్మాయి అబ్బాయి ప్రేమించుకుంటూ కనిపిస్తే వారి వెంటబడి వేధిస్తున్నారు. అమ్మాయిలు ఆధునిక దుస్తులు వేసుకుంటే నానా యాగీ చేస్తున్నారు. ఇష్టంలేని సినిమాలను నిలిపేయిస్తున్నారు. పుస్తకాలపై నిషేధాలు పెడుతున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు నాజీ జర్మనీలో నెలకొన్న ఫాసిస్టు ఛాయలు నేడు మన దేశంలో కనిపిసున్నాయి. 2002లో గుజరాత్‌లో అమలయిన మతోన్మాద హింసాకాండ నేడు దేశమంతటా అమలుచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మతోన్మాదులు చేస్తున్న ఈ దౌష్ట్యాల వెనుక వారికి ఒక దుష్ట లక్ష్యం ఉంది. దాన్ని సాధించడానికో వ్యూహం ఉంది. ప్రజలను మతాలవారీగా విడదీయడం ద్వారా వారి చైతన్యాన్ని మొద్దుబార్చడం, ఐక్య పోరాటాల్లోకి వారిని రాకుండా చేయడమే వ్యూహం. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడ్డమే లక్ష్యం. ఏ దేశంలో నైనా మతతత్వ శక్తుల పని పాలక వర్గాల ప్రయోజనాలు కాపాడ్డమే. మన దేశంలో బిజెపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండీ సంస్కరణలు మరింత లోతుగా అమలు జరిపే పేరిట విదేశీ కార్పొరేట్‌లకు దేశంలోని భూములు, వనరులు, మార్కెట్లపై పెత్తనం కట్టబెట్టే చట్టాలు చేస్తున్నది. కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ కార్మికవర్గానికి ఉన్న రక్షణలు తొలగిస్తున్నది. ఈ విధానాల వల్ల కార్మిక వర్గంలోనూ, ప్రజల్లోనూ ప్రబలే అసంతృప్తి ఉద్యమాల రూపంలోకి మారకుండా ఉండేందుకు మతోన్మాదాన్ని రగిలిస్తోంది. బతుకు పోరాటం నుండి మత, కుల పోరాటాలవైపు ప్రజల దృష్టిని మరల్చడమే వారి పన్నాగం.

గతంలో వాజ్‌పేయి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చర్చంతా రామ మందిరం చుట్టూ తిప్పారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వ హయాంలో గోమాంసం చుట్టూ తిప్పుతున్నారు. తేడా ఒక్కటే. వాజ్‌పేయి ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లేదు కాబట్టి కాస్త వెనకాముందు చూసుకున్నారు. నేడు మోడీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉంది కాబట్టి హిందూత్వ శక్తులు పెట్రేగి వ్యవహరిస్తున్నాయి. ఎంతగా పెట్రేగిపోయాయంటే దేశంలోని విద్యా, సాంస్కృతిక రంగాలకు చెందిన సంస్థలన్నిటినీ పచ్చి హిందూత్వ శక్తులతో నింపేయడానికి ప్రయత్నిస్తున్నాయి. రాజ్యాంగ సంస్థలన్నింటినీ హిందూత్వ మయం గావించడానికి బరితెగిస్తున్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఏలు, అధికార పార్టీ నాయకులు చివరికి ప్రధాన మంత్రితో సహా లేచింది మొదలు మతోన్మాద ప్రకటనలతో ప్రజలను రెచ్చగొడుతూ ఉన్నారు.

అయితే సంతోషించాల్సిన విషయమేమంటే ఈ మతోన్మాద శక్తుల ఆగడాలకు ప్రతిఘటన ప్రారంభమైంది. ప్రొఫెసర్ కల్బుర్గిని హత్యచేసినందుకు కవులతో ప్రారంభమైన నిరసన క్రమంగా కళాకారులు, సినిమా నటులు, సైంటిస్టులు, మేధావులు, విద్యార్థులు తదితర సెక్షన్లకు విస్తరించింది. ఎన్డీఏ ప్రభుత్వ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా రానురాను మరింతమంది ముందుకొస్తున్నారు. భూ ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా రైతాంగం పెద్ద సంఖ్యలో కదలడంతో మోడీ ప్రభుత్వం భూ సేకరణ చట్టం విషయంలో వెనక్కు తగ్గింది. కార్మిక వర్గం కూడా ఐక్యంగా కదిలి పెద్ద ఎత్తున సమ్మెపోరాటం చేసింది. దేశాన్ని మతోన్మాద శక్తులనుండి, ఫాసిస్టు ధోరణులనుండి రక్షించేది ఈ ప్రతిఘటనా పోరాటాలే.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# నూతన ప్రపంచ నిర్మాణానికి దారేది...!



రచయిత సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**వి. శ్రీనివాసరావు**

గత కొంత కాలంగా దేశంలో మార్పు కోసం చాలా విన్యాసాలు జరుగుతున్నాయి. సరళీకరణ విధానాల అధిపత్యం, వామపక్షాలు ఉద్యమాలు వెనక పట్టు నేపథ్యంలో ఆరెస్సెస్, బిజెపి లాంటి అభివృద్ధి నిరోధక శక్తులు పుంజుకోవటం ప్రగతిశీల వాదుల్ని ఆందోళనకు గురిచేస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచలో జరుగుతున్న వివిధ పరిణామాలు ఏదిశగా జరుగుతున్నాయి. వాటి ప్రభావం భారతదేశంపై ఏలా ఉంటుంది. దేశంలో విప్లవోద్యమాల భవిష్యత్తేమిటి వగైరా ప్రశ్నలు వామపక్ష మేధావుల బుర్రల్ని తొలుస్తున్నాయి. అమెరికా ఆధిపత్యం బలహీన పడుతున్నదని, దాన్ని తిరిగి నిలబెట్టుకోవడానికి ఏం చేయాలో, అమెరికా మీడియాలో పెట్టుబడి దారీ మేధావులు మధనం సాగిస్తున్నారు. మరోవైపు యూరప్‌లో పొదుపు చర్యలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం, లాటిన్ అమెరికాలో కొనసాగుతున్న వామపక్ష పురోగమనం, అరబ్ దేశాల్లో ప్రజాస్వామ్యం కోసం సాగుతున్న ఆందోళనలు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ పూర్వ రంగంలో ప్రముఖ వామపక్ష మేధావి మార్తా హర్నేకర్ రాసిన పుస్తకం “నిర్మించడానికి ఒక నూతన ప్రపంచం–21వ శతాబ్దంలో సోషలిజం దిశగా నూతన మార్గాలు” సరికొత్త ఆలోచనలను ఆవిష్కరింపజేస్తుంది. ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం ఆందోళన సాగిస్తున్న ఉద్యమకారులకు ఈ పుస్తకం అనేక అనుభావాలను అందిస్తుంది. ప్రత్యేకించి గత ఇరవై సంవత్సరాలుగా లాటిన్ అమెరికా దేశాల్లో జరుగుతున్న ఉద్యమాల నేపథ్యం, పరిపాలన అనుభవాలు, సైద్ధాంతిక ధోరణులను ఆమె ఈ పుస్తకంలో వివరించారు.

ఈ మధ్యకాలంలో భారత దేశ వామపక్ష వాదులకు మార్తా హర్నేకర్ పేరు సుపరిచితమే. చిలీలో జన్మించిన ఈమె వెనిజులా అధ్యక్షుడు ఛావెజ్‌కు సలహాదారుగా చాలా కాలం పాటు పనిచేశారు. లాటిన్ అమెరికాతో పాటు ప్రపంచంలో వివిధ దేశాల్లో పర్యటించి ఉద్యమాలను అధ్యయనం చేసిన అనుభవం ఉంది. గతంలో ఆమె రాసిన ఒక పుస్తకం ‘వామపక్ష పునర్నిర్మాణం’ ప్రపంచ వామపక్ష ఉద్యమకారుల దృష్టిని ఆకర్షించింది. 2013 విముక్తి ఉద్యమాల విమర్శనాత్మక అవార్డును అందుకున్నారు. (http://monthlyreview.org/press/news/harneckers-remarks-liberators-prize/) ఇప్పుడు ఈ పుస్తకం ద్వారా వర్తమాన ప్రపంచంలో, ప్రత్యేకించి లాటిన్ అమెరికాలో సోషలిజం నిర్మాణం కోసం సాగుతున్న పోరాట అనుభవాలను ఎంతో చక్కగా వివరించారు. ఈ పుస్తకాన్ని ఆమె ఛావెజ్‌కు మరణానంతరం అంకితం చేశారు. 240 పేజీలున్న ఈ పుస్తకాన్ని 2014 నవంబర్‌లో మంత్లీ రివ్యూ ప్రెస్, న్యూయార్క్ వారు ప్రచురించారు. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయదలచుకున్న వారు అమెజాన్ ద్వారా కొనుగోలు చేయొచ్చు. (పేపర్ బ్యాక్ రూపాయల్లో 1730. డిజిటల్ ఎడిషన్ అయితే కిండెల్ రు. 985లు) ఈ పుస్తకం ఈ సంవత్సరం అరంభంలో వెలువడింది. ఇండియన్ ఎడిషన్ విడుదల కాలేదు. ఇంకా తెలుగులో రాలేదు. అందుకు తెలుగు పబ్లిషర్స్ చొరవ తీసుకోగలరని అశిద్దాం.

ఈ పుస్తకంలో మొత్తం మూడు భాగాలు, 12 అధ్యాయాలు ఉన్నాయి. మొదటి భాగంలో చిలీతో మొదలైన సరళీకరణ విధానాలు, దానికి వివిధ దేశాల్లో ఎదురైన ప్రతిఘటన, అంతిమంగా వివిధ దేశాల్లో వామపక్ష ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులను వివరించారు. పాత వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయకుండానే దాని స్థానంలో నూతన వ్యవస్థను నిర్మించవచ్చా? అయితే అది ఎలా చేయవచ్చో, దానిలో వచ్చే సమస్యలెలా ఉంటాయో లాటిన్ అమెరికా అనుభవాలను ఆమె ఈ పుస్తకంలో వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థ నిర్మాణాన్ని క్రమ పద్ధతిలో వివరించడానికి ఈ రచన ద్వారా ఆమె ప్రయత్నించారు. 21శతాబ్దపు సోషలిజం ఒక చారిత్రక పరిణామం మాత్రమే కాదు, సైద్ధాంతిక ప్రాజెక్టు అని ఆమె అభిప్రాయపడ్డారు. నూతన ప్రపంచ నిర్మాణంలో లాటిన్ అమెరికా ప్రయోగాలను ఇందులో ఆమె చాలా శక్తివంతంగా బలపరిచారు. శ్రమ దోపిడితో పాటు భూమి, నీరు, మైనింగ్, ఆయిల్, వంటి ప్రకృతి సహజ సంపదను దోచుకుపోతున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, ఆయా దేశాల్లో ఉన్న పాలకులు ఈ దోపిడిలో భాగస్వాములై అంతర్జాతీయ కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారటంతో వారిని గద్దె దించే పోరాటాలుగా ఇవి పరిణామం చెందాయి. ఈ పరిణామం నాలుగు దశలుగా చూడవచ్చు. మొదట ప్రతిఘటన. తమ వనరులను కాపాడుకోవటానికి, స్థానిక సమస్యల పరిష్కారానికి సాగాయి. ఉదాహరణకి బొలీవియాలో మంచినీటి హక్కు కోసం, బ్రెజిల్‌లో భూ పరిరక్షణ కోసం, వెనిజులాలో ఆయిల్‌పై అధికారం కోసం, ఉరుగ్వేలో మైనింగ్ తరలింపుకు వ్యతిరేకంగా, మెక్సికోలో సాగుభూమిపై హక్కు ఇలా ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క రూపంలో ప్రతిఘటన ప్రారంభమైంది. వీటి కోసం ఎక్కడికక్కడ కొత్త పోరాట సంఘాలు పుట్టుకొచ్చాయి. అప్పటికే సాంప్రదాయకంగా పని చేస్తున్న సంఘాలపై విశ్వాసంలేని స్థానిక ప్రజలు తమ హక్కుల సంరక్షణ కోసం స్వతంత్ర సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. అందులో నుంచే నాయకులు పుట్టుకొచ్చారు. స్వతంత్ర నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

ప్రకృతి వనరులపై సామాజిక ఆధిపత్యం కోసం కమ్యూనిటీలు ఏర్పడ్డాయి. అనేక విజయాలు కూడా సాధించాయి.

రెండో దశ– తాము ఎదుర్కొన్న సమస్యలకు, ప్రభుత్వ విధానాలకు మధ్య లింకును గుర్తించడం. తాము ఎదుర్కొంటున్న సమస్యలు స్థానికంగా పుట్టుకొచ్చినవి కాదని, అవి ప్రభుత్వ విధానాల పర్యవసానాలని అనుభవంలో అర్థమైంది. ఈ కమ్యూనిటీల నుంచే ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేసే గ్రూపులు ఏర్పాడ్డాయి. బయట నుంచి మేధావులు వీటికి సహకరించారు. 1995లో ఐక్యరాజ్య సమితిలో ఫైడల్ కాస్ట్రో చేసిన ప్రసంగం లాటిన్ అమెరికా ప్రజల దృష్టిని ఆకర్షించింది. అప్పటికే వివిధ దేశాలు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ల దగ్గర అప్పులు తీసుకుని, కుతిక లోతుల్లోకి మునిగిపోయాయి. ఆయా దేశాల పాలకులు వారు పెట్టిన షరతుల్ని సుపరిపాలన వంటి మేలి ముసుగు పేర్లతో ప్రజల నెత్తిన రుద్దారు. విదేశీ పెట్టుబడుల పేరుతో బడా కార్పొరేట్ కంపెనీలకు తలుపులు బార్ల తెరిచారు. ప్రజల కళ్ళెదురుగానే సహజ సంపదను దోచుకుపోవడం ఆరంభమైంది. తాము భూములు కోల్పోడానికి, అప్పుల పాలు కావడానికి, త్రాగే నీళ్ళుకూడా కొనుక్కోవల్సిన దుస్థితికి కారణం ఇదేనన్న వాస్తవం వారికి అర్థమయింది. అంతర్జాతీయ సంస్థలకు వడ్డీలు కట్టడానికి సామన్యులపై భారాలు మోపారు. రవాణ ఛార్జీలు, పన్నుల భారం, నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం ఖరీదై అందని ద్రాక్షలా మారాయి. తాము తీసుకున్న అప్పులకు అప్పటికే పదింతలు వడ్డీలు కట్టినా, అప్పుల భారం తగ్గలేదు. ఇక తిరిగి వీటిని చెల్లించనవసరం లేదని, మాఫీ చెయ్యాలని ఐక్యరాజ్య సమితిలో కాస్ట్రో చేసిన గర్జన లాటిన్ అమెరికా అంతా ప్రతిధ్వనించింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం వెల్లివిరిసింది. వాటికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలపై ప్రజలు తిరుగుబాటు జెండా ఎగరేశారు.

మూడో దశ ఇక్కడే మొదలయింది. అది రాజకీయ పోరాటాల దశ. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో విశాల ఐక్యత ఏర్పడింది. స్థానిక సంఘాలతో పాటు కార్మిక, రైతు కూలీ సంఘాలు, యువజన, విద్యార్థి, మేధావి, మహిళా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, పర్యావరణ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చాయి. క్రిస్టియన్ మత సంబంధమైన విముక్తి వాదులు(థియాలజిస్టులు), కవులు, కళాకారులు,

**“ తాము తీసుకున్న అప్పులకు అప్పటికే పదింతలు వడ్డీలు కట్టినా, అప్పుల భారం తగ్గలేదు. ఇక తిరిగి వీటిని చెల్లించనవసరం లేదని, మాఫీ చెయ్యాలని ఐక్యరాజ్య సమితిలో కాస్ట్రో చేసిన గర్జన లాటిన్ అమెరికా అంతా ప్రతిధ్వనించింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం వెల్లివిరిసింది. వాటికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలపై ప్రజలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. ”**



*2013 సమావేశంలో అభివాదం చేస్తున్న 'అల్బా' నాయకులు*

మేధావులు రంగు భేదాలను వదిలేసి ఈ ఉద్యమాలకు మద్దతుగా నిలబడ్డారు. అర్జెంటైనా దేశంలో పాలన సాగించలేక ఏడాదిలో ముగ్గురు అధ్యక్షులు దిగిపోయారు.

నాలుగో దశ వామపక్ష ప్రభుత్వాల ఏర్పాటు. అప్పటి వరకు కొన్ని దేశాల్లో నియంతలే పాలకులు. కొన్ని దేశాల్లో ఎన్నికలు జరిగినా నామమాత్రంగా జరిగేవి. అతి తక్కువ సంఖ్యలో పోలింగ్ జరిగేది. ప్రజలు కూడా తమ జీవితాల్లో ఏమాత్రపు మార్పు చూపించని ఎన్నికలపై అనాసక్తితో ఉండేవారు. కాని ఈ తిరుగుబాటు తరువాత జరిగిన ఎన్నికలు సరికొత్త అధ్యాయాలను సృష్టించాయి. ప్రజలు వెల్లువగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొని, అప్పటి వరకు ఉండే పాలకులను చెత్త బుట్టలో పడేశారు. బ్రెజిల్, అర్జెంటైనా, పెరూ, ఎల్‌సాల్వడార్ లాంటి దేశాల్లో మధ్యంతర వామపక్ష వాదులు ఎన్నిక కాగా, వెనిజులా, బొలీవియా, ఈక్విడార్ వంటి దేశాల్లో సోషలిజాన్ని నిర్మించాలన్న ధ్యేయంతో పుట్టుకొచ్చిన కొత్త వామపక్ష శక్తులు అధికారాన్ని చేపట్టాయి.

ఈ పుస్తకంలోని రెండో భాగం అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వాల ముందుకొచ్చిన సరికొత్త సవాళ్లను వివరిస్తుంది, ప్రజలు కోరుకుంటున్న మార్పు ఎలా తీసుకురావాలి, ఈ మార్పు ఏ దిశగా సాగాలి వంటి మౌలికమైన ప్రశ్నలు ఎదురయ్యాయి. పాలకుల్లో ఎక్కువ భాగం అభ్యుదయవాదులైనప్పటికి వారు మార్క్సిస్టులు కారు. పైగా సోవియట్ పతనం తరువాత యువతరంలో సోషలిజం పట్ల ఆకర్షణ తగ్గిపోయింది. కమ్యూనిస్టు వ్యతిరేకత ప్రబలింది. అన్నిటికంటే పాలకుల ముందుకొచ్చిన అతి పెద్ద సవాలు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఒత్తిడి తట్టుకోవడం. అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి నిలబడటం. మిలటరీలో, ప్రభుత్వ యంత్రాంగంలో తిష్ట వేసిన అమెరికా అనుకూల, సిఐఎ ఏజెంట్లను ఏరిపారేయటం. ఈ సవాళ్లను ఎదుర్కోవటం ఒక నాయకుని వల్లనో, ఒక దేశం వల్లనో అయ్యే పనికాదు. అందుకే లాటిన్ అమెరికా పాలకుల మధ్య పొత్తు అనివార్య మయింది. మొదట క్యూబా, వెనెజులా మధ్య ఆరంభమైన స్నేహ వారధి, అల్బా పేరుతో లాటిన్ అమెరికా అంతా విస్తరించింది. అప్పటికే అమెరికా ఆధిపత్యంలో ఉన్న ప్రాంతీయ సంఘానికి ఇది ప్రత్యామ్నాయ రూపం తీసుకుంది. తమ దేశాల మధ్య ఉమ్మడి కరెన్సీని, ఉమ్మడి సహకార ఒప్పందాలను, ఉమ్మడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. లాటిన్ అమెరికాలో అమెరికా ఆధిపత్యాన్ని నిలువరించేందుకు ఈ చర్యలు దోహదపడ్డాయి. వెనెజులా, బొలీవియా, ఈక్విడార్ ప్రభుత్వాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు భిన్నమైన నూతన తరహా సమాజాన్ని నిర్మించేందుకు నడుం కట్టాయి. ఛావేజ్ దీనికే "21వ శతాబ్దపు సోషలిజ"మని నామకరణం చేశారు. 20వ శతాబ్దంలో సోషలిజమంటే సోవియట్ యూనియన్ (రష్యా) తరహాలో ఉంటుంది. అది విఫల నమూనా అని వారి అభిప్రాయం. 21వ శతాబ్దపు సోషలిజానికి ప్రజల భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యం, అధికార వికేంద్రీకరణ మూల స్థంభాలుగా ఉండాలని వారు భావించారు.

**"ఒక వర్గంలో ఉన్న వివిధ తరగతుల అస్తిత్వాన్ని కాపాడటం, వివిధ అస్తిత్వాలు ఉన్న ప్రజల మధ్య వర్గ ఐక్యతను పెంపొందించడం లాటిన్ అమెరికా వామపక్ష ఉద్యమ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అస్తిత్వాల పేరుతో చీలిపోకుండా, ఐక్యతను పెంపొందించాలంటే వర్గ దృక్పథం ఉండాలి. సామాజిక అస్తిత్వాలను గుర్తిస్తూనే, అంతిమంగా అవి వర్గ ఐక్యతతో ముందుకు పోయేటట్లు చేయడంలోనే లాటిన్ అమెరికా వామపక్ష ఉద్యమ విజయ రహస్యం దాగి ఉంది."**

ప్రజాస్వామ్యమంటే ఐదు సెకెండ్లలో అయిపోయే ఓటింగ్ కాదని, రోజువారి పాలనలో ప్రజలు ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలని ఛావేజ్ లాంటి నాయకులు భావించారు. కార్పొరేట్ ప్రజాస్వామ్యంలో ఓట్లు వేసిన తరువాత ప్రజల అభిప్రాయాలకు విలువ ఉండదు. పాలకుల వాగ్దానాలకు గ్యారెంటి ఉండదు. తమకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చెయ్యకుండా, ఎన్నికల్లో చెప్పని అంశాలను అమలుచేసేందుకు పూనుకుంటున్న పాలకుల్ని మధ్యలో దించేసే అవకాశం ప్రజలకు లేదు. అవి పేరుకు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలైనా వెనకుండి ప్రభుత్వాలను నడిపించేది మాత్రం బడా కార్పొరేట్ శక్తులు, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు. దీనికి భిన్నమైన ఎన్నికల విధానం వెనెజులాలో ప్రవేశపెట్టారు. రెండు వందల నుండి ఐదు వందల మందితో స్థానిక కమ్యూనిటీలను ఏర్పాటు చేశారు. వారందరు కలసి తమ ప్రతినిధిని ఎన్నుకుంటారు. వారికి జీతం కూడా అదే కమ్యూనిటీ ఇస్తుంది. ఈ కమ్యూనిటి ప్రతినిధుల ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాడతాయి. తమకు ఇచ్చిన మాట ప్రకారం నిలబడక పోతే, వారిని మధ్యలో దించేసి కొత్త వారిని ఎన్నుకుంటారు. ఎన్నికల సమయంలో ప్రజలకు చెప్పకుండా మధ్యలో ఏదైనా నూతన విధానం ప్రవేశపెట్టదలచుకుంటే దానికి ప్రజల సానుకూలత ఉందో లేదో తెలుసుకోడానికి రెఫరెండం పెడతారు. ప్రజల ఓట్లతో ఎన్నికై, ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న భారతదేశ ప్రజాప్రతినిధుల వ్యవస్థ పూర్తిగా దీనికి భిన్నమైనది. ఇక్కడ ప్రజాప్రతినిధులు ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలపై పెత్తనం చెలాయిస్తారు. అక్కడ ప్రజాభిప్రాయానికి లోబడి ప్రతినిధులు వ్యవరిస్తారు. అందుకే దీనికి భాగస్వామ్య ప్రజాస్వామ్యం అని పేరు పెట్టారు.

ప్రభుత్వ విధానాల నిర్ణయం, అమలులో ప్రజల మధ్య వైరుధ్యాలు ముందుకు వస్తాయి. వివిధ వర్గాలు, తరగతుల మధ్య సహజసిద్ధంగా ఉండే వైరుధ్యాలను చాకచక్యంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. మన దేశంలో ఈ వైరుధ్యాలను ఘర్షణల స్థాయికి తీసుకుపోయి. ప్రజల మధ్య వైషమ్యాలను, అనైక్యతను పాలకులు శాశ్వతంగా పెంచుతున్నారు. మనదేశంలో ఉన్నట్లుగానే లాటిన్ అమెరికా దేశాల్లో కూడా అస్తిత్వ వాదం వివిధ రూపాల్లో ఉంది. ఒకనొక తరగతి ప్రజలు తమ భాషకు, సాంస్కృతిక, సామాజిక స్థితికి గుర్తింపు కావాలని కోరుకోవడం తప్పుకాదు. అందులో ఉండే ప్రజాస్వామిక వాంఛను గుర్తిస్తే పరిష్కారం లభిస్తుంది. దానికి భిన్నంగా ఈ ప్రజాస్వామిక వాంఛని ప్రజల మధ్య సంఘర్షణగా మన పాలకులు మారుస్తున్నారు. దానికి భిన్నంగా తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే, మరొక తరగతి ప్రజలతో కలసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలను లాటిన్ అమెరికా వామపక్ష ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ఒక వర్గంలో ఉన్న వివిధ తరగతుల అస్తిత్వాన్ని కాపాడటం, వివిధ అస్తిత్వాలు ఉన్న ప్రజల మధ్య వర్గ ఐక్యతను పెంపొందించడం లాటిన్ అమెరికా వామపక్ష ఉద్యమ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అస్తిత్వాల పేరుతో చీలిపోకుండా, ఐక్యతను పెంపొందించాలంటే వర్గ దృక్పథం ఉండాలి. సామాజిక అస్తిత్వాలను గుర్తిస్తూనే, అంతిమంగా అవి వర్గ ఐక్యతతో ముందుకు పోయేటట్లు చేయడంలోనే లాటిన్ అమెరికా వామపక్ష ఉద్యమ విజయ రహస్యం దాగి ఉంది. ఈ స్ఫూర్తితోనే వివిధ కమ్యూనిటీల ప్రతినిధులు అధికారంలో భాగస్వామ్యలు అవుతున్నారు. సామాజిక స్ఫూర్తితో కూడిన వర్గ దృక్పథం లాటిన్ అమెరికా దేశాల ఐక్యతకు సాధనంగా మారింది.

పాత సోవియట్ యూనియన్ తరహాలో సోషలిజాన్ని నిర్మించలేమని గ్రహించిన లాటిన్ అమెరికా కొత్త పాలకులు, మరో మార్గాన్వేషణకు ప్రయోగాలు చేస్తున్నారు. రష్యాలో విప్లవం సోవియట్లకే సర్వాధికారం అనే నినాదంతో వచ్చింది. ఆ స్ఫూర్తి తోనే సోవియట్ యూనియన్ ఏర్పడింది. అయితే క్రమంగా సోవియట్ల అధికారాలు తగ్గి యూనియన్ చేతుల్లో అధికారం కేంద్రీకృతమౌతూ వచ్చింది. నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం తగ్గింది. పరిపాలన నుండి వారు వేరు పడ్డారు. ఈ భావమే సోవియట్ పతనానికి దారి తీసింది.

మరొక ధోరణి సోషలిజమంటే ప్రభుత్వ రంగమనే భావన. కార్మిక యాజమాన్యంలో నడవాల్సిన ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వ అధికారుల చేతుల్లోకి మారింది. ఫ్యాక్టరీల నిర్వహణ నుండి కార్మికులు వేరు పడ్డారు. ఈలోపాలను గుర్తించిన లాటిన్ అమెరికా వామపక్ష పాలకులు ఫ్యాక్టరీలు, ప్రభుత్వ సంస్థలను సామాజిక యాజమాన్యంలోకి తెచ్చారు. పాఠశాలలు, వైద్యశాలలు కమ్యూనిటీ ఆధీనంలోకి వచ్చాయి. తద్వారా ప్రజలు తమ దేశాన్ని తామే పరిపాలించుకుంటాము, తమ మంచి, చెడ్డలకు తామే బాధ్యులమనే చైతన్యం పెరుగుతుంది. పరిపాలనలో భాగస్వామ్య ప్రజాస్వామ్యం, పరిశ్రమ నిర్వహణలో కార్మికుల భాగస్వామ్యం, విద్య, వైద్య నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంత ఎక్కువగా ఉంటే వామపక్ష ఉద్యమ భవిష్యత్ అంత చక్కగా ఉంటుంది. సైద్ధాంతిక చైతన్యంతో పాటు వ్యవస్థ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని బట్టి వామపక్ష ఉద్యమ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

ఇక మూడో భాగంలో వామపక్ష ప్రభుత్వాల సుస్థిరతలో ప్రజల భాగస్వామ్యంతో పాటు వారి సైద్ధాంతిక ఐక్యత ప్రముఖ పాత్ర పోషిస్తుంది. గ్రామ్‌సీ చెప్పినట్లుగా సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించడం ద్వారా మాత్రమే సోషలిజం దీర్ఘకాలం మనగలుగుతుందని రచయిత అభిప్రాయపడ్డారు. దీనికి ప్రభుత్వాన్ని ఒక సాధనంగా మలచుకోవడంతో పాటు ప్రజాసంఘాల పాత్ర, రాజకీయ పార్టీ ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. సామాజిక సుస్థిరతకు ప్రజల రాజకీయ చైతన్యమే కొలబద్ధగా ఉంటుంది. దాన్ని అధికారబలంతో ప్రజలపై రుద్దడం ద్వారా సాధించలేమని, ప్రజలను స్వచ్ఛందంగా తమ తమ సంస్థలలో సంఘటితం చేయడం ద్వారా చేయాలని మార్తా ఈ పుస్తకంలో చెప్పారు. దానికి గతంలోని చేదు అనుభవాలను, ప్రస్తుత లాటిన్ అమెరికా నూతన అనుభవాలను జోడించి వివరించారు. ఈ అనుభావాలు లాటిన్ అమెరికా ప్రజలకే కాదు. మనకీ ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. ❋

ఈ మాసం ప్రత్యేకం

# వేదకాలంలో ఆవు మాంసం ప్రీతికరమైన ఆహారం



రచయిత ప్రఖ్యాత చరిత్రకారుడు

**డి యన్ ఝా**

*ప్రాచీన, మధ్యయుగాల నాటి భారతదేశ చరిత్ర నిపుణుడు ఆవు పవిత్రత గురించి, భారతదేశంలో గొడ్డు మాంసపు భోజన పద్ధతులు, పురాణగాథలలో ఆవు పవిత్రతను గురించిన కట్టుకథలను బట్టబయలు చేసిన రచయిత **డి.ఎన్. ఝా**తో ఫ్రంట్‌లైన్ విలేకరి అజయ్ ఆశీర్వాద్ మహా ప్రశస్థ ఇంటర్వ్యూను మార్చిస్తు పాఠకులకు అందిస్తున్నాం:*

ఆవును చంపటం, గొడ్డుమాంసాన్ని ఆహారంగా వినియోగించుకోవటం మరొకసారి రాజకీయ తుపాను సృష్టిస్తున్నది. ఆవును రక్షించాలనే ప్రచారాన్ని తీవ్రంచేస్తూ, దేశవ్యాప్తంగాహిందూ, ముస్లిం మతాలకు చెందిన ప్రజలను మతాల వారీగా వేరుచేస్తూ, మత పరంగా ఐక్యంచేసే విధంగా, ఆవును రాజకీయ చిహ్నంగా ఉపయోగించుకోవటంలో ప్రభుత్వ సహాయంతో పనిచేసే హిందూత్వ వాదులు సఫలీకృతులయ్యారు. ఈ నేపథ్యంలో శతాబ్దాల పైబడి భారతదేశంలో ఆహారపు అలవాట్లు, వాటిలో ఆవుయొక్క స్థానం మొదలైన అంశాలపై ప్రముఖ చరిత్రకారుడు డి.ఎన్.ఝా తన అభిప్రాయాలను వివరించారు. ప్రాచీన, మధ్యయుగాల భారతదేశ చరిత్రమీద అనేక పుస్తకాలు రాశారు.

ఆయన వ్రాసిన పుస్తకాలలో ముఖ్యమైనవి పవిత్రమైన ఆవు; భారతీయ ఆహారపు అలవాట్లలో గొడ్డుమాసం (2002); ఆవుయొక్క పురాణగాథ (2009)లాంటి వాటి ద్వారా విస్తారమైన చారిత్రక ఆధారాలతో, ప్రాచీన కాలంనుండి భారతదేశంలో గొడ్డుమాంసం వినియోగం ఉన్నదని రుజువు చేశారు. ఆ విధంగా ఇస్లామిక్ రాజుల పాలనాకాలంలోనే గొడ్డుమాంసపు ఆహారపు అలవాట్లు ప్రవేశపెట్టబడినాయి అనే హిందూత్వ వాదుల కట్టుకథలను తిప్పికొట్టారు. ఆయన పుస్తకాలు తీవ్రమైన వివాదాలకు కారణమైనాయి, అంతేగాక ఆ అంశాలను వ్రాసినందుకు కరుడు గట్టిన హిందూత్వ వాదుల నుండి హత్యా బెదిరింపులను కూడా ఎదుర్కొన్నారు. హిందూత్వవాదుల రాజకీయ ప్రయోజనాల కోసం గొడ్డు మాంసం తినడం తప్పని ఒక ప్రణాళిక ప్రకారం ఏ విధంగా ప్రచారం చేయబడిందో, చరిత్రను తిరగ రాయడం ద్వారా హిందూ అతివాదులు తమ దీర్ఘ కాలిక రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవటానికి ఏ విధంగా ప్రయత్నం చేస్తున్నారో ఆయన వివరించారు.

**ప్రశ్న : ప్రాచీన భారతదేశ ఆహార అలవాట్ల గురించి చారిత్రక పరిశోధన చేసే విధంగా మిమ్మల్ని ప్రోత్సహించిన అంశాలేవి? గొడ్డు మాంసం తినడం అనేది ప్రధాన సమస్యగా మీ గ్రంథంలో ఎందుకు ఉంది?**

**జవాబు :** హిందూ అస్తిత్వ సమస్య మీద, దానితో సంబంధం ఉన్న ఆహార సంస్కృతి మీద నాకు ఆసక్తి కలిగినప్పటి నుండి, భారతదేశ పూర్వ చరిత్రలో ఆహార అలవాట్ల మీద పరిశోధన చేసే బాధ్యతను తీసుకున్నాను. గొడ్డు మాంసం తినడానికి సంబంధించి పరిగణనలోకి తీసుకోదగిన సమాచారం పూర్వ ఆహారపు అలవాట్లలో కలిసి ఉంది అని నేను నా అధ్యయన పద్ధతుల ద్వారా తెలుసుకున్నాను. కేంద్రంలో ఎన్.డి.ఎ.-1 అధికారంలో ఉన్నకాలంలో ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాలలో ఉన్న 'గొడ్డు మాంసం తినడం' అనే దానిపై వివాదం నడిచింది. ఆ సమయంలో దానికి సంబంధించిన సమాచారం మొత్తాన్ని ఒకచోటికి చేర్చి, దానిని పుస్తకరూపంలోకి తీసుకువచ్చి చదువరులకు తెలియచేయాలన్న విషయం నన్ను ప్రేరేపించింది. అందువల్లనే నా పుస్తకంలో గొడ్డుమాంసం తినడానికి సంబంధించిన చరిత్ర ప్రధాన సమస్యగా వచ్చింది. కానీ మీరు ఆ పుస్తకం చదివేటట్లయితే ఇతర జంతువుల మాంసం తినడానికి సంబంధించిన అలవాట్లకు సంబం ధించిన ఆధారాలు కూడా చాలా దొరుకుతాయి.

**ప్రశ్న : వ్యవసాయాధారిత భారత ఆర్థిక వ్యవస్థలో ఆవు ఒక ముఖ్యమైన సాధనంగా ఉండేది. పూర్వ భారతదేశంలో అటువంటి ఆవును బలి ఇవ్వడం, చంపడం వెనుక ఏదైనా ఆర్థిక తర్కం ఉన్నదా?**

**జవాబు :** పశువులను బలివ్వటాన్ని ఆర్థిక, సామాజిక కారణాలతో వివరించవచ్చు. క్రీస్తు పూర్వం 2వ సహస్రాబ్దపు మధ్యకాలంలో ఇండో-ఆర్యులు భారతదేశానికి వలస వచ్చిన విషయం మీకు తెలిసినదే. వారు తమతోపాటు ఇండో-యూరోపియన్‌ల జీవనానికి సంబంధించిన అనేక లక్షణాలను, ప్రత్యేక అంశాలను కూడా తెచ్చారు. అటువంటి వాటిలో గొర్రెలు, మేకలు మరియు ఆవుల పెంపకం, ప్రారంభ దశలో ఉన్న వ్యవసాయం, మత విశ్వాసాలు, ఆచారాలు, జంతువులు, పశువుల బలులను, ఎవరికోసమైతే బలులు ఇస్తామో ఆ ఇండో-ఇరానియన్ దేవుళ్ళను (ఉదా:- ఇంద్రుడు, అగ్ని, చంద్రుడు) కూడా తెచ్చారు. స్థిరమైన వ్యవసాయ విధానం అభివృద్ధి చెందినప్పటి నుండి పశువులు, జంతువుల బలులు ఆహార సంబంధమైన అవసరంగా కూడా మారాయి. దేవుళ్ళ గుంపులో ఇంద్రుడికి ఎద్దులు, గేదెల మాంసం అంటే ప్రత్యేకమైన ఇష్టంగా ఉండేది. మనుషుల్లో

> "పితృ దేవతలను (చనిపోయిన పూర్వీకులు) ఒక సంవత్సరం పాటు ఆవు మాంసం ఎలా సంతృప్తి పరుస్తుందో ఆపస్తంభ ధర్మసూత్రంలో చెప్పడం జరిగింది. కాబట్టి ఆవును చంపడం, దాని మాంసం తినడం అనేది వేదకాలము మరియు ఆ తర్వాత పూర్తిగా సాధారణ విషయం అనే దాంట్లో ఎటువంటి సందేహం లేదు."

గౌరవనీయులైన ఋషులైన మిథిల, యజ్ఞవల్క్యులకు ఆవుమాంసం అంటే ఇష్టంగా ఉండేది.

**ప్రశ్న : వేదకాలము, ఆ తరువాత ప్రజల యొక్క ఆహారపు అలవాట్లపై పరిశోధన చేసిన ఇతర చరిత్రకారులెవరైనా ఉన్నారా? డి.డి. కొశాంబి పురాతన భారతదేశం అనే తన గ్రంథంలో బ్రాహ్మణులు గొడ్డుమాంసం తినేవారు అని రాశారు. దాని గురించి వ్యాఖ్యానించండి?**

**జవాబు :** వేదకాలంలో గొడ్డుమాంసం అలవాటు గురించి వ్రాసిన మొట్టమొదటి భారతీయ మేధావి ఆర్.ఎల్. మిత్రా. పి.వి. కణే, డి.డి. కోశాంబి, అనేకమంది ఇతర పండితులు కూడా దాని గురించి ప్రస్తావించారు. కాబట్టి ఆవులను బలి ఇవ్వడం, గొడ్డుమాంసం తినడానికి సంబంధించిన రచనలను చేసిన మొదటి వ్యక్తిని నేనొక్కడినే కాను. ఇతర చరిత్రకారుల వలేకాక, భారతీయ సాంప్రదాయంలో వేదకాలం తరువాత కూడా గొడ్డుమాంసం తినడం ఒక సాంప్రదాయంగా మిగిలి ఉందని నేను వాదిస్తున్నాను. అందుకు విస్తారమైన సాక్ష్యాధారాలను కూడా ఉదహరిస్తున్నాను.

**ప్రశ్న : భారతదేశంలో గొడ్డు మాంసం తినడమనేది ప్రాచీన, మధ్యయుగాలలో సాధారణమైన అలవాటు అనిమీ పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అందుకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన చారిత్రక పుస్తకాలను సూచించగలరా? ఆవు 'పూజింపబడే జంతువుగా' కూడా చలామణి అయ్యిందనే దానిపై ప్రాచీన గ్రంథాలలో ఉదాహరణలు ఉన్నాయా?**

**జవాబు :** "ఆవు పవిత్రత బూటకం" (ద మిత్ ఆఫ్ హోలీ కౌ) అనే నా గ్రంథంలో ముస్లీంల పాలనలోనే కాక, వేదకాలంలో గొడ్డుమాంసం తినడం సాధారణ విషయంగా ఉన్నదని స్పష్టం చేశాను. దేవుళ్ళకు బలులు ఇవ్వడం అనేది అనేక పుస్తకాలలో సూచించబడిన ఆధారాల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నది. ఇవి వేదకాలము నుంచి అలాగే వేదకాలము తరువాత ఉన్న ముఖ్య గ్రంథాలు. ఋగ్వేదంలో ఒకచోట (X.86.14), వేదకాలము నాటి దేవుళ్ళలో అత్యంత గొప్పవాడైన ఇంద్రుడు "వారు నాకోసం ముప్పై అయిదు ఎద్దులను వండారు" అని వివరించాడు.. మిగిలినచోట్ల ఎద్దు మాంసం తిన్నట్లుగా సూచించారు. (X.28.3), వాటిలో ఒకటి (X.27.2), లేక వంద గొడ్లు (IV.17.11), లేక 300 గొడ్లు (V.29.7) లేక 1000 గొడ్లు (VIII.43.11). ఋగ్వేదంలో వివరించిన విధంగా అగ్నికోసం కూడా పశువులను బలి ఇచ్చేవారు. "అగ్ని యొక్క ఆహారం ఎద్దు మరియు వట్టిపోయిన ఆవు" అని వివరించారు. ఇటువంటివే అనేక సూచనలు వేదకాలం తరువాత ముఖ్య గ్రంథాలలో లభ్యమవుతాయి. అటువంటి వాటిలో ఒకటి, ఐతరేయ బ్రాహ్మణం (V.9.8) లో బలి ఇవ్వబడిన ఆవు "నిజమైన ఆహారం" అని స్పష్టంగా చెప్పబడింది. యజ్ఞ యాగాదులలో ఇవ్వబడిన బలిని సర్వసాధారణంగా మానవులు భుజించడం జరిగేదని అనేక ముఖ్య గ్రంథాలలో చెప్పారు. ప్రత్యేకంగా గోపథ బ్రాహ్మణలో (I.3.18)లో జంతు కళేబరాన్ని ముప్పై ఆరు భాగాలుగా విభజించాలని ప్రత్యేకంగా చెప్పారు.

పశువులు సాధారణంగా గృహ అవసరాల కోసం కూడా చంపబడేవి. ఋగ్వేదంలో ఒక భాగం (X.85.13) వివాహ వేడుకల సమయంలో గోవులను వధించటం గురించి తెలుపుతుంది. ఐతరేయ బ్రాహ్మణం (111.4)లో "ప్రజా పరిపాలకుడు అతిథిగా వచ్చినప్పుడు లేక ఎవరైనా ఒకరు గౌరవింపదగిన అర్హత కలిగినవారు వచ్చిన సమయంలో ఆవును చంపేవారు అని చెప్పారు.

అత్యంత ముఖ్యమైన పండుగలు, ముఖ్య అతిథులు వచ్చిన సందర్భాలలో (మధుపర్క) ఆతిథ్యం ఇవ్వటం కోసం ఆవును చంపడం జరిగేదని వేదకాలపు, ఆ తరువాత ముఖ్య గ్రంథాలలో తరచుగా సూచించడం జరిగింది. 'మధుపర్క' అనేది ప్రాచీన భారతదేశంలో, తర్వాత కాలంలో కూడా ఉన్నట్లు సాహిత్య పరమైన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. పశువుల వధ కూడా మతాచార పద్ధతిలో జరిగేది. పితృ దేవతలను (చనిపోయిన పూర్వీకులు) ఒక సంవత్సరం పాటు ఆవు మాంసం ఎలా సంతృప్తి పరుస్తుందో ఆపస్తంభ ధర్మసూత్రంలో చెప్పడం జరిగింది. కాబట్టి ఆవును చంపడం, దాని మాంసం తినడం అనేది వేదకాలము మరియు ఆ తర్వాత పూర్తిగా సాధారణ విషయం అనే దాంట్లో ఎటువంటి సందేహం లేదు. పాండిత్యం గల మగ సంతానము కావాలని కోరుకొనేవారు దూడ మాంసం లేదా గొడ్డు మాంసాన్ని అన్నం, నెయ్యితో కలిపి తినాలని బృహదారణ్యక ఉపనిషత్తు (VI.4.18) హాస్యాస్పదంగా సిఫార్సు చేసింది.

గోవధ, గొడ్డు మాంసం తినడానికి సంబంధించి చాలా ఆధారాలు ఉన్నాయి. అంతేకాక యుద్ధాలలో పోరాడే వేదకాలపు ప్రజలు సమృద్ధమైన ఆస్తిగా ఆవును పరిగణించేవారు అనే దానికి కూడా బలమైన సాక్ష్యాలు ఉన్నాయి. వేదకాలపు అంశాలపై పండితుడైన మైఖేల్ విట్జల్ లేవనెత్తిన దాని ప్రకారం అది కూడా అదితిని (దేవుళ్ళ తల్లి, అయితే సాహిత్యం ప్రకారం హద్దులు లేని స్వర్గం), పోలి ఉంటుంది. భూమి (పృథ్వీ), ఇంద్రుని చేత విడుదల చేయబడిన పవిత్ర జలరాశులు, మాతృత్వము, కవిత్వము (విద్య) బ్రాహ్మణుల గుత్తాధిపత్యంలో ఉన్నాయి. తరచుగా మనకు ఆవును గురించి చెప్పేటటువంటి అంశాలు భిన్నంగానూ, పరస్పర విరుద్ధంగానూ ఉన్నాయి. కాలక్రమంలో ఇవి సాహిత్యపరంగా తీసుకురాబడినాయి. కానీ వేదకాలంలో ఆవు చంపదగనిదిగా కానీ, పవిత్రమైనదిగా కానీ లేదు.

**ప్రశ్న : కనుక, ప్రస్తుతం సంఘపరివార్ యొక్క ఎంపిక చేయబడిన, లేదా తనకు అనుకూలంగా ఉన్న ఎజెండాలో పునరుద్ధ రణవాదం ఒకటిగా ఉందా? సంఘపరివార్ భావజాలకులలో ఒకరుగా ఉన్న కె.ఆర్. మల్కాని, గొడ్డు మాంసం తినడాన్ని బహిరంగంగా సమర్థించారు కదా!**

**జవాబు :** ఆవు సమస్యపై సంఘపరివార్ యొక్క ప్రచారం సూత్ర రహితం, మోసపూరితంగా ఉన్నాయి. ఇంతకు ముందు 1966లో ఒకసారి కె.ఆర్. మల్కాని తన సంభాషణలో సహజంగా మరణించిన ఆవుల

మాంసాన్ని తినవచ్చు అని చెప్పారు. సంఘ పరివార్ యొక్క డిమాండ్ అయిన గోవధపై జాతీయ నిషేధం అనేది మల్కాని చెప్పిన అంశంతో ఎలాపొసగుతుంది?

**ప్రశ్న : హిందూ తీవ్రవాదులకు ఆవు ఒక గొప్ప రాజకీయ చిహ్నంగా మారింది. దానిని చారిత్ర కంగా మీరు ఎలా మదింపు చేయగలరు? ఎప్పుడైతే ఆవు 'పవిత్రం'గా మారిందో, దానికి సమాంతరంగా భారతీయ చరిత్రలో మతాభి మానము పెరిగింది. కొంతమంది చరిత్రకారులు 19వ శతాబ్దపు చివరిలోనే ఆవు మతపరమైన జంతువుగా పరిగణించబడింది అంటున్నారు. దీనిపై వ్యాఖ్యానించండి?**

**జవాబు :** అందుబాటులో ఉన్న ఆధారాలు తెలుపుతున్నట్లుగా మౌర్యుల కాలము తరువాత నుంచి ఆవులను చంపే బ్రాహ్మణుల పరి వర్తనలో మార్పు ప్రారంభమైనట్లుగా కన్పిస్తున్నది. దీనిని ఆర్థిక మరియు మతపరమైన అభివృద్ధిలో భాగంగా వివరించవచ్చు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. అదేమంటే ఇటీవల బ్రాహ్మణ ముఖ్య గ్రంథాలలో పదే పదే చెబుతున్న విషయమేమంటే ఆవును చంపే ఆచారం కలియుగంలో అనుమతించబడలేదు అని. దీనికి అనుగుణంగా ఆవుకు ఒక ప్రత్యేకస్థానం మరియు చంపదగనిదిగా చేయబడింది.

కావున ఆవును చంపరాదనేది బ్రాహ్మణుల యొక్క భావజాలంలో ఒక ముఖ్య భాగమైంది. మధ్యయుగాల ప్రారంభకాలంలో గొడ్డుమాంసం తినే వారికి అంటరాని కులాలుగా తక్కువ స్థానం ఇవ్వడం, ఆవును చంపేవారు అంటరాని వాడుగా ఉంటాడు అని దైవస్మృతిలో (1.12) స్పష్టంగా చెప్పారు. మధ్యయుగాల కాలంలో ఆవులను చంపటం ముస్లింలతో అనుసంధానం చేయబడింది. నిరంతరం వారు గొడ్డుమాంసం తినేవారు. అంతేకాక అప్పుడప్పుడు ఆవుకు సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడేవి. మధ్యయుగాల కాలంలో బ్రాహ్మణుల శ్రేణులలో ఆవు భావోద్వేగపు చిహ్నంగా వృద్ధి చెందింది. ఈ అంశాలను ఆలోచించి నేను ఆ వైపుగా పరిశోధనలకు మొగ్గు చూపాను. మరాఠా రాజ్యం, శివాజీ ఆవిర్భావంతో అది మరింత భావోద్వేగపూరితంగా తయారైంది. శివాజీ ఆవులు, బ్రాహ్మణుల సంరక్షకుడుగా భావించబడ్డాడు. కానీ ఇది 19వ శతాబ్దపు చివరి భాగంలో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా, రాజకీయంగా పెద్దఎత్తున జన సమీకరణకు సిక్కు కుకా' అనే ఉద్యమం ద్వారా మొదటిసారిగా ఆవు ఉపయోగించబడింది. దాదాపు అదే సమయంలో, ఖచ్చితంగా 1882లో దయానంద సరస్వతి గోరక్షిణి సభను స్థాపించి, దాని ద్వారా వివిధ వర్గాల ప్రజలను ముస్లింలకు వ్యతిరేకంగా ఏకం చేసే ప్రయత్నం చేశాడు. ప్రారంభంలో ఏదైతే బ్రాహ్మణ భావజాలంగా ఉన్నదో ప్రస్తుతం అదే హిందూ అస్తిత్వానికి గుర్తుగా మారింది.

**❝ మరోవైపు సంఘ పరివార్‌ను చూడండి. మొదటగా జేమ్స్ మిల్ భారతీయ చరిత్రను హిందూ, ముస్లిం పాలనాకాలాలుగా విభజించి ప్రకటించాడు. సంఘ పరివార్ ఇపుడు దాన్ని చరిత్రను హిందూ, ముస్లీం పాలనాకాలాలుగా విభజించటానికి ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నది. ఇప్పుడు మనం వారిని జేమ్స్ మిల్ యొక్క పిల్లలుగా పిలవాలా? ❞**



**బిషాదా గ్రామంలో నిషేదాజ్ఞలున్నా ప్రజల్ని రెచ్చగొడుతూ ప్రసంగిస్తున్న గొడ్డుమాంసం ఎగుమతిదారుడు, బిజెపి ఎంఎల్ఎ సంగీత్ సోమ్**

ముస్లిం కాలంగా చెప్పబడిన కాలంలో పాలకులందరూ ముస్లింలు కాదు. చోళులు ముస్లింలు కారు.

**ప్రశ్న : భారతదేశంలో వృత్తిపరమైన చరిత్ర కారులను, వారియొక్క నిర్ధారణలను సంఘ పరివార్ తరచుగా తిరస్కరిస్తున్నది. భారతీయ చరిత్రకారులు పాశ్చాత్య చరిత్రకారుల చేత ప్రభావితం చేయబడ్డారు. అందువల్లనే వారు భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలను సరైన పద్ధతిలో అధ్యయనం చేయటంలో విఫలమ య్యారు అని సంఘ పరివార్ అంటుంది. భార తీయ చరిత్రకారులను 'మెకాలే, మార్క్స్ కొడు కులు'గా హిందూత్వ సిద్ధాంత ప్రతిపాద కులు అంటున్నారు. దానిపై వ్యాఖ్యానించండి?**

**జవాబు :** వృత్తిపరంగా చరిత్రకారులుగా ఉన్నవారు రాసిన చరిత్రను తిరస్కరించటం భారతీయ చరిత్ర పరిశోధనా విధానం గురించి, పశ్చిమ దేశాల చరిత్ర పరిశోధనా విధానం గురించి, చరిత్ర పరిశోధనపై హిందూత్వ వాదు లకున్న తీవ్రమైన అజ్ఞానాన్ని తెలియ జేస్తున్నది. స్వాతంత్ర్యానంతరం భారతీయ చరిత్రకారులు చరిత్రను రాస్తున్న తీరును పరిశీలిస్తే, వలసవాద చరిత్రకారులు చరిత్రను రాయటానికి ఉ పయోగించిన మౌలిక సూత్రీకరణలను వీరు గట్టిగా ప్రశ్నిస్తున్నారు. అంతేకాక భారతదేశపు గతాన్ని తెలుసుకోవడానికి ఒక ప్రత్యామ్నాయ అవగాహనను సమకూర్చారు. మరోవైపు సంఘ పరివార్‌ను చూడండి. మొదటగా జేమ్స్ మిల్ భారతీయ చరిత్రను హిందూ, ముస్లిం పాలనాకా లాలుగా విభజించి ప్రకటించాడు. సంఘ పరివార్ ఇపుడు దాన్ని చరిత్రను హిందూ, ముస్లీం పాలనాకాలాలుగా విభజించటానికి ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నది. ఇప్పుడు మనం వారిని జేమ్స్ మిల్ యొక్క పిల్లలుగా పిలవాలా?

**ప్రశ్న : పూర్వపు భారతీయ ఆచారాలను**


**❝ ఎన్.డి.ఎ. ప్రభుత్వం యొక్క జాతీయ వాదం మోసపూరితమైనది. బిజెపి, ఇతరసంస్థలు ఎన్నడూ బ్రిటీష్‌వారి ఆక్రమణకు వ్యతిరేకంగా, దేశంకోసం పోరాటం చేయలేదు. దాని యొక్క అత్యంత గౌరవనీయుడైన నాయ కుడు, 'వీర్' సావర్కర్, బహుశా వీరుడుగా! (ధైర్యంగా) బ్రిటీష్‌వారిని క్షమాభిక్ష కోసం అభ్యర్థించాడు. ❞**

గొప్పగా చెప్పుకొనే ప్రయత్నాలను కొత్తగా సంఘ పరివార్ చేస్తున్నది. అంతేకాక మధ్యయుగ కాలాన్ని తక్కువ చేస్తున్నది. చరిత్రను హిందూ, ముస్లిం పాలనా కాలాలుగా విభజిస్తున్నది. మీ ఆలోచన ప్రకారం ఈ విభజనలో ఉన్న సమస్యలు ఏమిటి?

**జవాబు :** హిందూముస్లిం పాలనా కాలాలుగా విభజింపబడిన భారతీయ చరిత్ర పాలకుల అహంకారపూరితమైన నడ వడిక మీద ఆధారపడి ఉంది. గతంలో ఉన్న వారందరూ హిందూ పాలకులుగా ఉన్నారని, తరువాత పాలించిన వారంతా ముస్లింలని అంటున్నారు. కానీ ఇది ఎంతమాత్రం నిజం కాదు. ప్రాచీన భారతదేశంలో హిందూ కానీ, హిందూయిజంకానీ లేదు. ప్రాచీన భారత దేశంలో అత్యంత ప్రసిద్ధిచెందిన పాలకుడు అశోకుడు., కానీ, అతడు 'హిందువు' కాదు. అలాగే ఏదైతే ముస్లిం కాలముగా చెప్పబడు తుందో ఆ కాలానికి చెందిన పాలకులందరూ ముస్లింలు కాదు. చోళులు ముస్లింలు కారు.

భారతీయ చరిత్ర రచనలో ఈ పాలనా కాలపు వర్గీకరణ మతదురభిమానాన్ని కలిగి, హిందూ పాలనా కాలాన్ని గొప్పగా కీర్తించే విధంగానూ, ముస్లింల పాలనాకాలాన్ని కించ పరిచే విధంగానూ ఉంది. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక (సాంకేతిక అభివృద్ధిని కూడా కలుపుకొని) రంగాలలో చరిత్రను మలుపు దిద్దిన అంశాల ఆధారంగా చాలా మంచిదైన ఒక వర్గీకరణ ప్రణాళికను వృద్ధి చేయవచ్చు. పరిపాలించే రాజవంశాలలో అనుకోకుండా జరిగే మార్పుల ఆధారంగా మరింత ఖచ్చితంగా కూడా వర్గీకరణ చేయవచ్చు. ఇది దీర్ఘకాలికంగా సామాజికంగా జరిగే మార్పులకు సంబంధిం చిన చాలా అంశాలను వివరిస్తుంది.

**ప్రశ్న : కేంద్రంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వా నికి జాతీయవాద ఎజెండా ఉన్నప్పటికీ బ్రిటీష్ వలస పాలనా కాలంపై పరిశోధించ దానికి ఏ మాత్రం శ్రద్ధ చూపటంలేదు. ఎందు వలన?**




**జవాబు :** ఎన్.డి.ఎ. ప్రభుత్వం యొక్క జాతీయ వాదం మోసపూరితమైనది. బిజెపి, ఇతరసంస్థలు ఎన్నడూ బ్రిటీష్‌వారి ఆక్రమణకు వ్యతిరేకంగా, దేశంకోసం పోరాటం చేయలేదు. దాని యొక్క అత్యంత గౌరవనీయుడైన నాయ కుడు, 'వీర్' సావర్కర్, బహుశా వీరుడుగా! (ధైర్యంగా) బ్రిటీష్‌వారిని క్షమాభిక్ష కోసం అభ్యర్థించాడు. ఎవరైతే స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారో వారి త్యాగాన్ని తుడిచి వేయ డానికి, లేదా నీరు కార్చడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. దయచేసి నెహ్రూకాలపు చరిత్రకారులకు వ్యతిరేకంగా సుబ్రహ్మణ్యస్వామి తిట్లవర్షాన్ని నిలుపు చేయాలని కోరుతున్నాను.

**ప్రశ్న : ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన చరిత్రకారుల మధ్య ఉన్న సాధారణమైన ఏకాభి ప్రాయాన్ననుసరించి, చారిత్రక అంశాలపై ఏ విధమైన పరిశోధన అయినా ఆ కాలంలోపాలిం చిన ప్రభుత్వం యొక్క స్వభావాన్ని గమనంలో ఉంచుకొని వ్యక్తులు, ఆర్థిక వ్యవస్థలు, సమాజము మొదలైన వాటిని గురించి తెలుసుకోవడం సరియైన అధ్యయనంగా ఉంటుంది. ఈ విధ మైన అంశాలను పరిగణనలోకి తీసుకొని చారి త్రక అంశాలపై పరిశోధించడం చరిత్ర అధ్య నంలో అత్యంత ప్రధానమైన మార్గంగా పరి గణించబడుతుంది. సంఘపరివార్ చరిత్రను ఆనాటి సందర్భం నుండి విడదీసి, వ్యక్తులను పరిశీలిస్తున్నది. జీవిత చరిత్రల ఆధారంగా చరిత్రను అధ్యయనం చేసేక్రమంలో షాజహాన్, ఔరంగజేబు, గజనీ మహమ్మద్‌లను దుష్టులుగా ముద్రవేస్తున్నారు. హిందూ పాలకులైన మహా రాణా ప్రతాప్, పృథ్వీరాజ్ చౌహాన్‌లాంటి వారి ని హీరోలుగా చేస్తున్నారు. ఈ రకమైన చరిత్ర అధ్యయన పద్ధతుల వలన ఎటువంటి సమస్య లు ఎదురౌతాయని మీరు భావిస్తున్నారు?**

**జవాబు :** గత ప్రశ్నకు నా స్పందనకు దీనికి సంబంధం ఉంది. ఆ కాలంలో ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు ఇతర రకాలైన పరిస్థితుల ఆధారంగా పాలకులను అంచనా వేయాలి. ఆ సందర్భం నుండి విడదీస్తే, చరిత్ర వ్యక్తులను కీర్తించేదిగా మారుతుంది. పృథ్వీరాజ్ చౌహాన్ మరియు మహారాణా ప్రతాప్ లాంటి వాళ్ళను కీర్తించటం, యుద్ధాలలో వారిని ఓడించిన ముస్లిం పాలకులను దుర్మార్గులుగా చిత్రించటం జరుగుతుంది.

**ప్రశ్న : వృత్తిపరమైన చరిత్రకారులు సిద్ధాంత పరంగా హిందూ వ్యతిరేకులు, హిందూయిజం యొక్క సాంప్రదాయాలను సరిగా పరిశీలించలేని మూర్ఖులు అంటూ, అదే సమయంలో ఇతర మతాల సాంప్రదాయాల పట్ల సునిశితమైన ఆసక్తిని చూపుతారని హిందూత్వ సిద్ధాంతాన్ని బహిరంగంగా బలపరిచే వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఇవి నిజమా?**

**జవాబు :** ఇది పూర్తిగా సత్యదూరం. భారతదేశం, విదేశాలకు చెందిన వృత్తిపరమైన చరిత్రకారులు ప్రాచీన, మధ్యయుగాల నాటి మతపరమైన అంశాలను మరింత శ్రద్ధ, అంకితభావాన్ని కలిగి అధ్యయనం చేస్తారు. డి.డి. కోశాంబి, ఆర్.ఎస్. శర్మ, రొమిలా థాపర్, గంథర్ డైట్జ్ సన్ థిమర్ మరియు అనేకమంది ఇతర మేధావులు భారతదేశంలోని ఐక్యతా సాంప్రదాయాన్ని విశ్లేషించారు. కానీ హిందూ త్వకు అనుకూలంగా ఉన్నవారు వాటిని చద వరు... వారు కేవలం బిగ్గరగా అరవడం మాత్ర మే చేస్తారు. వారు అనేక అంశాలకు సంబం ధించి తీవ్ర అజ్ఞానంలో ఉంటారు.

**(అనువాదం: కె. నాగమల్లేశ్వరరావు)**

ప్రపంచ గమనం

# సోషలిజమే భవిష్యత్తు!

**(నవంబర్ 7 అక్టోబర్ విప్లవ 98వ వార్షికోత్సవం)**

**ఎస్. వెంకట్రావు**


రచయిత సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు

*"మనకు మార్పు కావాలి. నిజమైన మార్పు. వ్యవస్థాపరమైన మార్పు కావాలి. ఈ వ్యవస్థను భరించలేకుండా ఉన్నాం. రైతులు దీన్ని భరించలేకపోతున్నారు. కార్మికులు భరించలేకపోతున్నారు. కమ్యూనిటీలు భరించలేకపోతున్నాయి. ప్రజలు భరించలేకపోతున్నారు... చివరికి ఈ భూమి – మన భూ మాత కూడా భరించలేకపోతున్నది. అందుకే మన జీవితాల్లో మార్పు రావాలి. మన ఇరుగుపొరుగు జీవితాల్లో మార్పు రావాలి. మన నిత్య జీవిత వాస్తవికతలో మార్పు రావాలి. ఈ మొత్తం ప్రపంచంలో మార్పు రావాలని మనం కోరుకుంటున్నాం."*

– **పోప్ ఫ్రాన్సిస్** *(జులై9న బొలీవియా రాజధాని శాంతా క్రుజ్‌లో ప్రపంచ ప్రజా ఉద్యమాల సదస్సులో చేసిన ప్రసంగం నుండి)*

ప్రపంచంలో తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవర్భవించి వందేళ్లు కావస్తోంది. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ సార ధ్యంలో రష్యాలో 1917 నవంబర్ 7న (నాటి రష్యా క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 25న) తొలి సోషలిస్టు విప్లవం జయప్రదమైంది. 2016 నంబర్ 7 నుండి 2017 నవంబర్ 7 వరకు ప్రపంచ వ్యాపితంగా అక్టోబర్ విప్లవ శతవార్షికోత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 7కి విప్లవం 98 ఏళ్లు నింపుకుని 99పడిలో పడు తోంది. ఈ సందర్భంగా ప్రపంచంలో వందేళ్ల పరిణామాలను గురించి ఇప్పటికే చర్చ ప్రారంభమైంది.

**తీవ్ర పరిణామాల కాలం**

ఎరిక్ హాబ్స్‌బామ్ చెప్పినట్లు 20వ శతాబ్దంలో ప్రపంచం తీవ్ర పరిణామాలను చూసింది. రెండు భయంకర ప్రపంచ యుద్ధాలు జరిగాయి. సోషలిస్టు వ్యవస్థ ఒక ఉత్తుంగ తరంగంలా ఈ భూగోళం మీదకు వచ్చి, విస్తరించింది. అంతే వేగంతో కుప్పకూలింది. చరిత్రలో తొలి అణుబాంబులు వేలమంది ప్రాణాలు తీశాయి. మానవుడు భూమి ఆకర్షణ శక్తిని దాటి అంతరిక్షంలోకి పయనించాడు. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ ప్రపంచంలోని దూరాలను తగ్గించేశాయి. మానవ జీవిత విధానంలోనే పెనుమార్పులు తెచ్చాయి. వీటన్నిటిలోకీ అక్టోబర్ విప్లవం సమాజంలో తెచ్చిన మార్పులు మహత్తరమైనవి.

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద యుద్ధాన్ని రష్యాలో విప్లవ పోరాటంగా మలిచి ప్రపంచంలో తొలి కార్మికవర్గ రాజ్యానికి లెనిన్ రహదారి వేయగా ఆ దారిలో పయనించి తొలి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేపట్టాడు స్టాలిన్. యుద్ధం తరువాత భూగోళం మీద ఒక కొత్త సామాజిక వ్యవస్థ – సోషలిస్టు వ్యవస్థ పుట్టుకొచ్చింది. వెనుకబడిన రష్యాలో సోషలిజం సాధించిన విజయాలు, దానివల్ల రష్యన్ కార్మిక వర్గానికి సమకూరిన సౌకర్యాలు చూసి ప్రపంచ శ్రామిక వర్గం ఉత్తేజం పొందింది. పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికులు విప్లవ పోరాటాల బాట పట్టారు. వలస దేశాల్లో ప్రజానీకం ఉవ్వెత్తున విముక్తి ఉద్యమాలకు ఉపక్రమించింది. 1929 మహామాంద్యం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను కృంగదీస్తే అదే సమయంలో ప్రణాళికాబద్ధమైన నిర్మాణంతో సోషలిస్టు సోవియట్ యూనియన్ అభివృద్ధిలోనూ, కార్మిక సంక్షేమంలోనూ అద్భుతాలు సాధించింది. ప్రపంచాన్ని పునర్విభజన చేసుకోడానికి సామ్రాజ్యవాదులు ప్రారంభించిన రెండవ ప్రపంచ యుద్ధం భూగోళాన్ని మరో భయంకరమైన వినాశనంలోకి నెట్టింది. ప్రపంచాధిపత్యం సాధించడానికి ఫాసిజాన్ని ఆశ్రయించిన జర్మనీ ఈ భూమ్మీద ఉన్న ఏకైక సోషలిస్టు రాజ్యాన్ని కబళించడానికి పూనుకున్నప్పుడు సోవియట్ ఎర్రసేన, ఆ దేశ ప్రజానీకం చూపిన తెగువ, చేసిన త్యాగాలూ అనుపమానమైనవి. ఫాసిజంపై సోవియట్ విజయం రెండవ ప్రపంచ యుద్ధానికి ముగింపు పలకడమే కాదు భూమ్మీద మూడో వంతు ప్రజలు, ఆరోవంతు భూభాగం దోపిడీ, పీడనల నుండి విముక్తి చెందడానికి కారణమైంది. దాని వల్ల వలస దేశాల్లో స్వాతంత్రోద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. పెట్టుబడిదారీ దేశాలు కూడా తమ దేశాల్లోని కార్మికవర్గానికి అనేక రక్షణలు, సంక్షేమాలు కల్పించాల్సి వచ్చింది.


అటువంటి గొప్ప విజయాలు సాధించిన సోషలిజం అనేక కారణాల వల్ల కుప్పకూలిపోవడంతో మళ్లీ ప్రపంచం మీద సామ్రాజ్యవాదుల ఏకఛత్రాధిపత్యం ఏర్పడింది. కార్మిక వర్గ సంఘటిత శక్తి బలహీనపడింది. సామ్రాజ్యవాదం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఓలను ఆయుధాలుగా చేసుకుని, వినిమయదారీ భావజాలాన్ని ఉపయోగించుకుని ప్రపంచంపై నయా–ఉదారవాద దండయాత్ర ప్రారంభించింది. పాతికేళ్ల క్రితం ఈ పరిణామం సంభవించినప్పుడు పెట్టుబడిదారీ పండితులు సోషలిజంపైనా, ఆ భావజాలానికి అంకితమై ఉన్నవారిపైనా విపరీతమైన ప్రచార దాడి ప్రారంభించారు. ఫ్రాన్సిస్ ఫకుయామా వంటి రచయితలు పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం ప్రపంచంలో చిరకాలం వర్థిల్లుతుందనీ, అందువల్ల సామాజిక "చరిత్ర అంతం" అయిపోందనీ వ్యాసాలు రాశారు. శ్యామ్యూల్ హట్టింగ్‌టన్ వంటి వారు సోషలిస్టు సిద్ధాంతం అదృశ్యమైందనీ అందువల్ల ఇక సిద్ధాంతాల మధ్య యుద్ధాలు జరగవనీ, "నాగరికతల మధ్య యుద్ధాలు" జరుగుతాయనీ

> **❝ కానీ ఈ పాతికేళ్లలో ఏమైంది? నాడు పెట్టుబడిదారీ వ్యవస్థ మినహా ప్రపంచానికి మరో మార్గం లేదు, మరో ప్రత్యామ్నాయం లేదు అన్న ప్రపంచం నేడు ఈ వ్యవస్థను తక్షణం మార్చాల్సిన సమయం వచ్చిందని విస్పష్టంగా ప్రకటిస్తోంది. ❞**

రాశారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం ఫరిడవిల్లి ధరణి సుఖశాంతులతో తులతూగుతుందని జోశ్యం చెప్పారు.

కానీ ఈ పాతికేళ్లలో ఏమైంది? నాడు పెట్టుబడిదారీ వ్యవస్థ మినహా ప్రపంచానికి మరో మార్గం లేదు, మరో ప్రత్యామ్నాయం లేదు అన్న ప్రపంచం నేడు ఈ వ్యవస్థను తక్షణం మార్చాల్సిన సమయం వచ్చిందని విస్పష్టంగా ప్రకటిస్తోంది. కేవలం కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు మాత్రమే కాదు పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా ఈ వ్యవస్థ మనగలిగేది (సస్టయినబుల్) కాదని చెబుతున్నారు. ప్రపంచ బ్యాంకు అధ్యక్షునిగా పనిచేసిన జోసఫ్ స్టిగ్లిట్జ్ వంటివారు ఈ వ్యవస్థ పతనం గురించి జోస్యాలు చెబుతున్నారు. రోమన్ క్యాథలిక్కుల గురువైన పోప్ ఫ్రాన్సిస్ అదుపులేని పెట్టుబడిదారీ వ్యవస్థ దెయ్యం పేడ వంటిదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలంటున్నారు. ఇటీవల ఆయన కారల్ మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథాన్ని కొని చదివారట. కారణం? పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక, పరిణామం గురించి అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించిన వ్యక్తి కారల్ మార్క్స్ కాబట్టి.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావ కేంద్రమైన బ్రిటన్‌లో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ప్రపంచ గమనం ఎటు సాగుతోందో కొంతవరకు అర్థం చేసుకోగలుగుతాం. ఈ ఏడాది మధ్య భాగం వరకు బ్రిటిష్ లేబర్ పార్టీలో అనామకునిగా ఉన్న జెరెమీ కార్బిన్ జూన్ 3న తను లేబర్ పార్టీ తరఫున ప్రధాని పదవికి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. పోటీలో నిలవాలంటే ఆయనకు కనీసం 35 మంది పార్లమెంటు సభ్యుల మద్దతు కావాలి. ఆయనకు 36 మంది మద్దతిచ్చారు. వారిలో చాలా మంది ఆయన ఓటమి ఖాయం, కాకపోతే పోటీలో మరీ ఒకరిద్దరు కాకుండా ఎక్కువ సంఖ్య ఉంటేబాగుంటుందనే ఉద్దేశ్యంతో


**కారల్ మార్క్స్**

మద్దతిచ్చారు. వారిలో 12మంది సభ్యులు ఇద్దరు అభ్యర్థులకు మద్దతిచ్చారు. పోటీకి అర్హత సంపాదించిన కార్బిన్‌కు బ్రిటిష్ కార్మిక సంఘాలనుండి అనూహ్యమైన మద్దతు లభించింది. కారణం? ఆయన ప్రకటించిన విధానాలే. ఇప్పటివరకు యూరప్ పాలకవర్గాల్లో ప్రయివేటీకరణే గాని జాతీయికరణ అన్న మాటకు తావు లేదు. మీడియాలో అదో నిషిద్ధ పదం. కానీ కార్బిన్ దేశంలోని రైల్వేలను, ఇంధన కంపెనీలను జాతీయాకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ గృహ నిర్మాణంలోనూ, ప్రభుత్వ రవాణా వ్యవస్థలోనూ ఇంగ్లండ్ సెంట్రల్ బ్యాంకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలన్నారు. ఒక రకంగా ఇప్పటివరకు అమలవుతున్న నయా-ఉదారవాద విధానాలకు ఆయన ప్రత్యామ్నాయ ప్రతిపాదలను చేశారు. దాంతో బ్రిటన్‌లోనే కాదు యూరప్‌లో నేడు రైల్వేలు, ఇంధన పరిశ్రమల జాతీయా కరణ మీద పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మరోవైపు ఆయన విదేశాంగ విధానంలో కూడా కొత్త పుంతలు తొక్కారు. తను ప్రధానిని అయుంటే ఇరాక్‌లో బ్రిటన్ చేసిన పనికి క్షమాపణ చెప్పేవాడినన్నారు. మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇటీవల క్షమాపణ చెప్పిన విషయం గమనించదగ్గది. పాలస్తీనా స్వతంత్ర దేశానికి కార్బిన్ మద్దతు తెలిపారు. యూరప్‌లో నాటో సైనిక కూటమి అవసరం లేదని ప్రకటించారు. తను అధికారంలోకి వస్తే ట్రయిడెంట్ క్షిపణి కార్యక్రమానికి స్వస్తి చెప్పి దానికి ఖర్చు చేసే డబ్బును ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తానన్నారు. ఈ రకంగా కార్బిన్ ప్రకటించిన విధానాలు బ్రిటిష్ కార్మికవర్గం మన్ననలు పొందాయి. ఆయన ప్రధాని అభ్యర్థిగా ఎన్నికైనారు. ప్రధానిగా ఎన్నికవుతారో లేదో చూడాలి.

అన్నిటికీ మించి కార్బిన్ కారల్ మార్క్స్‌కు గొప్ప అభిమాని కావడం బ్రిటిష్ మీడియాకు మింగుడుపడకుండా ఉంది. సోషలిస్టు విప్లవ కారుడైన "కారల్ మార్క్స్‌కు మనమంతా రుణపడి ఉన్నాం" అని కార్బిన్ బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించగానే ఆయనను అందరూ మార్క్సిస్టుగా పేర్కొనడం ప్రారంభించారు. మార్క్స్ గురించి కార్బిన్ మాట్లాడుతూ "ఆయన రచనలు విజ్ఞాన ఖనులు, ప్రపంచంలో జరుగుతున్న దాన్ని ఆయన గొప్పగా విశ్లేషించారు, మార్క్స్ తత్వశాస్త్రం నిజంగా అద్భుతం" అని చెప్పారు.

"కొన్నాళ్లు నిరాదరణకు గురైన కారల్ మార్క్స్ తిరిగి వచ్చారు" అని బ్రిటిష్ లేబర్ పార్టీకి చెందిన మరో నాయకుడు జాన్ మెక్ డొన్నెల్ ఇటీవల లేబర్ పార్టీ మహాసభలో చెప్పారు. మార్క్స్ సిద్ధాంతాలు మళ్లీ ఇప్పుడు ప్రధాన స్రవంతి ఆలోచనలుగా మారాయి అని పేర్కొంటూ, "మార్క్స్ నిర్ధారణలతో కొందరు ఏకీభవించకపోవచ్చు గానీ ఆయన విశ్లేషణలు చాలా ఆసక్తికరమైనవి" అని మెక్‌డొన్నెల్ అన్నారు. మార్క్స్ చనిపోయిన 130 సంవత్సరాల తరువాత కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో చెప్పే అత్యుత్తమ విశ్లేషణ ఆయనదేనని మెక్ డొన్నెల్ పేర్కొన్నారు.

### ఏకధ్రువ ప్రపంచానికి లాటిన్ అమెరికాలో తొలిదెబ్బ

పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకత, సోషలిస్టు, మార్క్సిస్టు సిద్ధాంతాల పట్ల ఆసక్తి సోషలిజం కూలిపోయిన పాతికేళ్ల తరువాత ఇప్పుడు ఒకేసారిగా పుట్టుకు రాలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదన్న ప్రపంచంలో ప్రత్యామ్నాయం ఉంది అన్న నినాదం మొదటి సారిగా 2001లో జరిగిన ప్రపంచ సోషల్ ఫోరమ్‌లో వినిపించింది. అయితే దీనికి బీజాలు మాత్రం అంతకు ముందు 1999లో

అమెరికాలోని సియాటెల్ నగరంలో పడింది. ఈ నగరంలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రుల స్థాయి సమావేశానికి నిరసనగా ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన వేలాది మంది ప్రజలు నవంబరులో పెద్ద ప్రదర్శన జరిపారు. ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా వారు నాలుగు రోజుల పాటు నగరాన్ని దిగ్బంధం గావించారు. ఈ ప్రదర్శనల్లో పాల్గొన్న కొన్ని స్వచ్ఛంద సంస్థల నాకులు, బ్రెజిల్ ట్రేడ్ యూనియన్లు కలిసి ఏర్పాటు చేసిన ప్రపంచ సోషల్ ఫోరమ్ (డబ్ల్యుఎస్ఎఫ్) ప్రథమ వార్షిక సభ 2001లో దక్షిణ బ్రెజిల్‌లోని పోర్టో అలెగ్రె నగరంలో జరిగింది. ప్రతి ఏటా స్విట్జర్లండులోని దావోస్ నగరంలో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) నయా–ఉదారవాద విధానాల ద్వారా ఈ ప్రపంచాన్ని బహుళజాతి కంపెనీల కబంధ హస్తాల్లోకి ఎలా నెట్టాలి అన్న విషయాలు చర్చిస్తుంటే ప్రతిఏటా జరిగే ప్రపంచ సోషల్ ఫోరమ్ ప్రపంచీకరణ కబంధ హస్తాలనుండి ప్రజలను, ధరిత్రినీ ఎలా విముక్తి చేయాలా అని ఆలోచనలు చేసేది. వరుసగా మూడేళ్లు పోర్టో అలెగ్రెలో జరిగిన ప్రపంచ సోషల్ ఫోరమ్ సమావేశాలు తరువాత ఐరోపా, ఆసియా, ఆఫ్రికా ఖండాలకు విస్తరించాయి. దీనిలో చురుకైన పాత్ర వహించిన బ్రెజిల్ వర్కర్స్ పార్టీ నాయకుడు లూలా డ సిల్వాను ప్రజలు 2003లో ఆ దేశాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. లూలా ప్రజానుకూల విధానాలకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు వెనిజులా అధ్యక్షునిగా ఎన్నికైన హ్యూగో చావెజ్, 2006లో బొలీవియా అధ్యక్షునిగా ఎన్నికైన ఇవో మొరెల్స్, 2007లో ఈక్వెడార్ అధ్యక్షునిగా ఎన్నికైన రాఫెల్ కొర్రియాలు తమవి సోషలిస్టు విధానాలని ప్రకటించారు. భూ సంస్కరణలు చేపట్టారు. చమురు, గ్యాస్ ఇతర కంపెనీలను జాతీయం చేశారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందజేశారు. రాజకీయంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలిచారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా బొలివార్ ప్రత్యామ్నాయ సంస్థలు నెలకొల్పారు. వీరికి ఉరుగ్వే, నికరాగువాల్లో ప్రజలచే ఎన్నికైన వామపక్ష ప్రభుత్వాలు తోడైనాయి. క్యూబాతో కలిసి ఈ దేశాలన్నీ లాటిన్ అమెరికా, కరెబియన్ దేశాల సంస్థ (సెలాక్)ను ఏర్పాటు చేశాయి. ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాల కోసం ఏర్పడిన ఈ సంస్థనుండి అమెరికా, కెనడాలను పక్కన బెట్టాయి. ఈ పరిణామాలతో మొట్టమొదటి సారిగా అమెరికన్ సామ్రాజ్యవాద ఏకఛత్రాధిపత్యానికి లాటిన్ అమెరికాలో దెబ్బ తగిలింది.

**❝ పెట్టుబడి దారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదన్న ప్రపం చంలో ప్రత్యామ్నాయం ఉంది అన్న నినాదం మొదటి సారిగా 2001లో జరిగిన ప్రపంచ సోషల్ ఫోరమ్‌లో వినిపించింది. అయితే దీనికి బీజాలు మాత్రం అంతకు ముందు 1999లో అమెరికాలోని సియాటెల్ నగరంలో పడింది.❞**



పోప్ ఫ్రాన్సిస్

### 2008 ఆర్థిక సంక్షోభం

స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేదన్న వాదన.. 2008లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో పటాపంచలయింది. కొనుగోలు శక్తిలేని ప్రజలకు అప్పులిచ్చి వ్యాపారాన్ని పెంపొందించుకున్న బహుళజాతి ఫైనాన్స్ సంస్థలు ఒక్కసారిగా కుప్పకూలి పోవడంతో ప్రపంచ వ్యాపిత ఆర్థిక పతనం ప్రారంభమైంది. స్వేచ్ఛా మార్కెట్ వల్ల పతనమైన ఈ సంస్థలను కాపాడడానికి ప్రభుత్వాలు ముందుకు రావాల్సి వచ్చింది. అమెరికా, యూరప్, ఆసియా, చివరికి భారత్‌లో కూడా ఫైనాన్స్ సంస్థలను కాపాడడం కోసం ప్రభుత్వాలు బెయిలవుట్ ప్యాకేజీలు ప్రకటించాయి. దాంతో ప్రభుత్వాలు అప్పుల పాలైనాయి. గ్రీసు, ఐర్లాండ్, సైప్రస్ వంటి అనేక దేశాలు దివాళా తీశాయి. స్పెయిన్, పోర్చుగీసు, వంటి దేశాలు అదే బాట పట్టాయి. శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న దేశాలుగా చెప్పబడే చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలు కూడా ఆర్థిక మందగమనంలో పడ్డాయి. పెట్టుబడిదారీ దేశాలన్నింటా ప్రభుత్వ రుణభారాలను ప్రజలమీదికి, ముఖ్యంగా కార్మికవర్గం మీదకు నెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు కార్మికుల నుండి, ప్రజల నుండి నేడు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. అనేక దేశాల్లో ప్రజలు ప్రభుత్వాలనే మార్చేస్తున్నారు.

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ–2

> **"పెట్టుబడిదారీ దేశాలన్నింటా ప్రభుత్వ రుణ భారాలను ప్రజలమీదికి, ముఖ్యంగా కార్మికవర్గం మీదకు నెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు కార్మికుల నుండి, ప్రజల నుండి నేడు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. అనేక దేశాల్లో ప్రజలు ప్రభుత్వాలనే మార్చేస్తున్నారు. యూరప్‌లో గ్రీసు పరిణామాలు దీనికి చక్కటి నిదర్శనం."**

యూరప్‌లో గ్రీసు పరిణామాలు దీనికి చక్కటి నిదర్శనం. నయా-ఉదారవాద విధానాల వల్ల గ్రీసు పూర్తిగా దివాళా తీసింది. దివాళా నుండి దేశాన్ని బయటపడేసేందుకు ఐరోపా కేంద్ర బ్యాంకు, ఐఎంఎఫ్, ఐరోపా యూనియన్లు పొదుపు చర్యల పేరుతో ప్రజలపై విధించిన భారాలు మొత్తం గ్రీకు ప్రజానీకాన్ని దివాళా తీయించాయి. కార్మికుల సమ్మెలు, ఆందోళన లతో దేశం అట్టుడికి పోయింది. కొద్ది సంవత్స రాల్లోనే అనేక ప్రభుత్వాలు మారిపోయాయి. చివరికి వామపక్ష వాగాడంరంతో గద్దెనెక్కిన సిరిజా పార్టీకూడా ప్రజల పక్షాన నిలవక పోవడంతో దేశంలో అశాంతి తొలగలేదు. ఆర్థిక సంక్షోభం సమసిపోలేదు. యూరప్ దేశాలన్నిటా ప్రస్తుతం ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం ప్రపంచమంతా ఆర్థిక మందగమనంలో కొట్టుమిట్టాడుతోంది.

### బహుళధృవ ప్రపంచం

ఈ ఆర్థిక సంక్షోభం అమెరికా సామ్రాజ్య వాదపు ఆధిపత్యానికి మరో గండి కొట్టింది. అంతకు ముందు లాటిన్ అమెరికాలో సామ్రాజ్య వాద వ్యతిరేక వామపక్ష ప్రభుత్వాలనుండి అమెరికాకు సవాలు ఎదురుకాగా సంక్షోభం తరువాత ఆర్థికంగా బ్రిక్స్ దేశాలనుండి, రాజకీయంగా షాంఘై కూటమి దేశాలనుండి అది సవాళ్లు ఎదుర్కొంటోంది. ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకొస్తూ ప్రపంచంలో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన చైనా.. రష్యాతో కలిసి ఈ రెండు కూటముల్లోనూ ప్రధాన పాత్ర వహించడం గమనార్హం. అమెరికా ఆర్థిక వ్యవస్థ అప్పుల ఊబిలో ఉంది. రోజురోజుకూ డాలరు ఆధిపత్యం దిగజారి పోతోంది. అందుకనే నేటి ప్రపంచం ఏకధృవం నుండి బహుళధృవం వైపు వేగంగా పయని స్తోందని నిపుణులు చెబుతున్నారు. అయితే సైనిక రంగంలో మాత్రం ఇప్పటికీ అమెరికా బలీయంగా ఉంది. దాన్ని ఉపయోగించుకుని ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని సాగించు



జెరెమీ కార్బిన్

కోవాలని చూస్తోంది. నాడు సోవియట్ యూని యన్‌కు వ్యతిరేకంగా స్థాపించిన నాటో కూట మిని నేడు మరింత విస్తరించి ప్రపంచాధి పత్యానికి సాధనంగా ఉపయోగించుకుంటోంది. ఉగ్రవాదంపై యుద్ధం, ప్రజాస్వామ్యం పేరుతో చిన్న చిన్న దేశాలపై దాడులకు తెగబడుతోంది. భారత్‌తో సహా అనేక దేశాలను సైనిక కూటములలోకి లాగుతోంది. నేడు అమెరికా ప్రోద్బలంతో జరుగుతున్న సిరియా, ఉక్రెయిన్‌ల్లో అంతర్యుద్ధాలు, దక్షిణ చైనా సముద్ర జలా ల్లో ఉద్రిక్తతలు ప్రపంచాన్ని ఏ క్షణంలోనైనా మరో ప్రపంచ యుద్ధంలోకి లాగే ప్రమాదముంది.

ఒక రకంగా చెప్పాలంటే వందేళ్ల క్రితం ఉన్న పరిస్థితుల మాదిరిగానే నేడు ప్రపంచ పరిస్థితులు తయారవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

### నెరవేరని హామీలు

మొత్తంమీద చూస్తే 1980 దశకం చివర సోష లిస్టు వ్యవస్థ పతనమైనప్పుడు... ఇక సుస్థిరమైన, శాంతియుతమైన అభివృద్ధి జరుగు తుందని నయా-ఉదారవాదం ప్రపంచానికిచ్చిన వాగ్దానం నెరవేరలేదు సరికదా పరిస్థితి మరిం త దిగ జారింది. బాల్టిక్, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాలు, అనేక దేశాల్లో అంతర్యుద్ధాలు, విపరీతమైన వలసలు, పలుప్రాంతాల్లో ఉ ద్రిక్తతలతో భూ గోళం కల్లోలంగా మారింది. ప్రపంచ వ్యాపి తంగా ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఒక్క శాతం ధనిక వర్గం చేతిలో సంపదలు వేగంగా పోగుపడుతుండగా మరోవైపు 99 శాతం ప్రజల్లో దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగుతోంది. ధనిక దేశాలు ప్రపంచ వనరుల్లో అధిక భాగాన్ని స్వాహా చేస్తుంటే, మెజారిటీ ప్రజలు నివసించే పేద దేశాలు వనరులున్నా పేదరికంలో మగ్గుతు న్నాయి. నయా-ఉదారవాద ఆర్థిక పండితులు ఏమి చెబుతున్నా వారి వద్ద ఈ ఆర్థిక సంక్షోభా నికి కారణాల గురించి సరైన విశ్లేషణ లేదు. నలుగురు గుడ్డివాళ్లు ఏనుగును వర్ణించినట్లు దానిగురించి ఎవరికి వారు వర్ణిస్తున్నారు. నయా-ఉదారవాద విధానాలవల్ల సమాజంలో పెట్టుబడి కొంతమంది దగ్గర పోగుపడుతూ, అసమానతలు తీవ్రంగా పెరుగు తున్నాయని నిరూపిస్తూ థామస్ పికెట్టీ అనే ఫ్రెంచ్ ఆర్థిక వేత్త 2013లో రాసిన పుస్తకం ప్రపంచ వ్యాపితంగా సంచలనం సృష్టించింది. నిజానికి పికెట్టీ తన గ్రంథంలో చెప్పిన అనేక అంశాలను అంతర్జాతీయ సర్వే నివేదికలు తెలయజేస్తూనే ఉన్నాయి. నయా-ఉదారవాదం వల్ల ఆర్థిక


**'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

వ్యవస్థలకు వస్తున్న జబ్బుకు ఆ విధానాలను మరింత విస్తృతంగా, లోతుగా అమలు చేయడమే మందు అని ఈ పండితులంతా చెబుతున్నారు. వారు చెప్పిన మందు ఇచ్చేకొద్దీ రోగం మరింత తీవ్రమవుతోంది. కొన్నిచోట్ల పరిస్థితి విషమిస్తోంది.

అందుకే ఇప్పుడు పోప్ నుండి పెట్టుబడిదారీ పండితుల వరకు మార్క్స్‌వైపు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. బ్రిటిష్ లేబర్ పార్టీ నాయకులు చెప్పినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థను

**❝ పోప్ ఫ్రాన్సిస్ చెప్పినట్లు నేటి పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రజలు భరించలేకపోతున్నారు, ధరిత్రి భరించలేక పోతున్నది. అందువల్ల వ్యవస్థను మార్చడమా లేక నాశనం కావడమా అన్న రెండే మార్గాలు మనముందున్నప్పుడు పెట్టుబడి దారీ వ్యవస్థను మార్చాల్సిందే. కానీ దాని స్థానంలో రావలసిన వ్యవస్థ ఏమిటి? ఖచ్చితంగా సోషలిజమే. ❞**



షాంఘై కూటమి నాయకులు



బ్రిక్స్ దేశాల నాయకులు

అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించిన వ్యక్తి కారల్ మార్క్స్ మాత్రమే. నిజానికి ఆయన రాసిన పెట్టుబడి గ్రంథం మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం, పరిణామాలను గురించే వివరి స్తుంది. అన్ని వ్యవస్థలకూ ఉన్నట్లే పెట్టుబడిదారీ వ్యవస్థకూ పుట్టుక ఉందనీ, పెరుగుదల ఉందనీ, చివరికి అంతం కూడా ఉంటుందని ఆయన చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతకం తకూ సామాజికమవుతున్న ఉత్పత్తి క్రమానికీ, ఆ ఉత్పత్తి ప్రయివేటుపరం కావడానికీ మధ్య ఉన్న వైరుధ్యమే సంక్షోభాలను సృష్టిస్తుందని మార్క్స్ చెప్పాడు. ప్రస్తుత ప్రపంచ సంక్షోభాన్ని ఆయన చెప్పిన విశ్లేషణ రీత్యా కాకుండా మరో విధంగా అర్థం చేసుకోవడం కష్టం. అందుకే ప్రపంచలోని మేధావులు పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి ఇప్పుడు మార్క్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. నిజానికి 2008 సంక్షోభం తరువాత యూరప్ దేశాల్లోని పుస్తకాల షాపుల్లో మార్క్స్ పెట్టుబడి గ్రంథం ఎక్కువగా దర్శనమిస్తోంది, అమ్ముడవుతోంది.

రానురాను మరింత సామాజికంగా జరుగుతున్న ఉత్పత్తిని ప్రయివేటు పరంకాకుండా సమాజం పరం చేయడమే సంక్షోభాలకు పరిష్కారమని మార్క్స్ చెప్పాడు. ఉత్పత్తి సమాజ పరం గావాలంటే ఉత్పత్తి సాధనాలు సమాజ పరం కావాలి. మహనీయుడు లెనిన్ రష్యన్ విప్లవం ద్వారా చేసింది అదే. అయితే తరువాత సోవియట్ యూనియన్‌లోనూ, నాటి సోషలిస్టు దేశాల్లోనూ సోషలిజం నిర్మాణంలో కొన్ని తప్పు లు దొర్లాయని నేడు అందరూ అంగీకరిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం సోషలిజం ఆరంభం అని కారల్ మార్క్స్ చెప్పాడుగానీ సోషలిస్టు వ్యవస్థ ఎలా నిర్మించాలన్న విషయం ఆయన చెప్పలేదు. విప్లవం ద్వారానే సోషలిజం వస్తుందని లెనిన్ చెప్పడమే కాదు చేసిచూపిం చాడు గానీ ఆ వ్యవస్థను నిర్మించే సూత్రాలను ఆయన వివరించలేదు. నిజానికి సోషలిజం నిర్మాణం అనేది సుదీర్ఘమైన, అనేక ఎగుడు దిగుడులతో కూడిన విషయం. ఒక దేశంలో సోషలిజం నిర్మాణం ఆ దేశ సామాజిక చరిత్ర, వర్గ పొందిక, సంస్కృతి, ఆనాటి ప్రపంచ రాజకీయ పరిస్థితులు, ఇంకా అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ప్యారిస్ కమ్యూన్‌లో విప్లవంద్వారా ఏర్పడిన మొట్టమొదటి కార్మిక రాజ్యం మూడు మాసాల్లోనే కుప్పకూలి పోయింది. దాన్నుండి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అనేక గుణపాఠాలు నేర్చుకుంది. కొత్త సూత్రాలను కనుగొంది. వాటిని లెనిన్ రష్యాలోని నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా అమలు చేయడం ద్వారా సోషలిజం నిర్మాణానికి కొత్త బాటలు వేశాడు. అయితే అక్కడ 70 ఏళ్ల సోషలిజం నిర్మాణంలో జరిగిన లోపాలు ఆ వ్యవస్థ పతనానికి దారితీశాయి. అంత మాత్రాన సోషలిజం పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నా యం కాకుండా పోదు.

పోప్ ఫ్రాన్సిస్ చెప్పినట్లు నేటి పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రజలు భరించలేకపోతున్నారు, ధరిత్రి భరించలేకపోతున్నది. అందువల్ల వ్యవస్థను మార్చడమా లేక నాశనం కావడమా అన్న రెండే మార్గాలు మనముందున్నప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చాల్సిందే. కానీదాని స్థానంలో రావలసిన వ్యవస్థ ఏమిటి? ఖచ్చితంగా సోషలిజమే. కాకపోతే ఆ సోషలిజం నిర్మాణంలో గతంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరక్కుండా చూసుకోవాలి. ఈ నాడు ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న చర్చ అదే. 21వ శతాబ్దపు సోషలిజం ఎలా ఉండాలి? నేడు లాటిన్ అమెరికాలో ఈ చర్చ జరుగుతోంది. యూరప్‌లో చర్చ ప్రారంభమైంది. ఆసియా, ఆఫ్రికా దేశాలకు వ్యాపిస్తోంది. 19వ శతాబ్దపు సోషలిజం 3 మాసాలు మనగలిగింది. 20వ శతాబ్దపు సోషలిజం 70 ఏళ్లు మనుగడ సాగించింది. ప్రజలు వాటి అనుభవాలనుండి నేర్చుకున్న పాఠాలతో నిర్మించుకునే 21వ శతాబ్దపు సోషలిజం సుదీర్ఘ కాలం.. బహుళా కమ్యూ నిజం నిర్మించబడేవరకు కొనసాగుతుంది. ❊

# ప్రభుత్వ వైద్యరంగాన్ని బలపర్చాలి, విస్తరించాలి

*25.10.2015, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు, విజయవాడలో జరిగిన ప్రజారోగ్య వేదిక ఆవిర్భావసభలో ఆమోదించబడిన విధాన ప్రకటన:*

అనారోగ్యం దరిద్రానికి కారణమూ, దాని పర్యవసానం కూడా అవుతుంది. ఆరోగ్య పరిరక్షణ వ్యయం పెరగటం వలన అధికంగా ఖర్చు పెట్టాల్సిరావటం దారిద్ర్యం పెరగటానికి ముఖ్యకారణాలలో ఒకటిగా ఇపుడు అంచనా వేస్తున్నారు. ఫలితంగా వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, వలసలు వెళుతున్నవారు, మహిళలు, వృద్ధులు, పిల్లలు వివిధ రకాలైన వ్యాధులు సోకి బాధపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాలలోపేదలు ఎక్కువగా ప్రభుత్వ వైద్యసేవలపైనే ఆధారపడి ఉన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రులలో తగినంతమంది సిబ్బంది (ముఖ్యంగా దిగువస్థాయి ఆరోగ్య సిబ్బంది) లేరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ద్వితీయశ్రేణి ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజి ఆసుపత్రుల్లో రోగనిర్ధారణకు అవసరమైన పరికరాలు లేవు. నిధులు లేకుండా చేయటంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల రోజువారీ నిర్వహణను కూడా తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. భారతదేశంలో వైద్యం కోసం చేసే ఖర్చు, ముఖ్యంగా మందుల కోసం ప్రజలు తమజేబుల్లో నుండి పెట్టే ఖర్చు కుటుంబ ఖర్చుల్లో అతి పెద్దఖర్చుగా ఉంటున్నది. భారతదేశంలోకెల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే ఆరోగ్యవ్యయం ఎక్కువగా ఉన్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడయింది. వైద్య సదుపాయాలపై అంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఆసుపత్రులలో ఉన్న మొత్తం పడకలలో ప్రైవేటు ఆసుపత్రులలో 59 శాతం, ప్రభుత్వ ఆసుపత్రులలో 35 శాతం, స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో ఆరు శాతం ఉన్నట్లు స్పష్టమైంది. ఆంధ్రప్రదేశ్‌లో సగటున 10 వేల మంది గ్రామీణ జనాభాకు 14 మంది ఆర్‌యంపిలు, ఇద్దరు పట్టభద్రులైన డాక్టర్లు మాత్రమే ఉన్నారు.

ఆసుపత్రి పాలయిన భారతీయుల్లో 25 శాతం మంది ఆసుపత్రి ఖర్చుల వలన దారిద్ర్య రేఖ దిగువకు జారిపోతున్నారని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ మొదటి నివేదికలో చెప్పారు. ప్రభుత్వాలు జిడిపిలో ఆరోగ్యరంగంపై చేసేఖర్చులో భారతదేశం (0.9) ప్రపంచ దేశాల్లోని దిగువస్థాయిలో ఉన్న ఐదుదేశాలలో ఒకటిగా ఉంది. భారతదేశంలో అతి దారుణమైన ఆరోగ్య పరిస్థితులకు కారణమైన రెండు ముఖ్యాంశాలు పరిశోధనల్లో వెల్లడైనాయి. అవి:

1. ఉత్పత్తిదారులకు అధిక లాభాలను కట్టబెట్టేలా మందుల ధరలు పెరగటం.
2. ప్రైవేటు ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అందిస్తున్న నిశ్శబ్ద సహకారం.

వైద్యరంగంలో సంస్కరణలను అమలు చేయటంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు పీఠిన ఉన్నది. అన్ని స్థాయిలలోనూ వైద్య సేవలను ప్రైవేటీకరించటానికీ, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) గురించి ప్రభుత్వం చురుకుగా ప్రచారం చేస్తున్నది. ప్రభుత్వం ప్రైవేటీకరణ కోసం ప్రయత్నం చేస్తున్నది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా ఏర్పడిన ఆసుపత్రులలో ఒకటైన గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని, మెడికల్ కాలేజీని ప్రైవేటువారికి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర ఆరోగ్య బడ్జెట్ జియస్‌డిపిలో ఒకశాతానికి మించటం లేదు. కేటాయించిన నిధులలో కూడా 25 శాతం ఆరోగ్యశ్రీ సామాజిక ఆరోగ్య బీమా పథకానికి తరలిస్తున్నారు. 2008వ సంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులకు, ప్రైవేటు నర్సింగ్‌హోంలకు ఆరోగ్యశ్రీ పథకం గంగిగోవులాగ పెద్ద ఎత్తున ఉపయోగపడుతున్నది. ప్రభుత్వ ఆరోగ్యరంగం నిధులు లేక కునారిల్లుతుంటే, ఆరోగ్యబడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి కేటాయింపులు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు ఆరోగ్య పరి రక్షణను కార్పొరేటీకరించటానికి, ధనికులు, పేదల మధ్య అసమానతలు పెరగటానికి దారి తీశాయి.

ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ప్రభుత్వ ఆసుపత్రులపై భారాన్ని తగ్గించుకోవటానికేనని సమర్ధించుకుంటున్నారు. వాస్తవంలో ప్రభుత్వ ఉద్యోగుల వైద్యానికి అయిన ఖర్చులను తిరిగి పొందటం ద్వారా ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వ నిధులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవటం కోసం చురుకుగా పని చేస్తున్నాయి. వైద్యానికి అయిన ఖర్చులను ఎక్కువచేసి చూపటం, ఉద్యోగుల వైద్యబీమా మొత్తాలను పొందటం, ట్రస్టులు, పరిశోధనా కేంద్రాలుగా రిజిష్టరు చేసుకోవటం, ఆదాయపన్ను రాయితీలు పొందటం తదితరాల ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిధులను పెద్దమొత్తంలో స్వాహా చేస్తున్నాయని స్పష్టమౌతున్నది. భారతదేశంలో ఆరోగ్య రక్షణ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ప్రైవేటీకరించబడినదిగా ఉన్నది. ఆరోగ్య పరిరక్షణ కోసం పెట్టే ఖర్చులో 83 శాతాన్ని వ్యక్తులు తమ జేబుల్లో నుండి ఖర్చు చేయాల్సి వస్తున్నది. అభివృద్ధి చెందిన బ్రిటన్ లాంటి దేశాల్లో ఇది ఆరుశాతం మాత్రమే ఉంది. ప్రపంచంలోనే అట్టడుగు దేశాలతో సమానమైన ప్రజారోగ్య సూచికలతో గ్రామీణ ప్రాంతాలలోనేకాక, పట్టణాలలో కూడా ప్రజారోగ్య వ్యవస్థ దీనస్థితిలో ఉన్నది.

ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని సురక్షితమైన మంచినీరు అందించటం, పారిశుధ్య నిర్వహణను తీవ్రమైన అంశంగా పరిగణించటం, పేదలకు కనీసమైన పనిదినాలు కల్పించటం చేస్తే అంటువాధుల్లో అత్యధిక భాగాన్ని నివారించవచ్చునని విస్తృతంగా అంగీకరిస్తున్నారు. బడ్జెట్‌లో ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన నిధులను కేటాయించేటపుడు రోగాల్ని నిరోధించటం, నయం చేయటానికి అవసరమైన ఈ అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు.

ప్రతి వెయ్యి సజీవ జననాలకు శిశుమరణా

లను 2015 నాటికి 23కు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ మన రాష్ట్రంలో ఈ సంఖ్య 46గా ఉన్నది. జనాభాలో పావు వంతు ప్రజలకు ఎటువంటి వైద్య సౌకర్యాలు అందడంలేదని, అధిక ధరల కారణంగా సగం మంది తమకు అవసరమైన మందులు పూర్తి స్థాయిలో వాడడంలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. దేశంలోని సగానికి పైగా చిన్న పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. 75 శాతం పిల్లలు, 51 శాతం స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పేద కుటుంబాల పిల్లలకు పోషకాహారాన్ని అందించడంలో అంగన్‌వాడీ సెంటర్లు మంచి కృషి చేస్తున్నాయి. మన ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించే నిధులలో కోతలు విధిస్తున్నారు. 2010-13 సంవత్సరాల మధ్య దేశంలో 14 లక్షలమంది చిన్నపిల్లలు విరోచనాల వలన చనిపోయారు. డెంగ్యూ, చికున్ గున్యా జ్వరాలు ప్రజలను వేధిస్తున్నాయి. పారిశుధ్య లోపం, కలుషిత త్రాగునీరే ఈ మరణాలకు కారణం. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాలలో పేదలు ఎక్కువగా ప్రభుత్వ వైద్యసేవలపైనే ఆధారపడి ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ద్వితీయశ్రేణి ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజి ఆసుపత్రుల్లో రోగనిర్ధారణకు అవసరమైన పరికరాలు లేవు. నిధులు లేకుండా చేయటంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల రోజువారీ నిర్వహణను కూడా తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. 104, 108 సర్వీసులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలన పడుతున్నాయి. కుక్కకాటుకు, పాము కాటుకు వైద్యం చేయడానికి కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు లేక ప్రజలు మరణిస్తున్నారు.

“నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రమాణాల ప్రకారం ఉండవలసిన సంఖ్య కంటే 85 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 156 కమ్యూనిటీ ఆసుపత్రులు తక్కువగా ఉన్నాయి. ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సగం మహిళా వైద్యులు లేకుండా పనిచేస్తున్నాయి. 24 గంటలూ పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 42 శాతమే.”



తగిన వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పేదలు

### ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నిర్లక్ష్యం
### కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహం

గతంలో పేదలకూ, పెద్దలకూ నాణ్యమైన వైద్యం అందించిన ప్రభుత్వ ఆసుపత్రులు నేడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వీర్యమయ్యాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అధిక నిధులు, సిబ్బందిని కేటాయించకపోగా ఉన్న వాటినే కత్తిరిస్తున్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రమాణాల ప్రకారం ఉండవలసిన సంఖ్య కంటే 85 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 156 కమ్యూనిటీ ఆసుపత్రులు తక్కువగా ఉన్నాయి. ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సగం మహిళా వైద్యులు లేకుండా పనిచేస్తున్నాయి. 24 గంటలూ పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 42శాతమే. కమ్యూనిటీ ఆసుపత్రులలో 72 శాతం బ్లడ్‌బ్యాంకు, 60 శాతం ప్రసూతి వైద్య నిపుణులు, 70 శాతం మత్తు వైద్యుడు లేకుండా పనిచేస్తున్నాయంటే అక్కడ ప్రజలకు ఏ మేరకు వైద్యం అందుతుందో అర్థం చేసుకోవచ్చు. సాధా రణ జ్వరాలకు కూడా వేలాది రూపాయలు చెల్లించి ప్రయివేటు వైద్యం కొనుక్కోవాల్సిన స్థితికి మనమంతా నెట్టబడ్డాం. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం అందక, ప్రయివేటు ఆసుపత్రులలో వైద్యం కొనుక్కునే స్థోమత లేక పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత రెండు సంవత్సరాలలో ప్రజలు పెద్ద ఎత్తున జ్వరాల బారిన పడినప్పుడు కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజల అమాయకత్వాన్ని, ఆందోళనను ఆసరాగా చేసుకుని ప్లేట్‌లెట్స్ అనో, మరొకటనో ప్రజలనుండి డబ్బులు దండుకున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ (ఇదే ఇప్పుడు ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ) లాంటి పథకాలు కార్పొరేట్ ఆసుపత్రులకు లాభాల పంట పండిస్తున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ పథకంలో విడుదలైన నిధులలో 76 శాతం ప్రయివేటు ఆసుపత్రులకే లభించాయి. ఈ నిధులన్నీ ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయిస్తే వాటి పనితీరు గణనీయంగా మెరుగుపడి, ప్రజలకు దీర్ఘకాలం పాటు వైద్య సేవలు లభించేవి.

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు ఆరోగ్య పరిరక్షణను కార్పొరేటీకరించటానికి, ధనికులు, పేదల మధ్య అసమానతలు పెరగటానికి దారితీశాయి. ఈ క్రింది డిమాండ్లను అమలు చేయాలని కోరుతున్నాం.

1. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటి కేంద్రాలు, జిల్లాస్థాయి ఆసుపత్రులు, మెడికల్ కాలేజి ఆసుపత్రులకు ఆరోగ్య బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించటం, ఖాళీ పోస్టులను భర్తీచేయటం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయాలి. ఆరోగ్యం, అనుబంధ రంగాలకు కేటాయింపులను గణనీయంగా, జియస్‌డిపిలో ఐదుశాతానికి పెంచాలి.

> **“ స్థూల జాతీయోత్పత్తిలో ప్రజారోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వెచ్చిస్తున్న నిధులు 1.02 శాతం మాత్రమే. శ్రీనాథ్‌రెడ్డి కమిటీ సూచనల ప్రకారం నిధుల కేటాయింపును 2017 నాటికి జి.డి.పిలో 3 శాతానికి 2020 నాటికి 5 శాతానికి పెంచాలి. వైద్య సేవల కల్పనకు భీమా పథకాలపై ఆధారపడకుండా, పన్ను ఆధారిత సార్వత్రిక వైద్యసేవల కల్పనను చేపట్టాలి. ”**

2. రీయింబర్సుమెంటుతో సహా ప్రైవేటు వైద్యరంగానికిస్తున్న అన్ని రకాలైన ద్రవ్య ప్రోత్సాహకాల పథకాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. వాటిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజి ఆసుపత్రుల ద్వారా అమలు చేయాలి.

3. ప్రైవేటు రంగానికి సంబంధించినంత వరకు చిన్న ఆసుపత్రులకు రక్షణ కల్పిస్తూ, కార్పొరేట్ ఆసుపత్రులలో ఫీజులు, వైద్యసేవల నాణ్యతను నియంత్రించేదిగా ప్రభుత్వపాత్ర ఉండాలి.

### కర్తవ్యాలు

అందరికీ ఆరోగ్యం కేవలం ప్రకటనలకు, ప్రణాళికలకే పరిమితమైన ఆదర్శం కాదని, ఇది ఆచరణలో సాధ్యమైన లక్ష్యమని ప్రజారోగ్య వేదిక విశ్వసిస్తుంది. ఈ క్రింది అంశాలను మేము ప్రతిపాదిస్తున్నాము. వీటిని పరిశీలించి మీ విలువైన సూచనలు అందించవలసినదిగా కోరుతున్నాము.

### ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం

ప్రభుత్వ ఆసుపత్రులకు తగిన నిధులు కేటాయించడం, ఖాళీ పోస్టులను భర్తీచేయటం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామీణ స్థాయి నుండి, రాష్ట్ర రాజధాని వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు అనుభవాలను అధ్యయనం చేసి ప్రజలు, ప్రజాసంఘాలు, వైద్యుల సంఘాలను సంప్రదించి మన ప్రభుత్వ ఆసుపత్రుల సామర్థ్యాలను పెంపొందించాలి. పారదర్శక విధానాలను చేపట్టి అవినీతిని అరికట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రులలో అందరికీ వైద్యం, వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించాలి. మెడికల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ విభాగాన్ని బలోపేతం చేయాలి. వైద్య పరికరాలకు, యంత్రాలకు అవసరమైన మరమ్మత్తులు నిర్ణీత కాల వ్యవధిలో జరిగేలా వ్యవస్థాగత చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలి.

### చిన్న, మధ్య తరహా ప్రయివేటు ఆసుపత్రులకు రక్షణ

### కార్పొరేట్ ఆసుపత్రుల నియంత్రణ

రీయింబర్సుమెంటుతో సహా ప్రైవేటు వైద్యరంగానికిస్తున్న అన్ని రకాలైన ద్రవ్య ప్రోత్సాహకాల పథకాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. వాటిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజి ఆసుపత్రుల ద్వారా అమలు చేయాలి. రోగుల హక్కులకు రక్షణ కల్పిస్తూ, ఆసుపత్రుల ఫీజులు, నాణ్యతా ప్రమాణాలను నియంత్రించేలా రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం రూపొందించాలి. ప్రభుత్వ – ప్రయివేటు భాగస్వామ్యంలో అమలవుతున్న పథకాలన్నింటినీ సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకువచ్చి, వాటి అమలును సమీక్షించాలి. ఐతే.... నాణ్యతా ప్రమాణాల పేరుతో ప్రభుత్వం చేపట్టే చర్యలు చిన్న, మధ్య తరహా ప్రయివేట్ ఆసుపత్రులకు మరియు లాభాపేక్ష లేని స్వచ్ఛంధ సంస్థలు నడిపే ఆసు పత్రులకు తలకు మించిన భారంగా పరిణ మించకూడదు. ప్రైవేటు రంగానికి సంబంధించి నంత వరకు చిన్న ఆసుపత్రులకు రక్షణ కల్పిస్తూ, కార్పొరేట్ ఆసుపత్రులలో ఫీజులు, వైద్యసేవల నాణ్యతను నియంత్రించేదిగా ప్రభుత్వపాత్ర ఉండాలి.

### నిధుల కేటాయింపు

స్థూల జాతీయోత్పత్తిలో ప్రజారోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వెచ్చిస్తున్న నిధులు 1.02 శాతం మాత్రమే. శ్రీనాథ్‌రెడ్డి కమిటీ సూచనల ప్రకారం నిధుల కేటాయింపును 2017 నాటికి జి.డి.పిలో 3 శాతానికి 2020 నాటికి 5 శాతానికి పెంచాలి. వైద్య సేవల కల్పనకు భీమా పథకాలపై ఆధారపడకుండా, పన్ను ఆధారిత సార్వత్రిక వైద్యసేవల కల్పనను చేపట్టాలి.

### అందరికీ నాణ్యమైన ఔషధాల అందుబాటు

ప్రతి మండల కేంద్రంలో జెనెరిక్ మందుల షాపులు ఉండేలా ప్రభుత్వం కృషిచేయాలి, అందుకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించాలి. వైద్యులందరూ జెనెరిక్ మందులను రాయాలనే నిబంధనలను కట్టుదిట్టంగా అమలు జరపాలి. ఐడిపియల్, హెచ్‌ఏఎల్‌లను పునరుద్ధరించాలి. ప్రభుత్వ రంగంలో ఔషధాలు, టీకాల పరిశ్రమలను పునరుద్ధరించాలి. మందుల ధరలు, నాణ్యత విషయంలో ప్రయివేటు మందుల కంపెనీలపై నియంత్రణ, నిఘా వ్యవస్థలను బలోపేతం చేయాలి. నకిలీ మందులు తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే మందుల కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. భారత పేటెంట్ చట్టం 1970ని మరింత బలోపేతం చేసి అమలు చేయాలి. మందుల ఉత్పత్తి, సరఫరా మరియు వాటి అందుబాటులో లాభాపేక్షకు అతీతంగా ప్రజా ప్రయోజనాలు కాపాడే దిశలో విధానాన్ని అమలు చేయాలి.

### వైద్య ఆరోగ్య సిబ్బంది హక్కులకు రక్షణ

అంగన్‌వాడీలు, ఆషాలు మరియు ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయమైన వేతనాలు చెల్లించి, వారు ఉత్సాహంగా, అంకిత భావంతో పనిచేసే వాతావరణం కల్పించాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి.

సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రవేశ పెట్టి అందరికీ ఆహారభద్రతను సాధించాలి. మద్యాన్ని ఆదాయ వనరుగా చూసే విధానానికి స్వస్థి పలికి మద్యాన్ని నియంత్రించాలి. తగిన నిధులు, సిబ్బంది, వనరులను సమకూర్చి, ఐసిడిఎస్ (అంగన్‌వాడీ) పథకాన్ని బలోపేతం చేసి మాతా – శిశు సేవలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి. అన్ని నివాస ప్రాంతాలకు ప్రభుత్వమే రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి తగిన ప్రాధాన్యత కల్పించాలి. బహిరంగ మల విసర్జనను రూపుమాపి మరుగుదొడ్లు వాడేలా, అన్ని పాఠశాలల్లో తగిన సంఖ్యలో మరుగు దొడ్లను నిర్మించి వాటిని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలను విరమించుకుని దానిని బలోపేతం చేయాలి. మహిళల ఆరోగ్యం మొత్తం కుటుంబ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. పని ప్రదేశాలలో వీరి ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. పిఎన్‌డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. కౌమార దశలోని బాలికలకు

లైంగిక, ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై అవగాహనను కల్పించాలి. స్త్రీలపై జరిగే అన్ని రకాల దాడులను ప్రజారోగ్య సమస్యగా పరిగణించి బాధితులకు సమగ్రమైన సహాయ, పునరావాస సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. గ్రామ ఆరోగ్య మరియు పోషకాహార సంఘాలు (విహెచ్ & ఎన్ఎస్) జిల్లా హెల్త్ సొసైటీలను ప్రజల భాగస్వామ్యంతో క్రియాశీలంగా నిర్వహించాలి.

వైద్య విద్యకు ప్రభుత్వం నిధుల కేటాయింపును పెంచాలి. కొత్త మెడికల్, డెంటల్, నర్సింగ్ కళాశాలల స్థాపనకు ప్రజల అవసరాలే ప్రతిపాదికగా ఉండాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేసి వాటికి గత వైభవంగా తీసుకురావాలి. ప్రయివేటు కళాశాలల్లో ఫీజులు, నాణ్యతా ప్రమాణాల నియంత్రణకు పారదర్శక విధానాలను అమలు జరపాలి. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టి, అది సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడి కలిగించకుండా వారిలో నైతిక విలువలు, సామాజిక స్పృహ, అత్యున్నత నైపుణ్యాలు పెంపొందించే ప్రజాస్వామిక శిక్షణా విధానాలు రూపొందించాలి. ప్రమాణాలు పాటించకుండా విద్యా వ్యాపారానికి పాల్పడే కళాశాలలపై ప్రజాస్వామిక శిక్షణా విధానాలు రూపొందించాలి. ప్రమాణాలు పాటించకుండా విద్యా వ్యాపారానికి పాల్పడే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అటువంటి కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిర్వహించాలి. క్లినికల్ అటాచ్‌మెంట్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రులను ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నాలు విరమించి ప్రభుత్వమే వైద్య కళాశాలలను ప్రారంభించాలి. దేశీయ వైద్య విధానాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయాలి. మనదేశీయ వాతావరణంలో పెరిగే మొక్కలలోని ఔషధ గుణాలను కనుగొనే దానికి ప్రత్యేక పరిశోధనలను ప్రోత్సహించాలి.

ఆరోగ్యాన్ని ప్రజల ప్రాథమిక హక్కుగా ప్రభుత్వం గుర్తించాలి. కార్పొరేట్ శక్తుల వ్యాపార ప్రయోజనాలకు ప్రజల ఆరోగ్యాన్ని బలిచేసే వినాశకర విధానాలకు స్వస్థి చెప్పి, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి. ఉన్నతమైన ఆశయాలు సాధించాలంటే నిబద్ధతతో కూడిన కార్యాచరణ కావాలి. "అందరికీ ఆరోగ్యం" అనే లక్ష్య సాధన కోసం మన రాష్ట్రంలో వివిధ సంఘాలు, సంస్థలు, వ్యక్తులు కృషి చేస్తున్నారు.

**"క్లినికల్ అటాచ్‌మెంట్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రులను ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నాలు విరమించి ప్రభుత్వమే వైద్య కళాశాలలను ప్రారంభించాలి. దేశీయ వైద్య విధానాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయాలి. మనదేశీయ వాతావరణంలో పెరిగే మొక్కలలోని ఔషధ గుణాలను కనుగొనే దానికి ప్రత్యేక పరిశోధనలను ప్రోత్సహించాలి."**



ఈ కృషిని సమన్వయం చేసుకుంటూ ఒక ప్రజారోగ్య ఉద్యమాన్ని నిర్మించడం నేటి చారిత్రక అవసరం. ఆ బాధ్యతను నెరవేర్చడానికి జరుగుతున్న ప్రయత్నమే 'ప్రజారోగ్య వేదిక'. ఈ వేదిక ప్రధానంగా ఈ క్రింది అంశాలపై కృషిచేస్తుంది.

**కార్యక్రమాలు**

ఆరోగ్య విధానాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం. లేఖలు, పత్రికా ప్రకటనలు, మెమోరాండాలు, సంప్రదింపుల ద్వారా ఆరోగ్య విధానాలపై ప్రభుత్వానికి సూచనలు అందించడం. పత్రికలకు వ్యాసాలు వ్రాయడం, వేదిక తరపున పుస్తకాలు ముద్రించడం ద్వారా ఆరోగ్య విధానాలపై ప్రజలలో అవగాహన పెంపొందించడం. బి.పి, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు నిరంతర మెడికల్ క్యాంపుల నిర్వహణ, విషజ్వరాల వంటి అత్యవసర పరిస్థితులలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం, వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. విశాల ప్రాతిపదికనన భావ సారూప్యతగల వ్యక్తులు, సంస్థలు, సంఘాలతో కలిసి పనిచేయడం. జాతీయ స్థాయిలో ప్రజారోగ్య అంశాలపై కృషి చేస్తున్న జన స్వాస్థ్య అభియాన్ లాంటి సంస్థలతో కలిసి పనిచేయడం చేస్తుంది

**విజ్ఞప్తి**

డాక్టర్లు, వైద్య కళాశాలల విద్యార్థులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, మెడికల్ & హెల్త్ ఎంప్లాయిస్, పబ్లిక్ హెల్త్ ఉద్యోగులు, నర్సింగ్ మరియు పారా మెడికల్ సిబ్బంది, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ఆరోగ్యంపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు (డయాబెటిస్, బిపి) ఆరోగ్య సేవలు బాగుండాలని కోరుకునే వారందరూ ఈ వేదికలో భాగస్వాములు కావలసిందిగా ఇదే మా సాదరమైన ఆహ్వానం.

**ప్రజారోగ్య పరిరక్షణకోసం జరిగే కృషిలో మనమందరమూ భాగస్వాములమవుదాం** ❊

**స్పందన**

# బిజెపీ! నీ హిందూత్వాన్ని, నీ ఫాసిజాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను

సుచిత్రా కృష్ణమూర్తి



రచయిత ప్రముఖ గాయని, నటి

భారతీయ నగరాలలో నివసించే అనేక మంది సగటు వ్యక్తుల్లో నేనూ ఒకదాన్ని. రాజకీయాలకు అతీతంగా జీవించే వ్యక్తిని. రాజకీయ అనుభవం లేని మనిషిని. కానీ నేను ఈ దేశాన్ని ప్రేమించే ఒక పౌరురాలిని. ఓ శ్రేయోభిలాషిని.

ఎన్నికల సమయంలో ఎంతో బాధ్యతతో, నిశ్శబ్దంగా ఓటు వేసే నాపై మిగిలిన సమయాలలో రాజకీయాలు ఏమాత్రం ప్రభావం చూపవు. భారీ కుంభకోణాలు జరిగినప్పుడు భారంగా ఓ శ్వాసపీల్చి, మా అభిప్రాయాలను, ఉద్దేశ్యాలను కథలుగా చెబుతాను. తర్వాత కాళ్ళకున్న దుమ్ముని దులిపేసినంత సులభంగా దులిపేసి ముందుకు సాగిపోతాను తప్ప రాజకీయాలను నా ఇంటి గుమ్మం తొక్కనివ్వను. మా బెడ్రూమ్‌లో, వంటఇంటిలో రాజకీయాలు సంపూర్ణంగా నిషిద్ధం.

1995లో శివసేన ప్రభుత్వం అధికారంలో కొచ్చి మాకెంతో ఇష్టమైన 'బొంబాయి' పేరును 'ముంబై' గా మార్చినప్పుడు నిశ్శబ్దంగా శాపాలు పెట్టాం... తిట్టుకున్నాం. ఆ తర్వాత ప్రాంతీయతా భావాలతో వల్లించిన అందమైన పదాల భాషా శ్రావ్యతతో కొట్టుకుపోయి తెప్పరిల్లాం. ఎందుకంటే శివాజీ పాలించిన రాష్ట్రంలో (వెండి స్పూన్) పంచభక్ష్య పరమాన్నాలు తినడానికి అలవాటుపడ్డ జీవితాలు కదా!

మరాఠీ మనుషులు ప్రాంతీయ దురభిమానంతో బీహారీలను వారి సొంత రాష్ట్రానికి పంపేయమంటూ వాహనాలను తగులబెట్టిన రోజుల్లో చూసీచూడనట్లు వదిలేశాం! ఎందుకంటే ఏదో ఒకరోజు తెలుసుకోలేకపోతారా? అని. ఇంత నిర్లిప్తంగా, తటస్తంగా ఉన్న మా జీవితాలలోకి 'హిందుత్వ భావజాలం' బొట్లుబొట్లుగా ప్రవేశిస్తున్నది. అయితే మా ఇష్టానికనుగుణంగా కాదు సుమా!

90వ దశకంలో భారతదేశ ఆర్థిక మంత్రిగా 'భారత్ వెలిగిపోతుందన్న' భావాన్ని మనకందరికీ అందించిన ఆర్థిక శాస్త్రవేత్త, ఈ దేశ ప్రధాని అయిన రోజున సంతోషించాం! కానీ 'మౌన మేధావి' ప్రధానమంత్రిగా మమ్మల్ని దారుణంగా నిరాశపరిచారు. అయినా భరించాం. ఎందుకంటే పాలనాధికారి మన్మోహన్ అయినా, పగ్గాలు మాత్రం అధినేత్రి సోనియా గాంధీ చేతిలోనే గదా! మన్మోహన్ సింగ్ హెడ్ లైట్ కాంతిలో ఇరుక్కున్న జింకలా కనబడతాడెందుకో? కాంగ్రెస్ ప్రభుత్వంలో పొగడ్తల భూతం అందరినీ మింగేయడమే గాక, దేశం మొత్తాన్ని తినేస్తున్నది.

భారతీయ ఆత్మను ఓ ఇటాలియన్ యాస మింగేస్తున్నప్పుడు భరించాం. లేకుంటే దిగ్విజయ్‌సింగ్ లాంటి సీనియర్ నాయకుడు 'గాంధీ'ల ప్రభావంలో కొట్టుకుపోవడం ఏమిటి? అమ్మ మాటలకు, అబ్బాయి చేష్టలకు ఒకేలా తల ఊపడం ఏమిటి?

**రాహుల్ గాంధీ!...**

అన్నట్లు మరిచాను. ఆ రాబర్ట్ వాద్రాలో ప్రియాంకకు నచ్చిందేమిటో? చూడటానికే గూండాలా కన్పించే అతని కుటుంబం మొత్తం పరమ రహస్యంగా మరణించడం వెనుక మర్మం ఏమిటి? ఓ మైగాడ్!

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'ఫోర్బ్స్' పత్రిక అత్యంత సంపన్న మహిళల జాబితాలోసోనియా గాంధీ మూడవస్థానంలో ఉన్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయినా సరే అత్యంత చవకముతక నేత చీరల్లో ప్రత్యక్షమవ్వడం వెనుక అంతరార్థమేమిటో? ఎంత గొప్ప నటి? షబానా అజ్మీ కన్నా గొప్పగా నటిస్తుంది.

ఉఫ్! భారతదేశాన్ని బాలీవుడ్‌తో పోల్చడం! సుదీర్ఘమైన ఈ కథను క్లుప్తంగా చెబుతాను. 2014లో మరలా ఎన్నికలు వచ్చాయి. కుటుంబ వారసత్వ రాజకీయాలతో, కుంభకోణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మా ఆశల మీద నీళ్ళు చల్లిందని అనేకానేకమంది నగరవాసుల్లాగా నేనూ భావించాను. ఓ క్రొత్త ఆశతో, ఓ మార్పుకోసం తపించాను. ఓ ఆశా కిరణం కనిపిస్తుందేమోనని వేచి చూశాను.

**అరవింద్ కేజ్రీవాల్...**

ఓ ప్రళయంలా, మహాత్మాగాంధీ మరో అవతారంలా నిరాహార దీక్షలతో మా ముందు ప్రత్యక్షమయ్యాడు. తాను సిఐఎ (ఫోర్బ్స్ ఫౌండేషన్) నుండి నిధులు పొందుతున్న సత్యాన్ని మరుగుపరచి 'సామాన్యుడి' కోసం, సామాన్యుడి తరఫున అవినీతిపై యుద్ధానికి నిలిచిన యోధుడిలా కన్పించాడు. కానీ, అవకాశవాదంతో నెట్టివేయబడ్డాడు. కారుచీకట్లో కాంతిరేఖ ఆర్పివేయబడింది. ఏం చేయాలి? ఎవరివైపు చూడాలి?

దేశానికి దిక్కూచి లేనంత నిరాశ. ఓ నాయకుడు కావాలి. దేశాన్ని పురోగమన దిశగా నడిపే దక్షుడు కావాలి. నిజాయితీకి ప్రతిరూపంగా ఉండాలి. ఓ ఆశావహ వాతావరణం కావాలి. అదిగో అదే! నరేంద్రమోడీ రూపంలో ప్రత్యక్షమయ్యింది. 'కర్మచారి, బ్రహ్మచారి, సంస్కారి' అన్న అందమైన పదబంధనంలో!

భారతదేశాన్ని భవిష్యత్తులోకి నడిపించగల ఏకైక నాయకుడిగా ఓ మాయాజాలం సృష్టించబడింది. గుజరాత్ మోడల్‌గా, భారతీయ సాంప్రదాయం పేరిట, ఇటాలియన్‌కి వ్యతిరేకంగా ఓ అద్భుత దృశ్యం ఆవిష్కరింపబడి మార్కెట్ చేయబడింది.

నిర్మొహమాటంగా, ధైర్యంగా ప్రశ్నిస్తున్నాను. ఇలా మాట్లాడినందుకు 'రాజద్రోహం'గా భావిస్తారా? శిక్షిస్తారా?

2012లో కర్ణాటక అసెంబ్లీలో అశ్లీల చిత్రాలు చూస్తున్న సిసి పుటేజి మరియు లక్ష్మణ్‌లను, పనిచేసే ప్రాంతాల్లో మహిళలు జీన్స్ ధరించరాదన్న నిబంధనను, ఆల్కహాల్ సేవిస్తున్నారని

చేసిన బిజెపి ప్రభుత్వ దాడులను అన్నిటినీ మోడీ ఫైవ్‌స్టార్ మాయాజాలంలో ప్రజా సంబంధాల బృందం మరుగున పడేసింది

ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డ్‌లలో ప్రజా సంబంధాలకై ఓ అవార్డ్ ఉంటే, అది పొందే అర్హత నిస్సందేహంగా నమో బృందానికే ఉంది.

మీ ప్రభుత్వం రాకముందు, అడుగంటిన మా ఆశల సాక్షిగా, మంచి దేశాన్ని, ఉజ్జ్వల భవిష్యత్తుని చూడాలన్న సగటు పౌరుల్లాగా నేను కూడా నా కుటుంబ సభ్యులను, మిత్రులను, సన్నిహితులను అందరినీ 'నమో'కి ఓటు వేయమని కోరాను.

సోషల్ మీడియా సాక్షిగా, రాహుల్‌గాంధీ కన్నా, నమో మిన్న అని భావించాను. కానీ పొరపాటు పడ్డాను. చాలా పెద్ద తప్పిదం చేశాను. ఆ రోజు, నా ప్రచారం సరైనదని అనేకానేక నాగరీకుల్లా నేను కూడా భావించాను.

భారతీయ జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ఎందువలన? గాంధీ వారసత్వ కుటుంబ పాలనను భరించలేని భారతీయ సమాజం వల్ల. మౌన మేధావి గారి అసమర్థ పాలన సహించలేని ప్రజాగ్రహం వలన. గాంధీ కుటుంబ పాలనకు ప్రత్యామ్నాయంగా భావించడం వలన.

తన ముద్దుల కొడుకుని, దేశ యువరాజు అన్న భ్రమలో ఉన్న రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలన్న 'అమ్మ' కోర్కె స్థానంలో, మరో వ్యక్తి ప్రధాని పదవికి పోటీలో ఉండి ఉంటే ఖచ్చితంగా ఓట్లు చీలిపోయి ఉండేవి. అలా గాకపోవడం, 'నమో' ప్రత్యర్థి రాహుల్ గాంధీ కావడం వలన అధికారాన్ని చేజిక్కించుకో గలిగారు. భారతీయ జనతాపార్టీ ఈ విషయంలో రాహుల్ గాంధీకి సదా కృతజ్ఞురాలై ఉండాలి. భారతీయ ప్రజలందించిన విజయాన్ని ఏం చేశారు? మమ్మల్ని నిరాశ పరిచారు అని చెప్పడం చాలా చిన్న పదం. మీరు నిరాశపరచడం కాదు. మా ఆగ్రహానికి గురవుతున్నారు. మాలో భయాందోళనలకు కారణమవుతున్నారు. ఇది గర్హనీయం. ఖచ్చితంగా, నూటికి నూరుశాతం దీన్ని మేము అంగీకరించం. ఎందుకంటే ఇది నీచం... నిజంగా తుచ్ఛమైనది.

నాకు బాగా జ్ఞాపకం. నమోకి ఓటు వేయమని ఓ ముస్లిం మిత్రుడ్ని కోరగా, అతనో జోక్ చెప్పాడు. అదేమిటో తెలుసా? బిజెపి అధికారంలోకి వస్తే తాను కరాచీకి నావలో ప్రమాణమవ్వాలని. గోద్రా మత కల్లోలాల సంఘటనల తాలూకూ హింస జనాల హృదయాలలో పచ్చిగానే ఉందని నాకప్పుడు అర్థమయ్యింది. కానీ అతని అభిప్రాయం తప్పుకాదనిఇప్పుడనిపిస్తుంది.

❝ తాను బి.ఎ. దూరవిద్యలో పాసయ్యిందో లేక ఊహల్లో బి.కాం పాస్ అయ్యిందో తనకే స్పష్టతలేని విద్యాశాఖ మంత్రిగారికి 'హిందూ మతానికి, హిందూత్వానికి' తేడా తెలుసా అసలు? సహనం, జాలి, దయ ఇవన్నీ ఉన్న హిందూ మతాన్ని అర్థం చేసుకోలేకపోతే ఓ హిందువుగా పిలవబడటానికి కూడా అనర్హులే! ❞

ఆక్షణాన అతను అనవసరంగా భయపడుతున్నాడని నాకనిపించింది. అందుకే ముస్లింగా గుర్తింపబడే మైనార్టీ కార్డ్‌ని అనవసరమైన హక్కులకోసం, రాయితీలకోసం ఉపయోగించకూడదని చెప్పాను. కానీ, మానసికంగా అతను కరాచీకి నావలో ప్రయాణం ఆలోచనలో ఉంటే, అసలు అతను ఎక్కడ ఉన్నట్లు? అదే ప్రశ్న నేను సంధించగా "నీ కర్థం కాదులే యస్‌కె (సునీతా కృష్ణమూర్తి) అంటూ అతనో నిట్టూర్పు విడిచాడు. ఈరోజు గతాన్ని సింహావలోకనం చేసుకుంటే అతనన్నదే నిజమని నాకనిపిస్తున్నది.

ముస్లింలకు రిజర్వేషన్లు, మైనార్టీ హోదా ఇవన్నీ ఓటు బ్యాంకు రాజకీయాలే తప్ప మరేమీ కాదని నా ఉద్దేశ్యం. 'విభజించు, పాలించు' అన్నది కాంగ్రెస్ సిద్ధాంతం. ముందుగా చెప్పినట్లే నేను రాజకీయాలకు కొత్త. కానీ నేను కళాకారిణిని. ప్రపంచ పోకడలను అర్థం చేసుకోగలిగినంత సామర్థ్యమున్న అమాయకురాలిని. అధికశాతం జనం మిమ్మల్ని భరించలేక పోతున్నారని మీకు విశదీకరించగలిగినంత అమాయకురాలిని.

**అందుకే ఇలా ఈ మార్గంలో...**

బిజెపి అధికారంలోకి వచ్చిన ఒక్క సంవత్సరంలోనే భరించలేనంత నిరాశ కల్గించింది. ఓ పెద్ద తప్పు చేశామన్న భావన మమ్ముల్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. మతతత్వానికి, ఫాసిస్ట్ ధోరణులకు ఆజ్యం పోసే కాలానికి ఓటు వేస్తున్నామని ఆనాడు మేము ఊహించలేదు.

**అసలేం జరుగుతుంది డబ్ల్యూ.టి.ఎఫ్.?**

ప్రియమైన భాజాపా! దయచేసి మాకు అర్థమయ్యేలా చెప్పగలవా? కోళ్ళు, మేకలు ఏం పాపం చేశాయని చంపబడుతున్నాయి? ఆవు ఏం పుణ్యం చేసిందని రక్షింపబడుతుంది?

ఓ... గుర్తు వచ్చింది... మీ కన్నా ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం విధించింది గదా! అందుకా? అయితే, వాళ్ళు మీలాగా బలవంతంగా రుద్దలేదు. అయ్యో, నేను హిందువుగా పుట్టినందుకు హఠాత్తుగా ఇప్పుడు ఎందుకు సిగ్గుపడుతున్నాను?

మీకు ప్రతీకారం కావాలి. కాంగ్రెస్ కన్నా పైస్థాయిలో ఉండాలి. అదేగా మీక్కావాల్సింది. మీరో సత్యం మరచిపోతున్నారు. పాలనలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని, రైతుల ఆత్మహత్యలు, స్త్రీలపై అత్యాచారాలు, బోరుబావుల్లో మరణిస్తున్న పసిపిల్లలు, గజేంద్ర చౌహాన్... ఇంకా ఏమన్నా చెప్పాలా?

మరలా అడుగుతున్నాను. ఇవన్నీ అడుగుతున్నందుకు రాజ ద్రోహం పేరిట నన్ను శిక్షించ దలచుకున్నారా? నిర్మొహమాటంగా, ముక్కు సూటిగా అడుగుతున్నాను. అలాంటి ఉద్దేశ్యం మీకుందా? ఆ... అదేంటి? పాశ్చాత్య సంస్కృతిని పారద్రోలి భారతీయ సంస్కృతిని పరిరక్షించడమా? అసలు దాని అర్థం మీకు సుస్పష్టంగా తెలుసా? మా దేశపు మానవీయ విద్యాశాఖ మరియు మానవ వనరుల శాఖామంత్రి స్మృతి ఇరానీగారు?

తాను బి.ఎ. దూరవిద్యలో పాసయ్యిందో లేక ఊహల్లో బి.కాం పాస్ అయ్యిందో తనకే స్పష్టత లేని విద్యాశాఖామంత్రిగారికి 'హిందూ మతానికి, హిందూత్వానికి' తేడాతెలుసా అసలు? సహనం, జాలి, దయ ఇవన్నీ ఉన్న హిందూ మతాన్ని అర్థం చేసుకోలేకపోతే ఓ హిందువుగా పిలవబడటానికి కూడా అనర్హులే! హిందూమతం ఓ తత్త్వశాస్త్రం. ఓ జీవన విధానం. ఆచరించాలా లేదా అనేది ఎంపిక చేసుకొనే అధికారం నాకుంది.

రాముడా? గణపతా? లేక నాస్తికత్వమా? ఉపనిషత్తులా? భగవద్గీతా? మంత్రాలా? తంత్రాలా? నచ్చిన మార్గాన్ని ఎంచుకోవాల్సింది నేను. హిందూత్వమనేది బలవంతంగా రుద్దబడుతున్న ఓ అంశం... మతాచరణకు సంబంధం లేని ఓ సిద్ధాంతం. హిందూత్వ ఓ రాజకీయ అస్త్రం. మతానికి ఏమాత్రం సంబంధంలేని

(మిగతా 33వ పేజీలో)

# వ్యూహాత్మక కర్తవ్యాలు జవాబుదారీతనం

ఎస్. వీరయ్య



రచయిత సిపిఎం
కేంద్ర కమిటీ సభ్యులు

**40** రోజులపాటు మున్సిపల్ కార్మికుల సమ్మె, 44 రోజులపాటు పంచాయితీ కార్మికుల సమ్మె, ఇప్పుడు 2 మాసాలుగా ఆశాల పోరాటం ఉధృతంగా సాగుతున్నది. ఇతర రంగాల్లోను ఆందోళన మొదలవుతున్నది. వీటికితోడు సామాజిక రంగంలో కృషి మరో కర్తవ్యం. ఇది ప్రజా పునాదికి, రాష్ట్రంలో రాజకీయ బలాబలాలకు సంబంధించిన సమస్య. ఇక విస్తరణకు ఉద్దేశించిన వ్యూహాన్ని అమలు జరిపేదెప్పుడు? కార్యకర్తలను, నాయకులను అనుక్షణం వేధించే సమస్య ఇది. ఇప్పుడే కాదు, బిసి సబ్‌ప్లాన్, ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల కోసం కృషి ప్రారంభించక ముందు కూడా ఈ సమస్య తలెత్తింది. అందువల్ల ఇది ఒకటి రెండు కర్తవ్యాలకు సంబంధించింది కాదు. వ్యూహాత్మక అవగాహన, ప్రణాళికాబద్ధమైన కృషికిసంబంధించిన సమస్య.

కార్మికరంగంలో పార్టీ నిర్దేశించిన వ్యూహాత్మక కర్తవ్యాలు కేవలం తక్షణ ఫలితాలకుద్దేశించినవి మాత్రమే కాదు. విప్లవానికి సంబంధించిన మౌలిక అవగాహనాపరమైన విషయాలు కూడా. మన పార్టీ కార్మికవర్గ పార్టీ. కార్మిక వర్గం విప్లవకర వర్గం. అందువల్ల కార్మిక రంగంలో అమలు చేయవలసిన వ్యూహాత్మక కర్తవ్యాలకు మరే కర్తవ్యాన్నీ పోటీగా చూడకూడదు. ఇంకా చెప్పాలంటే ప్రతి కార్యక్రమాన్ని, కర్తవ్యాన్ని వ్యూహాత్మక కర్తవ్యాలు నెరవేర్చేందుకు వినియోగించుకునేవిధంగా అన్వయించుకోవాలి.

మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాల్లో కృషి, క్లస్టర్స్, గిరిజన ప్రాంతాలు, రాష్ట్రవ్యాపిత రంగాలు (ముఖ్యంగా స్కీమ్ వర్కర్స్) విస్తరణకుద్దేశించిన వ్యూహాత్మక కర్తవ్యాలు. భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో పార్టీ విస్తరణకు, విప్లవ లక్ష్యానికి ఉన్న సంబంధం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందుకే ఇది విప్లవ కర్తవ్యం అంటున్నాము. దేశవ్యాపిత పార్టీ లేకుండా విప్లవ లక్ష్యం చేరుకోలేము. దేశవ్యాపిత పార్టీ లేనందువల్లనే ఇప్పటికే అనేక సందర్భాలలో విప్లవోద్యమానికి ఉన్న అవకాశాలను కోల్పోయాము. దేశవ్యాపిత పార్టీని నిర్మించే కృషిలో భాగంగానే మన రాష్ట్ర పరిధిలో, మనం రాష్ట్రవ్యాపిత పార్టీ కోసం కృషి చేయాలి. ఇది తెలంగాణ అయినా ఆంధ్రప్రదేశ్ అయినా చేయవలసిన పనే.

మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలను ఆందోళనా ప్రచార కేంద్రాలుగా రూపొందించాలన్న లక్ష్యానికి ఇంకా చాలా దూరంలో ఉన్నాము. రాష్ట్రం విడిపోయిన తరువాత అసంతృప్తి మొదట కార్మికరంగంలోనే వేగంగా పెరుగుతున్నది. ఇప్పుడే కాదు, ప్రత్యేక తెలంగాణ కోసం ఒకవైపు, సమైక్య ఆంధ్ర కోసం మరోవైపు ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్న కాలంలో కూడా కార్మికవర్గంలో ఆర్థికసమస్యల మీద, హక్కుల మీద అసంతృప్తి తీవ్రమై, సుదీర్ఘ పోరాటాలు చేసిన విషయం తెలిసిందే. ఆ పోరాటాల్లో ఒక రాజకీయ పార్టీగా సిపిఐయం పాత్ర కీలకమైనది. ఇప్పుడూ అంతే. తెలంగాణలో అయినా ఆంధ్రప్రదేశ్‌లో అయినా కార్మికవర్గ హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలకు అండగా నిలబడుతున్నది సిపిఐయం, ఇతర వామపక్షాలు మాత్రమే. కమ్యూనిస్టు పార్టీగా ఇది సిపిఐయం బాధ్యత. పోరాటంలో ఉన్న ప్రజలకు అండగా నిలవడానికి మించిన కర్తవ్యం కమ్యూనిస్టులకు మరొకటి లేదు. ఈ పోరాట కాలంలో మండల, పట్టణ కేంద్రాలలో నిర్వహించిన సంఘీభావ కార్యక్రమాలేమిటి అన్నదే మన ముందున్న ప్రశ్న? సమ్మెలో ఉన్న కార్మికవర్గానికి సంఘీభావంగా సదస్సులు, సెమినార్లు, ఇతర ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించి ఉండవచ్చు. పారిశుధ్య సిబ్బంది సమ్మె సందర్భంగా 73, 74 రాజ్యాంగ సవరణల గురించి స్థానిక సంస్థలకు అధికారాలు, వనరుల గురించి అన్ని మండల పట్టణ కేంద్రాలలో సదస్సులు, సెమినార్లు, చర్చా గోష్టులు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నం ఏమిటి అన్నది పరిశీలించుకోవాలి.

క్లస్టర్స్ మరొక ముఖ్యమైన కర్తవ్యం. కార్మికవర్గంలో కూడా ఉత్పత్తి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. ఉత్పత్తిని స్తంభింపజేసి పాలకవర్గాలను నిలదీయగల శక్తి పారిశ్రామిక రంగ కార్మికులకు ఉన్నది. అందువల్ల పారిశ్రామిక క్లస్టర్స్ మీద కృషి ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఫలితాలు అంత తొందరగా రావు. అయినా ఇది దీర్ఘకాలిక కర్తవ్యం, వ్యూహాత్మకం. అందుకే ఓర్పుతో, సహనంతో ప్రణాళికాబద్ధంగా చేయవలసిన పని ఇది. పారిశ్రామిక క్లస్టర్ అనగానే యూనియన్లను ఏర్పాటు చేయటమే లక్ష్యంగా భావించకూడదు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు, తమ హక్కుల కోసం కార్మికులను సంఘటితం చేసేందుకు చేస్తున్న ఆందోళన ప్రచార కార్యక్రమాలు, ఆ క్లస్టర్‌లోని కార్మికులందరి మీద ప్రభావం కలిగించడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలి. ఈ క్రమంలో యూనియన్లు ఏర్పాటు చేసుకునేందుకు ఏ కంపెనీ కార్మికులయినా సంసిద్ధత వ్యక్తం చేస్తే అందుకు సిద్ధపడవచ్చు. క్లస్టర్ మొత్తాన్ని ప్రభావితం చేయగల కీలకమైన పరిశ్రమను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ పెట్టడం కూడా అవసరం. అసంఘటిత రంగానికి సంబంధించిన క్లస్టర్స్ కూడా అనేకం ఉన్నాయి. వాటిలో బీడి రంగం రాజకీయ ప్రాధాన్యత కలిగి ఉన్నది. తెలంగాణలో ఈ రంగానికి 5 జిల్లాల రాజకీయాలను మార్చగల శక్తి ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కర్నూలు, అనంతపూర్, చిత్తూరు, కడప వంటి జిల్లాలలో గణనీయమైన సంఖ్యలోనే బీడీ కార్మికులున్నారు. గిరిజన

ప్రాంతాలలో విస్తరణకు పునాది రాష్ట్రవ్యాపిత రంగాలలో బలపడటమే. అందుకని రాష్ట్ర వ్యాపిత రంగాలమీద పెట్టే శ్రద్ధ మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలన్నింటిలోను విస్తరించ డానికే కాకుండా గిరిజన ప్రాంతాలకు అవసర మైన యంత్రాంగాన్ని కూడా అందించగలదు. ఈ అవగాహన అనుక్షణం కమ్యూనిస్టులకు ఉ ండవలసిందే.

> **"కార్మికవర్గంలో పెరుగుతున్న అసంతృప్తి వ్యూహాత్మక కర్తవ్యాలను నెరవేర్చడానికి ఒక మంచి అవకాశంగా భావిం చాలి. రెండు తెలుగు రాష్ట్రాలలోను పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూడల్ ధోరణి ప్రదర్శిస్తున్నది. పనికిమాలిన సంఘాలు, పనికిమాలిన సమ్మెలు అని హేళన చేస్తున్నది. ఎంతకాలం చేసుకున్నా పరిష్కరించేది లేదని మొండికేస్తున్నది."**

కార్మికవర్గంలో పెరుగుతున్న అసంతృప్తి వ్యూహాత్మక కర్తవ్యాలను నెరవేర్చడానికి ఒక మంచి అవకాశంగా భావించాలి. రెండు తెలుగు రాష్ట్రాలలోను పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూడల్ ధోరణి ప్రదర్శిస్తున్నది. పనికిమాలిన సంఘాలు, పనికిమాలిన సమ్మెలు అని హేళన చేస్తున్నది. ఎంతకాలం చేసుకున్నా పరిష్కరించేది లేదని మొండికేస్తున్నది. అడుక్కోవాలి తప్ప, ఆందోళ నలు చేస్తే చెల్లదని హెచ్చరిస్తున్నది. అంతే పట్టు దలతో కార్మికులు పోరాడుతున్నారు. సమస్యలు పరిష్కారం చేస్తారా లేదా అన్నది తేల్చుకోవా ల్సింది పాలకులు. పరిష్కరిస్తే వారి గౌరవం నిలబెట్టుకుంటారు. పరిష్కరించకపోతే మరింత అప్రతిష్టపాలవుతారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తే పాలకవర్గాల స్వభావాన్ని కొంత మంది ఆలస్యంగా అర్థం చేసుకోవచ్చు, పరిష్క రించకపోతే ఎక్కువ మంది తొందరగానే అర్థం చేసుకుంటారు. కమ్యూనిస్టులు చేయవలసిందల్లా పోరాడుతున్న కార్మికవర్గానికి సంపూర్ణ అండదండలు ఇస్తూ రాజకీయ సైద్ధాంతిక దిక్సూచిగా పనిచేయడమే. పాలకులు నిర్బంధం ప్రయోగించడం ద్వారా ఉద్యమాన్ని సులభంగా అణచివేయవచ్చని అనుకుంటారు. నిజానికి నిర్బంధం ప్రయోగించినప్పుడు కార్మికవర్గం మరింత సులభంగా చైతన్యవంతులవుతారు. అందుకే ఈ ఉద్యమాలను కమ్యూనిస్టులు సవాలుగానే స్వీకరిస్తారు. అంతేకాదు, వ్యూహా త్మక కర్తవ్యాల సాధనలో అందివచ్చిన అవ కాశాలు కూడా.

కార్మికులను పోరుబాట నడిపించడం కోసమే కాదు, వ్యూహాత్మక కర్తవ్యాలను సాధించేందుకు కూడా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వచ్చిన అవకాశం జారవిడుచు కుంటే మళ్ళీ వస్తుందన్న గ్యారెంటీ లేదు. మనకు తీరినప్పుడు కాదు, అవకాశం వచ్చినప్పుడే తీరిక చేసుకోవాలి, సద్వినియోగం చేసుకోవాలి. తెలం గాణలో బీడీ కార్మికులు రు.1000 భృతి కోసం కదిలినప్పుడే రాష్ట్రవ్యాపితంగా కదిలిం చాలి. వేడి చల్లారిన తర్వాత మనం కదిలించినా వారు కదలరు. ఈ పని ఏ మేరకు చేశామో పరిశీలిం చుకోవాలి. కార్మికుల్లో కదలిక ఉన్నప్పుడు ఇంకెన్ని కార్యక్రమాలున్నా కార్మికవర్గ పోరాటమే ప్రధానమవుతుంది. ఈ అవగాహన మదిలో నాటుకుంటే వచ్చిన అవకాశాన్ని జారవిడు చుకోం. కార్మికోద్యమం బలపడకుండా, పార్టీ విస్తరించకుండా ఇతర ప్రజా సమస్యల మీద చేసే కృషి, పోరాటాల ఫలితాలను కూడా నిలుపుకోవడానికి పరిమితులేర్పడతాయి. మనిషి లోపల అస్థిపంజరం లేకుండా రక్తమాంసాలు నిలవవు. అందచందాలు అసలే ఉండవు.

క్లస్టర్స్ అయినా మండల, పట్టణ కేంద్రాల్లో నైనా పూర్తికాలం కార్యకర్తలు తగినంతమంది లేకపోవడం వల్లనే వెనుకబడుతున్నామన్న బలమైన అభిప్రాయం ఉన్నది. పూర్తికాలం కార్యకర్తలుంటే చాలా కర్తవ్యాలు నెరవేర్చవచ్చు. కానీ పూర్తికాలం కార్యకర్తలు లేకుండా ఏమీ చేయలేము అనుకోవడం సరైంది కాదు. ముఖ్యంగా కార్మికరంగంలో కార్మికవర్గం నుండే కార్యకర్తలు, నాయకులు ఎదగడం అవసరం. ఆందోళన, పోరాట కార్యక్రమాల్లో చురుకుగా ఉంటూ తగు శక్తిసామర్థ్యాలు ప్రదర్శిస్తున్నవారిని గుర్తించి రాజకీయంగా, సైద్ధాంతికంగా అభివృద్ధి చేసుకోవడంలో నైపుణ్యం చూపగలిగితే అనేకమంది కార్యకర్తలను అభివృద్ధి చేసుకో వచ్చు. ఒక పూర్తికాలం కార్యకర్త ఉంటే చేయ గలిగిన పనిని పది ముక్కలు చేసి పదిమంది పాక్షిక కార్యకర్తలకు అప్పగించవచ్చు. పారిశ్రా మిక క్లస్టర్లు కూడా ఇందుకు మినహాయింపు కాదు. పరిశ్రమలలో యూనియన్లు ఏర్పాటు చేసి నడిపించగల సామర్థ్యం ఉన్నవారినే క్లస్టర్ కార్యకర్తలుగా నియమించాలనుకుంటే అంత సులభం కాదు. ఆందోళన కార్యక్రమాలు చేయ గలిగిన వారిని నియమించవచ్చు. యూనియన్ ఏర్పాటు చేసే అవకాశం వచ్చినప్పుడు జిల్లా నాయకులు లేదా అవసరమైతే రాష్ట్ర నాయకులైనా ఆ యూనియన్‌కు నాయకత్వం వహించవచ్చు. యూనియన్ స్వభావం, ఆ యూనియన్ నిర్వహ ణకు అవసరమైన నైపుణ్యం, కార్మికుల అంగీకా రాన్ని బట్టి నాయకత్వాన్ని నిర్ణయించుకోవచ్చు.

కొన్ని సందర్భాలలో ఆయా పరిశ్రమలకు సంబంధించి పని స్వభావంలో లేదా యాజ మాన్యం కార్మిక సంబంధాల్లో మార్పులు సంభవించవచ్చు. వీటిని గమనించడంలో క్లస్టర్ కార్యకర్త వెనుకబడి పోవచ్చు. అత్యంత ప్రాథమిక మైన సామర్థ్యం కలవారినే క్లస్టర్ కార్యకర్తగా నియమిస్తున్నందువల్ల ఈ సమస్య సహజం. కొన్ని రంగాల్లో ఎలా పనిచేయాలో కూడా క్లస్టర్ కార్యకర్తకు అవగాహన సరిపోకపోవచ్చు. ఇవన్నీ అనుక్షణం గమనిస్తూ, అధ్యయనం చేస్తూ తగు చర్యలు తీసుకోవలసిన బాధ్యత జిల్లా నాయక త్వానిదే. నిరంతరం క్లస్టర్ కార్యకర్తల అవగాహన మెరుగుపర్చుకోవడం, పనిలో తగు సూచనలిస్తూ సహాయపడటం, అవసరమైతే కార్యకర్తలను మార్చడం వంటి పనులన్నీ జిల్లా కేంద్రం చెయ్యా లి. అందువల్ల ఒక క్లస్టర్‌కు లేదా మండల పట్టణ కేంద్రానికి కార్యకర్తను కేటాయించడంతోటే నాయకత్వం పని పూర్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యూహాత్మక లక్ష్యాలు నెరవేర్చేదాకా నిరంతరం, అనుక్షణం నాయకత్వం దృష్టి మరలకూడదు. ఇక్కడే జవాబుదారీతనం కీలకం. ఇది నాయకత్వానికి సంబంధించిన సమస్య. కార్యకర్తలంతా నిర్దేశించిన వ్యూహం పరిధిలో పనిచేస్తున్నారా లేక తోసుకొచ్చిన పనిలో కొట్టుకు పోతున్నారా చూడవలసిన బాధ్యత నాయకత్వా నిదే. ఇది నాయకత్వ పర్యవేక్షణ, సమన్వయానికి సంబంధించిన సమస్య. వ్యూహా త్మక కర్తవ్యాలలో వెనుకబడితే నాయకత్వం పనిలో వెనుకబడినట్టే. ఇవి చైతన్యపూరితంగా చెయ్యవలసిన పనులు. తోసుకొచ్చే కర్తవ్యాలతో వ్యూహాత్మక కర్తవ్యం మారదు. ఎన్ని సమస్యలు, పోరాటాలు తోసు కొచ్చినా వ్యూహాత్మక కర్తవ్యాల నిర్వహణకు ఇబ్బందిరాని విధంగా ప్రణాళిక రూపొందించు కోవడమే నాయకత్వం చెయ్యవలసిన పని. ❊

**వాగ్దానాలు - అమలు తీరు**

# ఎండమావుల చందాన చంద్రబాబు పాలన



*రచయిత 10 టీవీ విజయవాడ రీజనల్ కో-ఆర్డినేటర్*

**కంచల జయరాజ్**

ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు అధికారం చుట్టూనే తిరుగుతున్నాయి. ప్రజా సంక్షేమం కాని, రాష్ట్రాభివృద్ధికాని ఏ మాత్రం పట్టించుకునే అవసరం, ఆవశ్యకత లేనట్లుగానే ఆయా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలన్నీ ఒక ఎత్తైతే, 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు చరిత్రలోనే లిఖించదగ్గవిగా మారాయి. అన్ని పార్టీలు చావో రేవో అన్నట్టు ఎన్నికల బరిలోకి దిగాయి. దశాబ్ద కాలంపాటు ప్రతిపక్షంలో ఉండి, అధికారం లేక ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో సర్వశక్తులు ధారపోశారు. రాష్ట్ర విభజన కాంగ్రెస్ పార్టీకి పాతరవేస్తే, తెలుగుదేశం పార్టీకి కలిసొచ్చింది. వైఎస్సార్సీపీ అధికారం తనదేనని అత్యుత్సాహనికిపోయి చతికిలపడింది. కేంద్రంలో తన హవా కొనసాగించుకున్న బీజేపీ రాష్ట్రంలో తన బలంపై ఓ అంచనాకు రాలేకపోయింది. మొత్తంమీద అనుకోని రీతిలో, ఊహించని మెజార్టీతో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. గతంలో చంద్రబాబు నాయుడు చేసిన తప్పిదాలు ఆయనే స్వయంగా ప్రజల ముందు అంగీకరించారు. రాబోయే రోజుల్లో తాను మారిన మనిషిగా నిరూపించుకుంటానని ప్రజలకు వాగానం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ప్రజల్ని ఆకర్షించాయి. ఆదాయంతో నిమిత్తం లేకుండా, ఎంత ఖర్చవుతుందో లెక్క తేలకుండానే చంద్రబాబునాయుడు ఇబ్బడిముబ్బడిగా ఎన్నికల హామీలు గుప్పించేశారు. రాష్ట్ర ఏడాది బడ్జెట్ కంటే చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల మొత్తమే ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. గడిచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీల్లో కీలకమైనవి, జనాలను ప్రభావితం చేసినవి రైతుల, డ్వాక్రా సంఘాల రుణమాఫీ ప్రధానమైనవి. దశాబ్ద కాలంపాటు పరిపాలన చేసి హైటెక్ బాబుగా పేరుతెచ్చుకున్న చంద్రబాబునాయుడు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా రైతులు చంద్రబాబును రెండుసార్లు అధికారానికి దూరంగానే ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు తాను రైతు పక్షపాతినని నిరూపించుకోవడానికి చేసిన ప్రయత్నలో భాగమే రైతు రుణమాఫీ. ఇప్పటికీ రాష్ట్రంలో అత్యధిక భాగం ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లోనే జీవిస్తున్నారు. ఓటర్లు కూడా ఆ రంగంలోనే ఎక్కువగా ఉన్నారు. మరోవైపుమహిళలు, మహిళా సంఘాలు ఎన్నికల్లో తీవ్ర మైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ రెండు వాగ్దానాలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కావాల్సిన మెజార్టీని తెచ్చిపెట్టి, అధికారంలోకి వస్తామని ఆశించిన వైఎస్సార్సీపీని చావుదెబ్బ తీశాయి. మరోవైపు బీజేపీ తనకున్న బలాన్ని అంచనా వేయలేక టీడీపీతో పొత్తు పెట్టుకోవడం పట్ల ఒకింత పునరాలోచన చేసింది. ఒంటరిగా పోటీచేసినా తమకు మరిన్ని సీట్లు వస్తాయనే ఆలోచనకు వెళ్లింది. మొత్తం మీద విభిన్న కసరత్తులు, అంచనాలు, వ్యూహ ప్రతివ్యూహాల మధ్య 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ లో మొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**300 హామీలతో ముందుకు**

తెలుగుదేశం పార్టీ 2014 ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చే క్రమంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఎన్నికల ముందు అడిగినా, అడక్కపోయినా హామీల వర్షం గుప్పించిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల లిస్టును తగ్గించుకునే ప్రయత్నం చేశారు. ప్రధానమైన హామీలను సైతం నెరవేర్చటంలో ఘోరంగా విఫలమయ్యారు. తాను అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన తీసుకెళ్తానని, ఐదు సంతకాలతో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేసిన చంద్రబాబు ఆ దిశగా కృషి చేయలేదు. మొదటి నుంచి చంద్రబాబు చేస్తున్న వాగ్దానాల పట్ల అనుమానాలున్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకున్నారు. 2014 జూన్ 8వ తేదీన నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు రుణమాఫీ, బెల్టుషాపుల రద్దు, రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్, ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచటం, పెన్షన్ పరిమితిని పెంచటం వంటి ఫైళ్లపై చేసిన సంతకాలు ఏ మేరకు అమలయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు సంతకాలు పెట్టిన ఫైళ్లకే దిక్కులేకుండా పోయింది. అమరావతి రాజధాని పేరిట సింగపూర్, జపాన్ దేశాల సొగసులను ఆంధ్రప్రదేశ్‌లో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులు, దళితుల దగ్గర ఉన్న కొద్దిపాటి భూములను లాక్కుంటున్నారు. రాజధాని నిర్మాణం, ఎయిర్ పోర్టులు, నౌకాశ్రయాల నిర్మాణాల పేరిట లక్షలాది ఎకరాల భూముల్ని సమీకరించేందుకు సమాయత్తమవుతున్నారు. ఎన్నికల ముందు ప్రజల గురించి, ప్రజా సంక్షేమం గురించి, రాష్ట్రాభివృద్ధి గురించి ఎన్నో కబుర్లు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మరుక్షణమే తనదైన శైలిలో ఏకపక్షంగా, ప్రజా వ్యతిరేకంగా పరిపాలన చేయటానికి పూనుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టో కాని, ఇచ్చిన హామీలు కాని ఆయనకు గుర్తులేకుండాపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల భూమిని సేకరించి, ల్యాండ్ బ్యాంకును ఏర్పాటుచేసి సుస్థిర పాలన అందిస్తాననే ఆయన ప్రగల్భాలను ప్రజలు నమ్మేస్థితిలో

లేరు. 16 నెలల తెలుగుదేశం ప్రభుత్వ పాలనతో ప్రజలు విసుగుచెందుతున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. వ్యవసాయం లేకుండా రైతులు రోడ్డున పడ్డాల్సిన పరిస్థితులేర్పడుతున్నాయి. ఇసుక మాఫియా పూర్తిస్థాయిలో పడగ విప్పి, ప్రభుత్వాన్నే శాసించేస్థాయికి వెళ్లింది. దీన్ని అరికట్టే విషయంలో చంద్రబాబునాయుడు అడుగు ముందుకేయలేని నిస్సహాయస్థితిలో పడిపోయారు. రాజధాని నిర్మాణానికి రాష్ట్రంలో ఉన్న ప్రతివ్యక్తి ఒక ఇటుకైనా ఇవ్వండి. ఇటుక విలువ చేసే నగదునైనా ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, అందరూ అర్థంచేసుకొని త్యాగం చేయాలని ప్రకటించారు. కానీ కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా దొడ్డిదారిన కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నారు. విదేశీ పర్యటనల పేరుతో సీఎంతో సహా మంత్రులు, అధికారులు దేశ విదేశాల్లో విహరిస్తున్నారు. డ్వాక్రా రుణమాఫీకి, భూ సేకరణకు డబ్బుల్లేవంటున్న చంద్రబాబు, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహకాల పేరిట ఏకంగా రూ. 2,500 కోట్లు విడుదల చేయటంలో అంతర్యమేమిటో చెప్పాలి. పోలవరం ప్రాజెక్టు కట్టాలని విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1700 కోట్లకుపైగా ఖర్చుపెట్టి పట్టిసీమ లిఫ్ట్ కడతానని, రాయలసీమకు నీళ్లందిస్తామని పేర్కొంటున్నది. ప్రజలకు పనికొచ్చే పోలవరం ప్రాజెక్టును పక్కనపెట్టి, తెలుగుదేశం పార్టీకి పనికొచ్చే పట్టిసీమ ఎత్తిపోతలను చేపట్టడంలో రాజకీయ ప్రయోజనమే తప్ప ప్రజా ప్రయోజనం ఏ మాత్రంలేదు. రాజధానికి కావాల్సిన భవనాలన్నింటి నిర్మాణం చేపట్టాలని విభజన చట్టంలో కేంద్రం పేర్కొంటే, హడావుడిగా ల్యాండ్ పూలింగ్ పేరిట సింగపూర్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములను కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం పూనుకోవటం ఏమాత్రం ప్రజాహితం కాదు.

**" దేశంలోనే అత్యధికంగా 90 శాతం వ్యవసాయ దారులు అప్పుల పాలైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో స్పష్టమైంది. 98,555 కోట్ల రుణ బకాయి ఉంటే, కేవలం 7 వేల కోట్ల బకాయిలను మాత్రమే మాఫీ చేసి రైతుల రుణాలన్నీ మాఫీ చేసినట్లుగా నమ్మబలకటం చంద్రబాబుకే సాధ్యమైంది. "**



రుణాల రద్దుకోసం ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

వ్యవసాయ రుణాలన్నింటినీ పూర్తిగా మాఫీ చేస్తానని, రైతులెవరూ రుణాలను కట్టొద్దని వస్తున్నా మీ కోసం యాత్రంలో చంద్రబాబు నాయుడు రైతులకు పిలుపునిచ్చారు. ఈ మాటలను నమ్మి రైతులు రుణాలను కట్టడం నిలిపివేశారు. అప్పటికి రాష్ట్రంలో 87 వేల కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు ఉన్నాయి. తర్వాత అవి రూ. 97 వేల కోట్లకు పెరిగాయి. అయితే, ఈ రుణాలన్నింటినీ మాఫీ చేసినట్లుగానే ప్రభుత్వం మాట్లాడటం విచిత్రం. ఎన్నికల ముందు దాదాపు 300 వాగ్దానాలు చేసి, ఐదు వాగ్దానాలపై సంతకాలు చేసి, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ప్రజలకు ఎండమావులను చూపించే పనిలోనే ఉన్నారు. ఇచ్చిన వాగ్దానాల అమలు గురించి ఆలోచించటం లేదు. చంద్రబాబు నాయుడు విజన్ 2050కి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాబోయే మూడున్నరేళ్లలో పరిస్థితులు ఎంతగా తారుమారవుతాయో అంచనా వేసుకోలేకపోవటం ఆయనకు విజన్ లేదనటానికి నిదర్శనం.

## రైతు రుణమాఫీ నామమాత్రం

ఆంధ్రప్రదేశ్ పూర్తిస్థాయిలో వ్యవసాయ అధారితమైనవి. ఇప్పటికీ 80 శాతం ప్రజలు వ్యవసాయ, దాని అనుబంధ రంగాలపైనే జీవిస్తున్నారు. ఎలాంటి కార్యక్రమం చేపట్టాలన్నా, ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా ఈ రంగంలోని ప్రజానీకమే కీలకం. దీన్ని గతంలో చంద్రబాబునాయుడు గమనించక, నేలవిడిచి సాము చేసి ఐటీ రంగాన్ని పట్టుకుని ఊరేగారు. ఫలితంగానే రైతులు దశాబ్ద కాలంపాటు ఆయన అధికారానికి దూరంగా ఉండేలా చేశారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని, రైతుల్ని దూరం చేసుకుంటే తన మనుగడ సాగదని గుర్తెరిగిన చంద్రబాబు, గడిచిన ఎన్నికల్లో రైతు బాటపట్టారు. రైతు రుణమాఫీ పల్లవి ఆలపించారు. 2014 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాల్లో వ్యవసాయ రుణాల బకాయిలు 87,612 కోట్లు ఉన్నాయి. ఇది నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేనాటికి ఉన్న వ్యవసాయ రుణాల బకాయిలు. 2014 సెప్టెంబర్ 30 నాటికి ఈ బకాయిల సంఖ్య 98,555 కోట్లకు పెరిగాయి. ఆరునెలల్లోనే రైతులను దాదాపు రూ. 11 వేల కోట్ల మేర రుణగ్రస్తులను చేసినట్లైంది. దేశంలోనే అత్యధికంగా 90 శాతం వ్యవసాయదారులు అప్పుల పాలైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో స్పష్టమైంది.. 98,555 కోట్ల రుణ బకాయి ఉంటే, కేవలం 7 వేల కోట్ల బకాయిలను మాత్రమే మాఫీ చేసి రైతుల రుణాలన్నీ మాఫీ చేసినట్లుగా నమ్మబలకటం చంద్రబాబుకే సాధ్యమైంది. రుణమాఫీ వల్ల లాభంకంటే తీవ్రంగా నష్టపోయిన రైతులు ఎక్కువమంది ఉన్నారు. పాత రుణాలు మాఫీగాక, కొత్త రుణాలు పొందే మార్గంలేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. చంద్రబాబునాయుడు రుణామాఫీ ఎరవల్ల బ్యాంకులు కూడా రైతుల్ని నమ్మే పరిస్థితుల్లేకుండాపోయాయి. కొత్త రుణాలు ఇవ్వకుండా అనేక విధాలుగా రైతుల్ని అవస్థల

**"డ్వాక్రా రుణాల బకాయిలు రూ.14,204 కోట్లున్నాయి. ఈ మొత్తాన్ని పూర్తిగా మాఫీ చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. వీటిని మాఫీ చేయటానికి ప్రమాణ స్వీకారం రోజున సంతకం చేశానని కూడా ప్రకటించుకున్నారు. కానీ అమలు కాలేదు. పైగా అసలు, వడ్డీ కలిపి రూ.14,898 కోట్లకు ఈ బకాయిలు చేరాయి."**

పాల్జేస్తున్నాయి. గడిచిన పదేళ్లుగా బ్యాంకుల నుంచి రైతులు పొందుతున్న రుణాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. ప్రతి ఏటా బ్యాంకులు లక్ష్యం కంటే 110 నుంచి 130 శాతం వరకు అదనంగా రైతులకి వ్యవసాయ రుణాలను ఇచ్చేవి. కానీ ఇప్పుడు 70 శాతం కూడా రుణాలివ్వటం సాధ్యంకాని పరిస్థితి ఎదురైంది. దీనికి ఎవరు బాధ్యత వహించాలి? సావధానంగా, సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించి ఉంటే బ్యాంకులు రైతులను పిలిచి మరీ రుణాలిచ్చేవి. పంటలు వచ్చిన వెంటనే రుణాలను తీర్చుకునే బాధ్యత రైతులమీద ఉండేది. నామమాత్రపు వడ్డీతో రైతులు బయటపడేవారు. కానీ, వ్యవసాయాన్ని, రైతుల్ని రుణమాఫీ పేరుతో రాజకీయ ఊబిలోకి లాగి చంద్రబాబునాయుడు రైతుకు మంచికంటే చెడే ఎక్కువగా చేసినట్లైంది. రుణాల్లేక, బయట అప్పులు పుట్టక, వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఇది రాష్ట్రశ్రేయస్సుకు ఏ మాత్రం మంచిదికాదు.

బంగారంపై ఉన్న రుణాలన్నింటినీ కూడా మాఫీచేస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయంపై ఏ మాత్రం మాట్లాడటంలేదు. బంగారంపై రుణాలు పొందిన రైతులు చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తారని ఎదురుచూస్తుంటే, బ్యాంకుల నుంచి వేలం నోటీసులు రైతుల ఇంటికొస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించట్లేదు.

### డ్వాక్రా రుణమాఫీ ఎక్కడ?

ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా ఉన్న మహిళలను ఆకట్టుకోకుండా ఏ పార్టీ గెలవలేదు. మహిళా ఓటర్లు ఆయా పార్టీల గెలుపోటములను తీవ్రంగా ప్రభావితం చేస్తారు. దీన్ని గమనించిన చంద్రబాబునాయుడు మహిళా ఓటు బ్యాంకును తనవైపు తిప్పుకోవటానికి డ్వాక్రా రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేస్తానని ఎన్నికల ముందు ప్రకటన చేశాడు. డ్వాక్రా రుణాల బకాయిలు రూ.14,204 కోట్లున్నాయి. ఈ మొత్తాన్ని పూర్తిగా మాఫీ చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. వీటిని మాఫీ చేయటానికి ప్రమాణ స్వీకారం రోజున సంతకం చేశానని కూడా ప్రకటించుకున్నారు. కానీ అమలు కాలేదు. పైగా అసలు, వడ్డీ కలిపి రూ.14,898 కోట్లకు ఈ బకాయిలు చేరాయి. డ్వాక్రా రుణమాఫీ గురించి కాని, మహిళా సాధికారత గురించి గాని మాట్లాడటానికి తెలుగుదేశం సాహసించలేకపోతోంది.

బెల్టు షాపులను రద్దు చేయటం తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధానమైన వాగ్దానాల్లో ( ఒకటి. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయంలో ఎక్సైజ్ ఆదాయమే ముఖ్యమైన వనరుగా ఉన్నది. ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నది. దీనికి నిబంధనలు, విధివిధానాలు లేకుండా పోయాయి. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతున్నా, విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తున్నా వాటిని నిరోధించకపోగా, ప్రోత్సహించే దిశగానే ప్రభుత్వ వ్యవహారశైలి ఉంది. ఏపీలో మద్యం ఉత్పత్తిని పెంచుతూ 4 డిస్టరీలకు ముఖ్యమంత్రి అనుమతి ఇవ్వడమే మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తుందనటానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. వీటితోపాటు ప్రతి ఇంటికి 20 లీటర్ల మినరల్ వాటర్‌ను లీటర్ రెండు రూపాయల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. దానికి ఎన్టీఆర్ పేరు పెట్టారు. కానీ, ఈ పథకం ఎక్కడ అమలవుతుందో తెలియని పరిస్థితి. ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచుతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆంక్షలు విధించి, కొన్ని శాఖలకు మాత్రమే ఈ హామీని అమలు చేశారు. నేరుగా ప్రభుత్వోద్యోగులుగా ఉన్నవారికి మాత్రమే ఈ ఉత్తర్వులను అమలు చేశారు. కార్పొరేషన్ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు వర్తింపచేయలేదు. పింఛన్ల విధానంలో మార్పులు చేస్తున్నట్లు, పరిధి పెంచుతున్నట్లు ఇచ్చిన హామీ కూడా అంతంత మాత్రంగానే అమలవుతోంది. రూ.200 నుంచి రూ.1000 వరకు పింఛన్ పెంచుతున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అనర్హత పేరుతో 10 లక్షలమంది వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లపై వేటు వేయటం బాధాకరం. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన వంటివి కూడా అమలుకు నోచుకోలేదు. అన్న క్యాంటీన్లు ఆరంభమే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసినట్లుగానే భావించాల్సి వస్తోంది.

ప్రజలను నిత్యం కొత్తదనంలో ముంచటం, దూరపు కొండలను చూపించటం, వాస్తవాల నుంచి వారిని సుదూర తీరాలకు తీసుకెళ్లటం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య. ప్రస్తుతం రాష్ట్రంలో ఇదే జరుగుతోంది. ప్రజా సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. కొత్త సమస్యలు ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. రాజధాని నిర్మాణం పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూ దందా అంతా ఇంతా కాదు. అనేక సమస్యలతో రైతులు, రైతు కూలీలు సతమతమవుతున్నారు. బందరు పోర్టు, భోగాపురం విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. అయినప్పటికీ, ముఖ్యమంత్రిలో ఏ మాత్రం చలనం లేదు. సావధానంగా స్పందించే పరిస్థితులు కనిపించడంలేదు.

సింగపూర్, జపాన్ కంపెనీలను ఆహ్వానించటం, వారికి వేలాది ఎకరాల భూములను కట్టబెట్టడం ఏకైక ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం పక్కకుపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలు బలపడుతున్నాయి. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఇంత పెద్దఎత్తున ప్రజా వ్యతిరేకతను సొంతం చేసుకున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రజా పోరాటాలను పోలీసు లాఠీలతో అణచివేయాలనే సంకల్పంతో చంద్రబాబు ఉన్నాడు. ఇటువంటిస్థితిలో వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు అన్నీ ఏకమవుతున్నాయి. ప్రభుత్వం సాగించే ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం సాగించటానికి కార్యాచరణను రూపొందిస్తున్నాయి. అందరూ ఐక్యంగా ఈ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడతారు. ప్రజలదే అంతిమ విజయం అవుతుంది. ❋

# విదేశీమారక నిల్వలతో చైనా వ్యూహం

సి.పి. చంద్రశేఖర్



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త

తనకున్న విదేశీ మారకద్రవ్యపు మిగులును, దాని ద్వారా అందే ప్రయోజనాలను తన ఆధీనంలో ఉంచుకున్న చైనా ఆ నిధులను ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో పెట్టుబడులుగా పెడుతున్నది. ఎంతో కాలంగా ఈ అంశాన్ని విస్మరించిన ప్రభుత్వాలను, బ్యాంకులను పక్కన పెట్టడమేకాక, ప్రపంచ ఆర్థిక నిర్మాణంలో ప్రధాన శక్తులుగా ఉన్న బ్రిటన్‌వుడ్ సంస్థల చరిత్రను తిరగరాసే క్రమాన్ని ఆరంభించింది.

మౌలిక సదుపాయాల నిర్మాణానికి రుణం అందించడం అనేది సాధారణ పరిస్థితులలో రాజకీయ పండితులకు, రాజకీయాలకు అసలు అవసరం లేనటువంటిది. అది కేవలం ఆర్థిక సంస్థలు, పెట్టుబడిదారులకు మాత్రమే సంబంధించిన అంశంగా ఉండేది. కాని ఆసియా మౌలిక వనరుల పెట్టుబడి బ్యాంక్ ఏర్పాటు ప్రతిపాదన మాత్రం, ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యులైన చైనా, అమెరికా మధ్య రాజకీయ యుద్ధానికి వేదికయింది. ప్రస్తుతం వివిధ అంశాలలో జరుగుతున్న విధంగానే ఈ యుద్ధంలో పాల్గొన్నందుకు కూడా త్వరలోనే అమెరికా విచారించాల్సివస్తుంది.

**చైనా ప్రతిపాదించిన (ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఏఐఐబి)**

ఆసియా ప్రాథమిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు వ్యవస్థాపక సభ్యుల హోదా కోసం దరఖాస్తు చేసుకోవటానికి ఆఖరి గడువు ముగిసిన ఏప్రిల్ ఒకటవ తేదీనాటికి మొత్తం 47 దేశాలు తమ అంగీకారాన్ని తెలియబరిచాయి. అందులో 30 దేశాల సభ్యత్వాన్ని ఇప్పటికే ఆమోదించారు. బహుముఖ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందించే ఈ ఏఐఐబి కేంద్రకార్యాలయాన్ని బీజింగ్‌లో ఏర్పాటు చేశారు. ఈ బ్యాంక్‌కు వంద బిలియన్ డాలర్లు మూలనిధిగా ఉంటాయి. ఈ నిధి ఆసియాలో ఎంతో అవసరంగా ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు అందించటం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. చైనా ఈ బ్యాంకుకు 50 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా (మూలనిధిగా) అందచేసింది. ఈ మూల నిధికి ఇతర దేశాలు కూడా నిధులు అందచేస్తాయి. అవసరమయితే వంద బిలియన్ డాలర్ల వరకు తనవంతు పెట్టుబడిగా అందచేస్తానని చైనా వాగ్దానం చేసింది.

ఈ బ్యాంక్‌లో ఓటింగ్ అధికారం ఒక సభ్యదేశపు స్థూల జాతీయ ఉత్పత్తికి (జి.డి.పి) అనుగుణంగా ఉంటుందని నిబంధనలలో పొందుపర్చారు. కాని చైనా ఏ విధంగా చక్రం తిప్పుతుందో చెప్పడంలో సందేహించాల్సిన అవసరం లేదు.

ఏఐఐబి ప్రపంచంలో బహుముఖ కార్యకలాపాలు నిర్వహించే మరో బ్యాంక్‌గా మారుతుందని భావించటంతో తొలుత ఈ ప్రతిపాదన విఫలమవుతుందని అందరూ భావించారు. 2014 అక్టోబరు 24న ఏఐఐబిని లాంఛనంగా ఆరంభించినప్పుడు, దీనిలో వ్యవస్థాపక సభ్యులుగా చేరటం కోసం సంతకాలు పెట్టడానికి కేవలం 20 దేశాలే తమ ఆమోదాన్ని తెలియచేశాయి. అమెరికా, బ్రిటన్, ఐరోపా దేశాలు, ఆసియాలోని జపాన్, దక్షిణకొరియా, ఇండొనేషియా తదితరదేశాలు ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలుపలేదు. మధ్య ఆసియాలోని కొన్ని దేశాలు, ఆగ్నేయ ఆసియా దేశాల సమాఖ్య (ఏషియన్) సభ్య దేశాలు ఇందులో భాగంగా ఉన్నాయి. భారతదేశం చైనాయేతర వ్యవస్థాపక సభ్యులలో అతిపెద్దది. చైనా ఈ వ్యవస్థాపక సభ్యుల బోర్డ్‌లో, సభ్యులుగా చేరమని అన్ని దేశాలకు బహిరంగ ఆహ్వానం పలికిన సంగతి వాస్తవమైనా ఆస్ట్రేలియా, ఇండోనేషియా వంటి దేశాలు తొలుత తమ ఆసక్తిని తెలియపర్చినప్పటికీ, పైన పేర్కొన్న పరిమిత దేశాలే సభ్యులుగా చేరాయి. ఈ దేశాలు చూపిన ఆసక్తిపైన ఏదో ఒక శక్తి నీళ్ళు చల్లింది. దీనిమూలంగా అక్టోబరులో ఏ పురోగతి లేదు. దాని తదనంతరం నిర్లిప్తత కనిపించింది.

అక్టోబరు- ఏప్రిల్ నెలల మధ్య కాలంలో పెను మార్పులు సంభవించాయి. తొలుత దీనిపట్ల పెదవి విరిచిన లేదా "వేచిచూద్దాం" అనే వైఖరిని అవలంబించిన పలు దేశాలు తమ మనసులు మార్చుకుని, ఏఐఐబిలో సభ్యులుగా చేరటానికి తుదిగడువు సమీపించేనాటికి అప్లికేషన్లు పెట్టటం కోసం వెంపర్లాట ప్రారంభమైది. 47దేశాలనుండి సభ్యత్వం కోసం అభ్యర్థనలు వచ్చాయి. అమెరికా పనిగట్టుకుని నడిపిన వ్యతిరేక ప్రచారాన్ని దృష్టిలో ఉంచు కుంటే ఇది గణనీయమైన సంఖ్యే. ప్రపంచ బ్యాంక్‌లో 188 దేశాలు, ఆసియా అభివృద్ధి బ్యాంక్‌లో 67 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ బ్యాంక్ పరిపాలనా నిర్వహణ ''అవసరమయిన'' ప్రమాణాలకు సరితూగదని, నిర్ణయాలను వీటో చేసే అధికారం చైనాకు ఉండటం, ఈ బ్యాంక్ అందించే ప్రాజెక్ట్‌లకు సంబంధించి పర్యావరణ, శ్రామికుల, మానవహక్కుల ప్రభావంపై అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రక్షణలు పాటించడం లేదనే పేరుతో అమెరికా ఇందులో చేరటానికి తిరస్కరించింది. అంతటితో సరిపుచ్చుకోలేదు. తన మిత్రదేశాలైన యూరప్‌లోని జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ మరీ ముఖ్యంగా బ్రిటన్ అలాగే, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తన భాగస్వాములైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా వంటి దేశాలను కూడా ఈ బ్యాంక్‌లో చేరకుండా అడ్డుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచేసింది.

> **❝ అయితే ఈసారి మాత్రం అమెరికా ఏకాకియై, ఘోర వైఫల్యాన్ని ఎదుర్కొంది. బ్రిటన్ గతం నుండి అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా మద్దతునిస్తూ వచ్చింది. ఈసారి అమెరికా చివాట్లు పెట్టినా ధిక్కరించాలని, ఎఐఐబి వ్యవస్థాపక సభ్యురాలిగా చేరాలని బ్రిటన్ నిశ్చయించుకున్నది. ❞**

1997 తీవ్ర ఆర్థిక సంక్షోభం పిదప, విదేశీ వాణిజ్యలోటు ఎదుర్కొంటున్న సమయంలో ఆసియా ప్రాంతంలోని దేశాలకు విదేశీ మారక నిధులు అందించటానికి గాను, ఆసియా మానిటరీ ఫండ్‌లాంటి సంస్థను ఏర్పాటు చేయాలని జపాన్ ప్రతిపాదించినప్పుడు, అమెరికా వ్యతిరేకత కారణంగా ఆ ప్రతిపాదన పురిటిలోనే అస్తమించింది.

అయితే ఈసారి మాత్రం అమెరికా ఏకాకియై, ఘోర వైఫల్యాన్ని ఎదుర్కొంది. బ్రిటన్ గతం నుండి అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా మద్దతునిస్తూ వచ్చింది. ఈసారి అమెరికా చివాట్లు పెట్టినా ధిక్కరించాలని, ఎఐఐబి వ్యవస్థాపక సభ్యురాలిగా చేరాలని బ్రిటన్ నిశ్చయించు కున్నది. అమెరికా మిత్ర దేశాలైన జర్మనీ, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, వంటి పలు ఇతర దేశాలు కూడా సభ్యులుగా తమ పేరు నమోదు చేయించు కున్నాయి. చివరికి వ్యవస్థాపక సభ్యుల పట్టికలో ఆసియాలో (జపాన్ మినహా) అన్ని ప్రముఖ దేశాలు, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, ఆస్ట్రేలియాలు ఉన్నాయి.

**అమెరికా భయంవెనుక :**

నిరంతరం చైనాతో అంటకాగుతూ వ్యవస్థాపక సభ్యదేశంగా చేరిన బ్రిటన్‌ను అమెరిగా తీవ్రంగా విమర్శించింది. చైనా ఏఐఐబి ఏర్పాటు ప్రతిపాదన అమెరికాకు భయాన్ని కలిగించింది. ఎందుకంటే, బ్రెటన్‌వుడ్ సంస్థలను ఏర్పాటు చేసిన తర్వాత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం, ఆ తర్వాతి పరిణామాలలో కూడా అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో, దేశాల యొక్క అభివృద్ధిలో పెనుమార్పులు సంభవించినప్పటికీ, ఇప్పటికీ ప్రపంచబ్యాంక్‌లో అమెరికా, జపాన్‌ల ఓటింగ్ హక్కు 24.9 శాతంగా ఉంది. అలాగే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో 24.3 శాతంగా ఉంది. ఐఎమ్ఎఫ్‌లో కొద్దిశాతం ఓటింగ్ హక్కులు, కోటాలు మార్చాలనే ప్రతిపాదనలను కార్యనిర్వాహక కమిటి అంగీకరించినప్పటికీ, అవి నేటికీ అమెరికా కాంగ్రెస్ అమోదం పొందలేదు. ప్రపంచ బ్యాంక్‌కు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు ఛైర్మన్‌ని నామినేట్ చేసే హక్కు ఇప్పటికీ అమెరికా చేతుల్లోనే ఉంది. అది ఎప్పుడూ యూరప్ వారినే వరిస్తుంది. ఆసియాలో అమెరికాకు సంపూర్ణ మిత్ర దేశమయిన జపాన్‌కు ఎల్లప్పుడూ ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ పగ్గాలు అప్పచెప్పబడుతూనే ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, అమెరికా, దాని మిత్ర దేశాలు వారికి అనుకూలంగా ఈసంస్థలన్నిటినీ వినియోగించుకుంటున్నాయి.

ఒక రకంగా చూస్తే, ఈ మొత్తంకాలంలో పాక్షికంగానైనా జి-7 దేశాలు వాటి ఆర్థిక వనరులు, మిగులును వినియోగించి, ప్రపంచంలోని అన్ని ఇతర దేశాల ఆర్థికలోటును పూడ్చుడానికి ప్రయత్నం చేశాయి. కాని అదే సందర్భంలో తాము అందించే సహాయం ద్వైపాక్షిక లేదా బహుళపక్ష ఒప్పందాలు, సహాయం తదితర పేర్లతో అందచేస్తూ, ఆయా దేశాల పరిపాలనా విధానాలను ప్రభావితం చేసి, అంతిమంగా తమకు పనికి వచ్చే విధంగా వారిని మార్చుకొనేలా తయారు చేశారు. కాని నేడు పరిస్థితి మారింది. ఈ దేశాలేవి ఇప్పుడు అదనపు ఆదాయం కాని, విదేశీ మారక నిల్వలను కాని కలిగి ఉన్న పరిస్థితిలో లేవు. ఇప్పుడు ప్రపంచంలో కెల్లా అతిపెద్ద మొత్తంలో అప్పుల్లో ఉన్నదేశం అమెరికా. మొత్తం పెట్టుబడుల ప్రవాహంలో ప్రయివేటు పెట్టుబడులే అత్యధికంగా ఉన్నాయి. ప్రభుత్వ పెట్టుబడులు చాలా నామమాత్రంగా మిగిలిపోయాయి. ఈ నూతన ఆర్థిక పరిణామాలలో, జి-7 దేశాలు తమ పట్టును కొనసాగించాలంటే, ఫలితాలను రాబట్టుకోవాలంటే, అంతర్జాతీయంగా ద్రవ్య పెట్టుబడుల ప్రవాహంపై పట్టు సాధించాలి. అందుకు నిధులను సమీకరించి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందజేస్తున్న అంతర్జాతీయ సంస్థలను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలి.

కానీ ఈ విధంగా వచ్చే ప్రవాహంలో ఎక్కువభాగం అదనపు సంపదను పోగుచేసి, నిల్వచేసుకునే చైనా వంటి దేశాలలోకి ప్రవహిస్తోంది. వారు వీటిని తిరిగి డాలర్ ఆధిపత్యం ఉన్న అమెరికాలో పెట్టుబడులుగా పెట్టడంకాని, ఆస్తుల కొనుగోలులో, లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు అందించే ఆర్థిక సంస్థలలో కాని పెట్టుబడులుగా పెడతారు. అంతర్జాతీయ ద్రవ్య ప్రవాహంలో, ఆర్థిక బలబలాలలో మార్పులు వచ్చినా, గత చరిత్ర ద్వారా, తన మిలటరీ ఆధిపత్యం వలన, ప్రపంచ ఆర్థికవ్యవస్థ రూపురేఖలను తీర్చిదిద్దటంలో ఇప్పటికీ అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. డాలర్ ఆధిక్యతను రక్షించుకొంటున్నది.

చైనా తలపెట్టిన ఏఐఐబి ఒక విధంగా దీనికి సవాలుగా నిలిచింది. భిన్నమైన ఓటింగ్ హక్కులతో ఇది స్పష్టంగా ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు ప్రత్యామ్నాయంగా ఉంది. ఓటింగ్ హక్కులు కూడా చైనాకి అనుకూలంగా ఉన్నాయి. ప్రారంభ పెట్టుబడిగా 50 బిలియన్ డాలర్లు పెట్టి, మరల ఇంకొక 50 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడతానని హామీ ఇచ్చిన చైనా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ పెట్టుబడి అయిన 165 బిలియన్ డాలర్ల దగ్గరికి తీసుకెళ్ళే ప్రయత్నంలో ప్రస్తుతం ఉంది. అంతేకాదు, అంతర్జాతీయంగా చైనా భాగస్వామ్యంతో నడిచే అనేక సంస్థలలో ఏఐఐబి కేవలం ఒక అదనపు సాధనం అవుతుంది. ఇప్పటికే చైనా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు ప్రధాన పెట్టుబడిదారునిగా ఉంది. ప్రధాన కార్యాలయం షాంగైలో ఉన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా) బ్యాంక్‌లోనూ ప్రధాన పాత్ర పోషిస్తోంది. 2014లో బ్రెజిల్‌లోని ఫోర్టలేజాలో చేసిన ప్రకటనలో అత్యవసర సహాయక మూల నిధులను అదజేయటంలోనూ ప్రధాన పాత్ర పోషిస్తానని చెప్పింది.

ఏఐఐబి ప్రారంభోత్సవ ప్రకటన వెలువడగానే చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఒక ప్రకటనలో "సిల్క్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్" అనే సంస్థని ఏర్పాటు చేస్తున్నామని, అందులో చైనా తన వాటాగా 40 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతుందని తెలిపారు. దానిలోకి అందరిని ఆహ్వానిస్తున్నామని, ఆసియా దేశాలేకాక, వేరెవరైనా కూడా పెట్టుబడులు పెట్టవచ్చని తెలిపారు.

❝ఇదంతా చూస్తుంటే మనకి చాలా స్పష్టంగా కనిపిస్తోంది ఏమిటంటే, చైనా తన విదేశీ మారకపు అదనపు నిల్వలను తద్వారా వచ్చే ప్రయోజనాలను ఉపయోగించుకుని, ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ఆర్థిక అవసరాలకి తగ్గట్టుగా ప్రణాళికలు రచిస్తోంది. మిగులును ఉపయోగించుకుని అభివృద్ధికి బాటలు వేసే విధానాన్ని చేపట్టింది.❞

ఈ సంస్థ యొక్క ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ జిన్‌క్యూ మాట్లాడుతూ, ఇది దాదాపు ఒక ప్రయివేటు బ్యాంక్‌లాగా పని చేస్తుందని, స్వల్పకాలిక, దీర్ఘకాలిక పెట్టుబడులను ఆహ్వానిస్తుందని, లాభాలను కూడా ఆర్జిస్తూ వాటాదారుల హక్కులను, పెట్టుబడులను రక్షిస్తుందని తెలిపారు. అదే సమయంలో వివిధ దేశాలతో వాణిజ్య సంబంధాలకు ఉన్న ఆటంకాలను తొలగించే ప్రాజెక్టులలో, దానికనుగుణంగా సిల్క్‌రోడ్ ఆర్థిక మండలి అభివృద్ధికి, ఏమేమి అనుసంధానం చేయాలో ఆ ప్రాజెక్టులన్నింటికి పెట్టుబడులు పెడుతుందని, 21వ శతాబ్దపు సముద్రతీర సిల్క్‌రోడ్ ప్రాజెక్ట్‌కు పెట్టుబడులు అందజేస్తూ చైనా కలలను నిజం చేసే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అంతిమంగా షాంగై డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ పేరుతో చైనా ఇంకొక బ్యాంక్‌ను ఏర్పాటుచేసి, అందులో చైనా, ఖజకస్తాన్, కిర్గిజిస్తాన్, రష్యా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లను కలుపుకుని, మధ్య ఆసియాలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేయాలని ప్రయత్నం చేస్తోంది. భారత్ కూడా ఇందులో చేరే అవకాశం ఉంది.

ఇదంతా చూస్తుంటే మనకి చాలా స్పష్టంగా కనిపిస్తోంది ఏమిటంటే, చైనా తన విదేశీ మారకపు అదనపు నిల్వలను తద్వారా వచ్చే ప్రయోజనాలను ఉపయోగించుకుని, ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ఆర్థిక అవసరాలకి తగ్గట్టుగా ప్రణాళికలు రచిస్తోంది. మిగులును ఉపయోగించుకుని అభివృద్ధికి బాటలు వేసే విధానాన్ని చేపట్టింది. కాని కీలకమైనది, అద్భుతమైనది ఏమిటంటే, ఆ పెట్టుబడులన్నింటిని మౌలిక వసతుల కల్పనకి ఉపయోగించాలని నిర్ణయించటం. ఈ రంగానికి నిధులను సమకూర్చటంలో ప్రపంచమంతటిలోనూ, ఆసియాలోను తీవ్రమైన లోటు ఉంది.

2020 దాకా మౌలిక వసతుల మీద పెట్టబడుల అంచనా షుమారు 8 ట్రిలియన్ల్ డాలర్లుగా ఉంది. ఆసియాలోనే ప్రతి సంవత్సరం 800 బిలియన్ డాలర్ల చొప్పున పెట్టుబడులు పెడితేనే భవిష్యత్తులో అభివృద్ధి ఉంటుంది. ఆ పెట్టుబడులలో ముఖ్య భాగం అభివృద్ధికి కేటాయించినా, కొంతభాగం సామాజిక, నిరంతర అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అందుబాటులో ఉంటాయి.

దాదాపుగా ప్రపంచంలో అన్ని దేశాల ప్రభుత్వాలు, ద్రవ్యలోటుని భర్తీ చేసుకోవటం కోసం, ఆర్థిక సంక్షోభాల నేపధ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుదల, విదేశీ మారకపు ద్రవ్యపు లోటు భయం వలన, మౌలిక వసతులపై



చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్

పెట్టుబడులు పూర్తిగా ఆపివేశారు. ప్రయివేటు రంగం నేరుగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఆర్థిక సంస్థల మద్దత్తు లేకుండా, లేదా ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) లేకుండా వారేమీ చేయలేని పరిస్థితి ఉంది. కాని పిపిపిల ద్వారా ప్రయివేటు రంగానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి బాధ్యతను అప్పగించినా, అవి దారుణంగా విఫలమయ్యాయని అనుభవాలు చెబుతున్నాయి. బహుళజాతి బ్యాంకులు లేదా బహుళార్థ సాధక బ్యాంక్‌లు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టడం లేదు. ఉదాహరణకి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సంవత్సరానికి కేవలం 10 నుండి 13 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయిస్తోంది.

ఈ పరిస్థితులలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సిన మౌలిక వసతుల రంగం ఒక పెద్ద సవాలుగా ఉంది. మౌలిక వసతుల రంగాలలో పెట్టుబడులు కావాల్సిన దేశాలన్నీ ఈ పందెంలో పాల్గొనాల్సిందే. ఏ దేశాలైతే మౌలిక సదుపాయాల కల్పనకు కావాల్సిన పనిముట్లు, పరికరాలు, సహజ వనరులు, ముడి సరుకులు అందించగలవో వారంతా దీనికి వెలుపలఉండలేరు. అందువలనే అమెరికా ఎన్ని విధాలుగా ఆటంకాలు కలిగించాలని ప్రయత్నించినా, దానితో ఉంటే వచ్చే లాభంకన్నా, ఈ బ్యాంక్‌లో భాగస్వామైతే భవిష్యత్తు బావుంటుందని భావించి అందరూ అటువైపు చేరారు.

చైనాకు దీని వలన అనేక లాభాలు ఉన్నాయి. ఈ మౌలికరంగాల కల్పనకు కావాల్సిన సరుకులను, సేవలను తమ కంపెనీల ద్వారా అందించి అభివృద్ధికి తోడ్పడవచ్చు. అలాగే మౌలిక వసతుల కల్పన వలన చైనా అన్ని మార్కెట్‌లకు విస్తరించటానికి, విస్తారంగా ముడిసరుకులు పొందటానికి, కొత్త ప్రదేశాలకు అనుసంధానం కలగటం వలన తక్కువ ధరలకే వస్తువులు ఉత్పత్తి చేసి ప్రపంచ మార్కెట్‌లో పోటీపడటానికి ఉపయోగపడుతుంది. అంతిమంగా ఒక ప్రబలమైన శక్తిగా ఎదిగి, ఇతరులను ప్రభావితం చేయగల దేశంగా, అత్యధికంగా లాభాలను పొందుతూ ప్రపంచ అగ్రరాజ్యంగా పోటీపడగలిగే స్థాయికి ఎదుగుతుంది.

ఈ నిజాన్ని ఎదుర్కోలేక, పాలనా సంబంధ అంశాలు, ప్రపంచ ప్రమాణాలు అంటూ అమెరికా సన్నాయినొక్కులు నొక్కుతోంది. అందుకే దానిని ఎవరూ పట్టించుకోవటం లేదనేది వాస్తవం. అంతేకాదు, బ్రెటన్‌వుడ్ సంస్థలు ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి సంస్థలు పాలనాంశాలు, ప్రపంచ ప్రమాణాలు ఎలా పాటించాయో అందరికీ తెలిసిన సత్యమే. అలాగే ప్రపంచబ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు చేపట్టిన ప్రాజెక్టులు పర్యావరణం మీద, మానవహక్కుల మీద తీవ్రమైన దుష్ప్రభావాలు చూపాయని పౌరహక్కుల సంఘాలు, ప్రజాతంత్రవాదులు పోరాడుతూనే ఉన్నారు. ఏది ఏమయినా, ఈ పోరాటంలో చైనా ప్రారంభించిన ఏఐఐబిని ఆపటంలో అమెరికా ఘోరంగా విఫలమయింది. భవిష్యత్తులో చైనాను నిలువరించటానికి అమెరికా చేసే ప్రయత్నాలు ఏమేరకు సఫలం అవుతాయో వేచిచూడాల్సిందే.

**(అనువాదం : ఎల్.ఎస్.భారవి)**

# సరళీకరణ విధానాలు సంక్షోభాలు

ఎ. కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

ఈ సంవత్సరం భారత్ వృద్ధిరేటు అంచనాలు తగ్గిపోతున్న నేపథ్యంలో మరోదఫా సంస్కరణలు చేపట్టాలని అంతర్జాతీయ ద్రవ్య నిది సంస్థ భారత్‌కు ఆదేశాలు జారీ చేసింది. పెరూ రాజధాని లిమా నగరంలో జరి గిన అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డు సమావేశం భారతదేశానికి ఈ ఆదేశాలను జారీచేసింది. 2015వ సంవత్సరంలో భారత వృద్ధిరేటును ఇంతకు ముందే 7.5 శాతం నుండి 7.3 శాతానికి తగ్గించింది. సంస్కరణలను చేపట్టటం ద్వారా దేశంలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని పెంచాలని, సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పింది. 2016 వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండవచ్చునని, భారత్ పుంజుకుంటున్న ఆర్థికవ్యవస్థ అని చెప్పారు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థ పెరుగుదల తీరుతెన్నులు చూస్తే భారతదేశం, చైనాలు ఆర్థికాభివృద్ధిలో ఏడుశాతానికి పైగా అభివృద్ధిని సాధిస్తూ అగ్రస్థానంలో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఏవీకూడా ఏడుశాతం అభివృద్ధికి దరిదాపుల్లో లేవు. అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్ తదితర దేశాలు మూడు శాతానికి మించి అభివృద్ధిని సాధించటం లేదు. ఎవరైనా సలహాలివ్వాల్సివస్తే ఎవరికి సలహాలివ్వాలి? ఏడుశాతానికి పైగా వృద్ధిసాధిస్తున్న భారతదేశానికా? అభివృద్ధి సాధనలో వెనుకబడిన అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్, ఇతర దేశాలకు సలహాలివ్వాలా? ఎవరైనా వెనుకబడిన వాడికి ముందుకెలా వెళ్ళాలో సలహా ఇస్తే దానికి అర్థం ఉంటుంది. కాని ఆర్థికాభివృద్ధి సాధనలో అగ్రస్థానంలో ఉన్నారని చెబుతూనే, భారతదేశం మరిన్ని సంస్కరణలు అమలు జరపాలని సలహాలిస్తున్నారు. అమెరికా, అభివృద్ధి చెందిన ఇతర దేశాలకు ఎందుకు సలహాలివ్వరు? వారి సలహాలు వెనుకబడిన దేశాలకేగాని అభివృద్ధి చెందిన దేశాలకు పని చేయవా?

ఐయంయఫ్, ప్రపంచబ్యాంకులు అభివృద్ధి చెందిన దేశాలలోని ద్రవ్య పెట్టుబడులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ సంస్థలు రూపొందించిన అభివృద్ధి నమూనా వెనుకబడిన దేశాల ఆర్థికవ్యవస్థలను అభివృద్ధి చెందిన దేశాలు తమ గుప్పెట్లో పెట్టుకొని, తమ ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చుకొనేలా రూపొందించబడ్డాయి. ఈ సంస్థల నిబంధనలు అందుకోసమే రూపొందించబడ్డాయి. అభివృద్ధి చెందిన దేశాల ప్రయోజనాలు నెరవేర్చేలా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవ్యవస్థలలో మార్పులు తీసుకురావటం లక్ష్యంగా ఆదేశాలు జారీచేస్తుంటారు. అందులో భాగంగానే భారతదేశానికి సలహాలిస్తున్నారు. సంస్కరణలను ముందుకు తీసుకుపోవటమంటే భారతదేశంలో తీసుకోవాల్సిన చర్యలేమిటి? బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్కరణల అమలును వేగవంతం చేసింది. ప్రభుత్వరంగ సంస్థలలో వాటాల అమ్మకం, విదేశీ పెట్టుబడుల రాకను సరళీకరించటం, ప్రైవేటు బ్యాంకుల ఏర్పాటును సులభతరం చేయటం, సంక్షేమ పథకాల కుదింపు, రక్షణ రంగంలోకి విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతానికి పెంచటం, కార్మికచట్టాలలో మార్పులు చేయటం ద్వారా కార్మికుల హక్కులను హరించటం తదితర సంస్కరణలు అమలు చేస్తున్నారు. సంస్కరణలను ఇంకా వేగంగా అమలుచేస్తే ఫలితాలు ఎలా ఉంటాయి?

సామ్రాజ్యవాదుల అదుపులో పనిచేసే సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలను మరింతగా సంస్కరణలను అమలు చేయమని నిరంతరం ఒత్తిడి చేస్తుంటాయి. సంస్కరణల అమలు తీవ్రమయ్యేకొద్దీ సామ్రాజ్యవాదదేశాలు వెనుకబడిన దేశాల వనరులను, మార్కెట్లను చేజిక్కించుకొని, వారి ఆర్థికవ్యవస్థలపై పెత్తనం చేయటానికి పూనుకుంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై ద్రవ్య పెట్టుబడుల పెత్తనం ప్రారంభమైన తర్వాత, ప్రభుత్వాల ఖర్చులపై పరిమితులను విధించారు. ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ(యఫ్ఆర్‌బియం) చట్టాన్ని చేయించి, బడ్జెట్‌లోటు మూడు శాతానికి మించకూడదని ఆంక్షలు విధించారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో పరిశ్రమలను అభివృద్ధి చేయటం కోసం ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. మౌలిక పరిశ్రమలైన ఉక్కు, విద్యుత్, భారీ యంత్రాల తయారి, మందులు తదితర పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించారు. బ్రిటిష్ పాలనలో ప్రైవేటువారి చేతిలో ఉన్న బ్యాంకులు, బీమా, రైల్వే, తదితర రంగాలను స్వాతంత్ర్యానంతరం జాతీయం చేసి, ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకొచ్చారు. ద్రవ్యపెట్టుబడుల పెత్తనం,సంస్కరణల అమలుతో ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించటం ప్రారంభమై, ఒక్కోరంగంలోకి ప్రైవేటు, విదేశీ పెట్టుబడుల చొరబాటు ప్రారంభమైంది. పరిశ్రమలు,మందులు, గనులు, విద్యుత్, బీమారంగం, బ్యాంకులు, రైల్వేలు, రక్షణ, వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా తదితర రంగాలన్నింటిలోనూ విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచారు. కార్మికులు, ఉద్యోగులు జీవితకాలం కష్టపడి దాచుకున్న పియఫ్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టాలని నిర్ణయించారు. విదేశీ పెట్టుబడులు ఈ రంగాలన్నింటిలోకీ చొరబడి దేశసంపదను దోపిడీచేస్తూ, లాభాలనుతరలించుకెళుతున్నాయి. ఇపుడు సంస్కరణలను మరింత వేగంగా అమలు చేయాలని ఆదేశిస్తున్నారు. సంస్కరణలను వేగంగా అమలుచేస్తే దేశం మరింత త్వరగా అభివృద్ధి చెందుతుందని నమ్మబలుకుతున్నారు. సంస్కరణలను వేగంగా అమలుచేస్తే నిజంగానే త్వరితంగా అభివృద్ధి చెందటం జరిగితే ఆ సంస్కరణలను అమలు చేసి, అభివృద్ధి చెందిన దేశాలే మరింత వేగంగా

అభివృద్ధి చెందవచ్చుకదా! మనలాంటి దేశాలకు ఎందుకు ఆ సలహాలిస్తున్నారు? సంస్కరణలను వేగంగా అమలుచేస్తే త్వరితంగా అభివృద్ధి చెందటం జరగదు. స్టాక్‌మార్కెట్, రియల్ ఎస్టేట్ తదితర రంగాలలో తాత్కాలికంగా బుడగలు ఏర్పడి అభివృద్ధి జరుగుతున్నట్లు భ్రమలు కల్పిస్తాయి. అభివృద్ధి ముసుగులో అన్ని రంగాలపైనా ద్రవ్యపెట్టుబడుల పెత్తనం ఏర్పడుతుంది. సంస్కరణలను అమలు చేసిన ఇతర దేశాల అనుభవాలను చూస్తే సంస్కరణలు ఎక్కడికి దారితీస్తాయనేది మనకు స్పష్టం అవుతుంది.

**“థాయ్‌లాండ్ అనుభవాలను పరిశీలిస్తే సంస్కరణలను వేగంగా అమలుచేస్తూపోతే మనం ఎటువంటి స్థితిని ఎదుర్కొంటామో స్పష్టం అవుతున్నది. ఈ అంశాలలో మనదేశ పరిస్థితి భిన్నంగా ఉన్నదా? ఏ దేశ ఆర్థికవ్యవస్థ అయినా ఎగుమతులలో మిగులు సాధించి, విదేశీమారక ద్రవ్యనిల్వలను కలిగి ఉంటే ఆ దేశ ఆర్థికవ్యవస్థ సురక్షితంగా ఉంటుంది.”**

**ఆసియా టైగర్స్ అనుభవాలు: థాయ్‌లాండ్**

1990వ దశాబ్దంలో థాయ్‌లాండ్, ఇండోనేషియా, దక్షిణకొరియా, ఫిలిప్పీన్స్, మలేషియాలను ఆసియా టైగర్స్‌గా అభివర్ణించారు. ఈ దేశాలను ఇతర వెనుకబడిన దేశాలకు అభివృద్ధి నమూనాగా ఐయంయఫ్ అభివర్ణించింది. 1996లో అంక్టాడ్ కూడా ఆసియా దేశాలు అభివృద్ధి సాధించిన మార్గాన్ని ఇతర దేశాలు కూడా అనుసరించాలని చెప్పింది. 1997లో ఈ దేశాలలో సంక్షోభం ప్రారంభమైంది. ఒకదేశం తర్వాత మరొకదేశం సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. సంక్షోభానికి ఆదేశాల అంతర్గత కారణాలతో పాటు, బాహ్యకారణాలు కూడా తోడయ్యాయి.

ఆసియా టైగర్స్‌లో మొదటగా సంక్షోభాన్ని ఎదుర్కొన్న థాయ్‌లాండ్ అనుభవాలు చూస్తే ఆ దేశం ఏవిధంగా సంక్షోభంలో చిక్కుకుందో స్పష్టం అవుతుంది. థాయ్‌లాండ్ ఎగుమతి ఆధారిత ఆర్థికవ్యవస్థగా మార్పుచెందిన 1985-95 కాలంలో మౌలిక ఆర్థికాంశాలన్నీ బలంగానే ఉన్నాయి. వ్యవసాయరంగం, విదేశీ వాణిజ్యలోటు, కరెంట్ ఎకౌంటులోటు మాత్రమే ఆందోళనకరంగా ఉన్నాయి. విదేశాల నుండి వస్తున్న పెట్టుబడులను కరెంట్ ఎకౌంటులోటును పూడ్చుకోవటానికి, విదేశీ రుణాలను చెల్లించటానికి వినియోగించారు.

సంక్షోభంలో చిక్కుకున్న తర్వాత థాయ్‌లాండ్ ఎదుర్కొన్న సంక్షోభానికి, మౌలిక ఆర్థికాంశాలకు సంబంధం లేదనితేల్చారు. సంక్షోభాన్ని ఎదుర్కొనే సమయానికి థాయ్‌లాండ్ మౌలిక ఆర్థికాంశాలన్నీ బలంగానే ఉన్నాయి. 1985-95 మధ్య 9.8 శాతం అభివృద్ధితో థాయ్‌లాండ్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉంది. విదేశీ రుణాలు కూడా తగ్గాయి. 1985లో జిడిపిలో 31 శాతంగా ఉన్న విదేశీ రుణాలు 1995 నాటికి 11 శాతానికి తగ్గాయి. జిడిపి-రుణ నిష్పత్తి తగ్గింది. ఈ ప్రాంతంలో ద్రవ్య విధానాలను సక్రమంగా అమలు చేసిన దేశం థాయ్‌లాండ్ మాత్రమే. ద్రవ్యలోటును అధిగమించి, 1995 నాటికి 2.5 శాతం ద్రవ్యమిగులును సాధించింది. ఎగుమతి-జిడిపి నిష్పత్తి 1990లో 34.1శాతం ఉండగా, 1995 నాటికి 41.5 శాతానికి పెరిగింది. ఐదు నెలల దిగుమతుల బిల్లులను చెల్లించటానికి అవసరమైన విదేశీ మారకనిల్వలున్నాయి. ద్రవ్యోల్బణం ఐదుశాతానికి పరిమితమైంది. వడ్డీ చెల్లింపులు కూడా అతి తక్కువగా ఉన్నాయి. దరిద్రాన్ని, పిల్లల మరణాల శాతాన్ని తగ్గించటానికి, నిరక్షరాస్యతను నిర్మూలించటానికి థాయ్‌లాండ్ అనేక చర్యలు తీసుకుంది. ఈ విధంగా మౌలికాంశాలన్నీ బలంగానే ఉన్నాయి. కాబట్టి థాయ్ కరెన్సీ బహ్ట్‌పై తక్షణ లాభాల కోసం (స్పెక్యులేటివ్) దాడి జరుగుతుందని సంక్షోభానికి సంవత్సరం ముందు వరకు ఎవ్వరూ ఊహించ లేదు.

ఎగుమతులపై ఆధారపడిన థాయ్ ఆర్థిక వ్యవస్థలో ఎగుమతులు తగ్గటంతో సమస్యలు ప్రారంభమైనాయి. ఎగుమతుల పెరుగుదల 1995లో 24.7 శాతం నుండి 1996లో 0.1 శాతానికి తగ్గిపోయింది. 1992లో విదేశీ వాణిజ్యలోటు జిడిపిలో 4.96 ఉండగా, 1995 నాటికి 6.8 శాతానికి పెరిగింది. 1990వ దశాబ్దం ప్రారంభంలో థాయ్ ప్రభుత్వం యఫ్‌డిఐని ఆకర్షించటం కన్నా, స్వల్పవ్యవధి రుణాలు, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులకు ప్రాధాన్యత నిచ్చింది. ప్రైవేటు సంస్థలు విదేశాల నుండి రుణాలు తీసుకోవటానికి అవకాశం కల్పించారు. 1997లో థాయ్ రుణం మొత్తం 8,900 కోట్ల డాలర్లు కాగా, ఇందులో ప్రైవేటు సంస్థల రుణం 7,100 కోట్ల డాలర్లుంది. స్వల్పవ్యవధి రుణాలలో 2,000 కోట్ల డాలర్లు 1997 చివరికి చెల్లించాల్సిరావటంతో రుణభారం భరించ లేనిదిగా మారింది. 1992-96 మధ్య వాణిజ్య బ్యాంకులకు విదేశీ పెట్టుబడుల రాక ఐదు వందల కోట్ల డాలర్ల నుండి 4,600 కోట్ల డాలర్లకు -తొమ్మిది రెట్లు- పెరిగాయి. 97వ సంవత్సరం ప్రారంభంలోనే సంక్షోభ సూచనలు కనిపిస్తున్నా పట్టించుకోకుండా అంతర్జాతీయ బ్యాంకులు రుణాలివ్వటాన్ని కొనసాగించాయి. ద్రవ్య పెట్టుబడుల రాకపోకలపై నిబంధనలను సడలించటం, మార్కెట్ శక్తులపై పూర్తిగా ఆధారపడటంతో ప్రైవేటు సంస్థలు తీసుకున్న రుణాలు 1992-96 మధ్య జిడిపిలో 39 శాతం నుండి 123 శాతానికి పెరిగాయి. ఎగుమతి ఆధారిత ఆర్థికవ్యవస్థగా మార్పు చెందిన తర్వాత ఎగుమతులు తగ్గటం, స్వల్పకాలిక రుణాలు, స్వల్పకాలిక పెట్టుబడుల స్వేచ్ఛా రాకపోకలతో థాయ్ ఆర్థికవ్యవస్థలో సంక్షోభం ప్రారంభమైంది.

థాయ్‌లాండ్ అనుభవాలను పరిశీలిస్తే సంస్కరణలను వేగంగా అమలుచేస్తూపోతే మనం ఎటువంటి స్థితిని ఎదుర్కొంటామో స్పష్టం అవుతున్నది. ఈ అంశాలలో మనదేశ పరిస్థితి భిన్నంగా ఉన్నదా? ఏ దేశ ఆర్థికవ్యవస్థ అయినా ఎగుమతులలో మిగులు సాధించి, విదేశీమారక ద్రవ్యనిల్వలను కలిగి ఉంటే ఆ దేశ ఆర్థికవ్యవస్థ సురక్షితంగా ఉంటుంది. మన దేశ ఎగుమతుల పెరుగుదల అభివృద్ధి క్రమంగా తగ్గిపోతున్నది. 2015 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఐదు నెలల కాలంలో మన దేశ ఎగుమతులు డాలర్లలో 16.17 శాతం పడిపోయాయి. 2013-14లో వాణిజ్యలోటు 14,760 కోట్ల డాలర్లుగా ఉంది. పెరుగుతున్న వాణిజ్యలోటును పూడ్చుకోవటానికి ఉన్న మార్గాలేమిటి? విదేశాలలో పనిచేస్తున్న భారతీయులు పంపే మొత్తాలు, మన దేశానికి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, సంస్థాగత పెట్టుబడులను (యఫ్ఐఐ) వాణిజ్య లోటును తీర్చటానికి వినియోగిస్తున్నారు. ఇవి నమ్మదగిన ఆదాయాలు కాదు. విదేశాలలో ఉంటున్న భారతీయుల నుండి మనకు వస్తున్న డబ్బులో ఎక్కువ భాగం అమెరికా, గల్ఫ్ దేశాల

> “విదేశీ సంస్థాగత పెట్టుబడులు అస్థిర పెట్టు బడులు. గాలివాటు లాభాల కోసం స్టాక్‌మార్కెట్‌లోకి, ఇతర రంగాల లోకి వస్తాయి. ఇక్కడ లాభాలు సంపాదించుకోవటం పూర్తయిందనుకున్నా, ఇతరదేశాలలో ఇంతకన్నా ఎక్కువ లాభా లకు అవకాశం ఉందనుకున్నా నిముషాలలో దేశం నుండి వెళ్ళిపోతాయి.”




పెరూలోని లిమాలో జరుగుతున్న ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంక్ గవర్నర్ల బోర్డు సమావేశం

నుండి వస్తున్నది. గల్ఫ్ దేశాలలో ప్రస్తుతం కొనసాగుతున్న దాడులు, అంతర్యుద్ధాలు ఆ ప్రాంతంలో పనిచేస్తున్న భారతీయుల పరిస్థితిని అనిశ్చితంగా మారుస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం ఫలితంగా అభివృద్ధి చెందిన దేశాలలో కూడా నిరుద్యోగం పెరుగు తున్నది. ఉద్యోగాలు కావాలని నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. మితవాదశక్తులు జాతి విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. ఈ పరిస్థి తులు, తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం ఆ దేశాలలో అనిశ్చితికి దారితీస్తున్నది. ఆ విధంగా విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల ద్వారా మనకు వచ్చే విదేశీ మారకద్రవ్య నిధులు తగ్గిపోవటానికి అవకాశాలున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (యఫ్‌డిఐ), విదేశీ సంస్థా గత పెట్టుబడిదారులు (యఫ్‌ఐఐ) రావటం అమెరికా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవ్యవస్థల పనితీరుపై ఆధారపడి ఉంటుంది. అమెరికా ఆర్థికవ్యవస్థ అభివృద్ధి దిశలో ఉండి, వడ్డీరేట్లు పెరుగుతుంటే ఇపుడు మనదేశంలో కొస్తున్న పెట్టుబడులలో ఎక్కువ భాగం అమెరికాకు వెళ్ళతాయి. అమెరికాలో పనిచేస్తున్న వారిలో అధికభాగం అధికవడ్డీలు, మారకం రేటు గ్యారంటి కోసం తమ సంపాదనను డాలర్ల రూపంలో ఉంచటానికే ప్రాధాన్యత నిస్తారు. అటువంటి సమయాలలో విదేశీ మారక చెల్లిం పుల లోటును పూడ్చటానికి ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు ఉండవు. విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులు ఉత్పత్తిపై ఆధారపడి దీర్ఘకాలం దేశంలో ఉంటాయి. కాబట్టి ఆ నిధులను ద్రవ్యలోటు తీర్చటానికి వినియోగించినా ఇబ్బంది ఉండదు. కాని మనదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తక్కువ మొత్తంలోనే వస్తున్నాయి. ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ వరకు దేశంలో కొచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1,939 కోట్ల డాలర్లు మాత్రమే. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి పెట్రోలియం ధరలు తక్కువగా ఉండటం వాణిజ్యలోటు తక్కువగా ఉండటానికి దోహదం చేస్తున్నది. అయినా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వినియోగించుకున్నా వాణిజ్యలోటును పూడ్చుకో లేం. అపుడు వాణిజ్యలోటును పూడ్చుకోవటానికి విదేశీ సంస్థాగత పెట్టుబడులను వినియోగించు కోవటం, విదేశీ రుణాలు చేయటం తప్పనిసరి అవుతుంది.

విదేశీ సంస్థాగత పెట్టుబడులు అస్థిర పెట్టు బడులు. గాలివాటు లాభాల కోసం స్టాక్‌మార్కెట్ లోకి, ఇతర రంగాలలోకి వస్తాయి. ఇక్కడ లాభాలు సంపాదించుకోవటం పూర్తయిందను కున్నా, ఇతరదేశాలలో ఇంతకన్నా ఎక్కువ లాభా లకు అవకాశం ఉందనుకున్నా నిముషాలలో దేశం నుండి వెళ్ళిపోతాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచబోతున్నదనే ప్రచారం జరిగితే మనదేశంలో ఉన్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు వెళ్ళిపోతాయేమోనని ప్రభుత్వం ఆందోళన చెందింది. సంస్థాగత పెట్టుబడి దారులు కోరిన వెంటనే వారు డిపాజిట్ చేసిన మొత్తాన్ని చెల్లించాలి. విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్నవారు పంపిస్తున్న మొత్తాలు తగ్గినా, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాక తగ్గినా విదేశీ మారకద్రవ్య చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొం టాం. అందువలన మన విదేశీ వాణిజ్యలోటు ఆర్థికవ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

సంస్కరణలను వేగంగా అమలు జరపటం వలన, ద్రవ్య, రక్షణ రంగాలలోకి విదేశీ పెట్టు బడులు ప్రవేశిస్తున్నాయి. బ్యాంకింగ్ రంగంలోకి విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచారు. ఓటింగ్ హక్కులను పెంచారు. దీనివలన దేశీయ ఆర్థిక వ్యవస్థపైనా, ద్రవ్యరంగంపైనా విదేశీ పెట్టుబడి దారుల పట్టు పెరుగుతుంది. ఏ సంస్థకు రుణాలి వ్వాలనేది విదేశీ పెట్టుబడిదారులు నిర్ణయిస్తారు. ఇది దేశీయ పరిశ్రమలకు నష్టకరంగా మారుతుంది.

బ్యాంకింగ్, బీమా, ద్రవ్య రంగంలో విదేశీ పెట్టుబడిదారులు, దేశీయ పెట్టుబడిదారుల ఆధిపత్యం పెరగటం వలన విస్తారంగా ఉన్న రైతులు, చిన్న వృత్తులు, వ్యాపారాలు చేసు కొనే వారికి, వ్యవసాయ కార్మికులు, నిరుద్యో గులు, ఇతర పేదలు తీవ్రంగా నష్టపోతారు. బ్యాంకులు ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళిన తర్వాత పేదలకు రుణాలివ్వటం వారి ప్రాధాన్య తలలో ఉండదు. ప్రసుతం బ్యాంకులు ప్రభుత్వం చేతిలో ఉన్నాయి కాబట్టి రైతాంగానికి, వృత్తి దారులకు, చిన్న వ్యాపారులకు, పేదలకు, నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలిస్తున్నారు. బ్యాంకులు ప్రైవేటు వారి చేతిలోకి వెళితే ఈ విధమైన రుణాలు ఇవ్వరు. అందువలన వారు అనివార్యంగా దివాళా స్థితిలోకి నెట్టబడతారు దేశ, విదేశీ పెట్టుబడిదారులు లాభాలకు ప్రాధా న్యత ఇస్తూ, అధికవడ్డీలు ఎవరు చెల్లిస్తే వారికే రుణాలు ఇస్తారు. తమ వ్యతిరేక గ్రూపులో ఉన్న పెట్టుబడిదారులకు కూడా రుణాలు అంద కుండా చేస్తారు. సకాలంలో పెట్టుబడులుఅందని పారిశ్రామిక సంస్థలు దివాళా తీస్తాయి. వడ్డీరేట్ల ను కూడా తమ ఇష్టం వచ్చినట్లు పెంచుతారు.

బడా పెట్టుబడిదారులు విదేశీ పెట్టుబడి దారులతో కలిసి తమ పరిశ్రమలు, వ్యాపారాలకు రుణాలు తీసుకోగలుగుతారు. బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థలు దేశీయ పెట్టుబడిదారుల ఆధీనంలోకి వచ్చినా ఇదే విధమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. విదేశీ పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలకు అనుగుణంగా, మన దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మన బ్యాంకుల లోని నిధులను వినియోగిస్తారు. ప్రాధాన్యతా రంగాలను వదలివేసి అధిక వడ్డీలు ఎవరిస్తారను కుంటే వారికి రుణాలిస్తారు. బ్లాక్‌మార్కెటీర్లు, స్మగ్లర్లు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎక్కువ వడ్డీలను చెల్లిస్తే ప్రైవేటు బ్యాంకులు వారికే రుణాలిస్తాయి. ప్రైవేటు, విదేశీ బ్యాంకులకు లాభాలు ముఖ్యం మినహా మన వ్యవసాయరంగం, పరిశ్రమలు, దేశ ఆర్థికాభివృద్ధి ముఖ్యం కాదు. విదేశీ బ్యాంకులు థాయ్‌లాండ్, ఇతరదేశాలలో దేశీయ పరిశ్రమలకు ఇచ్చే రుణాలకు వడ్డీలను ఎక్కువగా పెంచటంతో దేశీయ పరిశ్రమలు పోటీకి తట్టుకోలేక దివాళా తీశాయి. దేశీయ పరిశ్రమలకు అత్యవసరంగా రుణాలు కావలసి వచ్చినపుడు రుణావ్వకుండా పరిశ్రమలను దివాళా తీయించారు. రుణాలు చెల్లించటానికి తగినంత మొత్తంలో డాలర్లు లేకపోతే ప్రభుత్వం విదేశీ మారకద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ప్రభుత్వం వాణిజ్యలోటును పూడ్చలేకపోయినా, స్వల్పకాలిక రుణాలు చెల్లించలేకపోయినా పెట్టుబడిదారుల విశ్వాసం సన్నగిల్లుతుంది. విశ్వాసం సన్నగిల్లితే విదేశీ పెట్టుబడులు వెంటనే దేశం నుండి ఉడాయిస్తాయి. సంస్కరణలను వేగవంతం చేయటంలో పెట్టుబడుల రాకపోకలపై ఆంక్షలను తొలగించటం ప్రధానాంశంగా ఉంటుంది. పెట్టుబడులపై ఆంక్షలను తొలగించటంతో విదేశీ పెట్టుబడులతో పాటు దేశంలోని పెట్టుబడులు కూడా బయటికి వెళ్ళిపోతాయి. ఫలితంగా దేశంలో డాలర్లకు కొరత ఏర్పడుతుంది. రూపాయి విలువ పడిపోతుంది. సంక్షోభం తీవ్రమౌతుంది. విదేశీ రుణాల కోసం ఐయంయఫ్, ప్రపంచబ్యాంకుల వద్దకు వెళితే, దేశ ఆర్థిక వ్యవస్థపై ద్రవ్య పెట్టుబడుల ఆధిపత్యాన్నిపెంచి, ప్రజలపై విపరీతమైన భారాన్ని మోపే విధంగా ఆంక్షలను విధిస్తారు. 1997లో ఆసియా దేశాలు సంక్షోభంలో చిక్కుకున్నపుడు ఈ విధంగానే ఆంక్షలు విధించి, ఆదేశాలను మరింత సంక్షోభంలో ముంచి, దివాళా తీయించారు. ఐయంయఫ్ షరతులను అంగీకరించని మలేషియా సంక్షోభం నుండి త్వరగా బయట పడగా, అంగీకరించిన దేశాలు మరింత సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ సంవత్సరం గ్రీస్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నపుడు కూడా ఆ దేశాన్ని మరింత సంక్షోభంలో ముంచే షరతులు విధించటాన్ని చూశాం సంస్కరణలను మరింత వేగంగా అమలు జరిపితే ఈ పరిణామాలు సంభవిస్తాయి. థాయ్‌లాండ్‌తో పాటు ఆసియా టైగర్స్‌గా చెప్పబడిన దేశాలలో సంక్షోభానికి మౌలిక ఆర్థికాంశాలు బలహీనంగా ఉండటం కారణం కాదు. ఎగుమతులపై ఆధారపడిన దేశంగా మారిన తర్వాత ఎగుమతులు తగ్గటం, విదేశీ మారకద్రవ్యలోటు, ద్రవ్యరంగంలో సామ్రాజ్య వాదుల ఆధిపత్యం, ద్రవ్యపెట్టుబడుల స్వేచ్ఛా విహారం, అధికలాభాల కోసం క్షణాలలో ఒక దేశం నుండి మరొక దేశానికి పరుగెత్తటం కారణం. మనదేశంలో సంస్కరణలను వేగవంతం చేస్తూ, మౌలిక ఆర్థికాంశాలన్నీ బలంగా ఉన్నాయి. కాబట్టి మన ఆర్థికవ్యవస్థకు ఎటువంటి ప్రమాదం ఎదురుకాదని బిజెపి ప్రభుత్వం, సరళీకరణ విధానాలను సమర్థించే ఆర్థికవేత్తలు నమ్మబలుకుతున్నారు. ద్రవ్య పెట్టుబడుల మోసపూరిత వ్యవహారాలలో ఈ ప్రచారం ఒకభాగం మాత్రమే. సంస్కరణల అమలు వేగవంతమైతే మన దేశంలోనూ ఇదే విధమైనపరిణామాలు సంభవిస్తాయి. సంస్కరణలను వేగవంతం చేస్తున్న బిజెపి ప్రభుత్వం దేశాన్ని తీవ్ర సంక్షోభం వైపుకు తీసుకెళుతున్నది. సంస్కరణలకు వ్యతిరేకంగా కార్మికవర్గం, ప్రజలు చేసే పోరాటాలు మాత్రమే ద్రవ్య పెట్టుబడుల వినాశకర దాడుల నుండి దేశాన్ని రక్షించగలవు. ❋

> **“1997లో ఆసియా దేశాలు సంక్షోభంలో చిక్కుకున్నపుడు ఈ విధంగానే ఆంక్షలు విధించి, ఆదేశాలను మరింత సంక్షోభంలో ముంచి, దివాళా తీయించారు. ఐయంయఫ్ షరతులను అంగీకరించని మలేషియా సంక్షోభం నుండి త్వరగా బయట పడగా, అంగీకరించిన దేశాలు మరింత సంక్షోభంలో కూరుకుపోయాయి.”**

# నేను వ్యతిరేకిస్తున్నాను

(21వ పేజీ తరువాయి)

అంశం. నేను మారిపోతాననో మతాన్ని పోషిస్తాననో వాగ్దానం చేయడం లేదు. ఎందు కంటే మా పూర్వీకులు, తాతగారు ఆలయంలో అర్చకులు. మా నాన్నగారు నేటికీ వేదాలను నోటితో వల్లిస్తారు. ఎప్పుడూ చదవకపోయినా నా సోదరి వేదాలను నోటితో చెప్పగలదు. కారణం అది మా వంశంలో, మా రక్తంలో, మా వారసత్వంలో ఉంది. కాబట్టి ఓ భాజాపా నా మతం గూర్చి నువ్వు నాకు నేర్పవద్దు. నేను ఎలా ఆలోచించాలో, ఎవరిని పూజించాలో, ఏం తినాలో, ఎలా దుస్తులు ధరించాలో నువ్వు నాకు నేర్పాలని ప్రయత్నించవద్దు. పుట్టుక నిర్వచనం రీత్యా నేను హిందువుని. మానసిక స్వచ్ఛతరీత్యా పై స్థాయిలో ఉన్నదాన్ని.. అందుకే నేను నీ హిందూత్వాన్ని తిరస్కరిస్తున్నాను. ఎలాగో తెలుసా? ముస్లింలు తాలిబాన్లను, ఐఎస్ఐఎస్‌ని తిరస్కరించినట్లుగా! ఓ హిందువుగా బ్రతకడం అంటే సహ నంతో బ్రతకడం. ఆ సహనం వలననే ఎన్నో దాడులను, విధ్వంసాలను ఈ జాతి ఎదుర్కో గలిగింది. నశించకుండా నిలబడగలిగింది. ఇది నువ్వు అర్థం చేసుకోలేక పోయినా, సహనాన్ని వహించకపోయినా, బలవంతంగా మతాచరణను ప్రోత్సహించినా, నువ్వొక హిందువుగా పిలవ బడవు. ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించడానికి తగవు. కాబట్టి ప్రియమైన బిజెపి. నీ హిందూ త్వాన్ని నేను తిరస్కరిస్తున్నాను. నీ ఫాసిజాన్ని తిరస్కరిస్తున్నాను. నీ నిరంకుశ ప్రభుత్వాన్ని తిరస్కరిస్తున్నాను. ఇది భారతదేశం తరపున నేను చేస్తున్న హెచ్చరిక. గుర్తుంచుకో...

**(స్వేచ్ఛానువాదం డాక్టర్ శమంతకమణి)**

# వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సమీకరించడమే లక్ష్యం

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : కా॥ బి.వి. రాఘవులు గారికి నమస్కరించి వ్రాయునది. అక్టోబర్ 2015 మార్క్సిస్టు పత్రికలో "ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు" వ్యాసంలో రిజర్వేషన్లు, వాటికి సంబంధించిన నేపథ్యము, దాని గురించి చేయవలసిన కృషిని చక్కగా తెలియజేశారు. ఇదే సందర్భంలో వెనుకబడిన తరగతుల వారికి అమలుచేస్తున్న "క్రిమిలేయర్ విధానం" సమర్థనీయమా? సమర్థనీయమైతే దళిత, గిరిజన తరగతుల విషయంలో ఎందుకు ప్రభుత్వాలు ఈ నిర్ణయం చేయలేదు. వివరించగలరు?**

భారత రాజ్యాంగం సామాజిక వివక్షకు గురయ్యే అనేక తరగతుల పురోగమనానికి పలు రకాల సానుకూల చర్యలను ప్రతిపాదించింది. అందులో ముఖ్యమైన అంశం రిజర్వేషన్లు. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తరగతుల రిజర్వేషన్లను కేంద్ర పరిధిలో ఉంచి, జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, వైద్యం,ఉపాధి, రాజకీయ రంగాలలో అమలుజేయడానికి నిర్దేశించింది. వెనుకబడిన కులాలకు సంబంధించి ఏ కులాలు, ఏ తరగతులు వెనుకబడ్డాయి. నేటికి ఎంత మేరకు రిజర్వేషన్లు అవసరం అనే అంశాలను నిర్ణయించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది. (మండల్ కమిషన్ తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది)

షెడ్యూల్డ్ కులాలకు వెనుకబడిన కులాలకు మధ్య ఒక ముఖ్యమైన వ్యత్యాసాన్ని రిజర్వేషన్లను నిర్ణయించే సందర్భంలో రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకున్నారు. కులాలు, అంటరానితనం ఉన్న, అంటరానితనం లేనివిగా విభజన అయి ఉండడమే ఆ వ్యత్యాసం. అంతేకాకుండా వెనుక బడిన కులాలుగా పరిగణించబడుతున్న కులాల మధ్య, అలాగే ప్రతి కులంలోని కుటుంబాల మధ్య ఆర్థిక, విద్యాభివృద్ధి విషయంలో పెద్ద వ్యత్యాసాలున్నాయి. అదే దళితులూ, గిరిజనులలో వ్యత్యాసాలు అంత తీవ్రంగా ప్రస్తుతం లేవు. ఈ కారణంగా వివిధ తరగతులకు కేటాయించిన రిజర్వేషన్లు ఆయా తరగతిలోని పేదలకు చెందేట్లు ప్రత్యేకంగా నిబంధన పెట్టాలా అన్న చర్చ వచ్చినప్పుడు సుప్రీంకోర్టు వెనుకబడిన కులాలలో విద్య, ఉపాధి, రిజర్వేషన్లు బిసిలలోని ధనవంతులను మినహాయించి అమలు చేయాలని చెప్పింది. ఈ నిర్ణయం సమంజసమైనదని సిపిఎం సమర్థించింది. క్రీమీ లేయర్ అమలు జేసినందున బి.సి.లకు నష్టమేమీ ఉండదు. బి.సి.లలోని పేదలకు ప్రాధాన్యత వస్తుంది. బి.సి. పేదలలో అర్హులయిన అభ్యర్థులు దొరక్కపోతే, ధనవంతులైనప్పటికీ మిగిలిన బి.సి.లకు దక్కుతాయి. బి.సి.ల రిజర్వేషన్లు బి.సి. కులాల నుండి బయటకుపోవు. అందువలన క్రీమీ లేయర్ వలన బిసిలకు అన్యాయం జరుగుతుందనుకోవడం సరిగాదు. ఒకవేళ ప్రభుత్వాలు అటువంటి అన్యాయం చేస్తే ప్రతిఘటించాలి.

గిరిజనులు కూడా అనేకరకాల ప్రత్యేక ఇబ్బందులకు, వివక్షలకు గురవుతున్నారు. ప్రధాన సమాజం నుండి వేరుగా ఉంచబడుతున్నారు. దళితుల్లో, గిరిజనుల్లో రిజర్వేషన్లను కొద్ది కుటుంబాలే ఎక్కువ ఉపయోగించుకుంటున్నాయని, కొంతమంది ధనవంతులు తయారయ్యారని అనుకున్నా, ఒక స్థిరమైన ధనిక వర్గం ఇంకా ఆవిర్భవించలేదని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందుకే ఈ తరగతులకు క్రీమీ లేయర్ గురించి ఆలోచించాల్సిన తరుణం ఇంకా రాలేదని సిపిఐ (ఎం) భావిస్తున్నది.

**ప్రశ్న : ఏప్రియల్ 2015 జాతీయ మహాసభల సందర్భంగా చేసిన బూర్జువా పార్టీలతో ఐక్య సంఘాలు, ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించకుండా, వామపక్ష పార్టీలు, అభ్యుదయవాదులు, సమాజ మార్పు కోరేశక్తులను కలుపు కొని ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తీర్మానించినట్లుగా తెలియవచ్చింది. కాని ఈమధ్య వైఎస్ఆర్ సిపితో కలిసి ఉద్యమాలు చేయటంలో పార్టీ ఆలోచనా విధానం తెలియజేయగలరు?**

**- కొండేటి శివకోటేశ్వరరావు,**
ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం

విశాఖపట్నంలో జరిగిన జాతీయ మహాసభల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టడం ప్రధాన కర్తవ్యంగా సిపిఐ(ఎం) నిర్ణయించుకున్నది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో విశాలమైన ఐక్య పోరాటాలను నిర్వహించాలన్న కర్తవ్యాన్ని నిర్దేశించుకున్నది. ఇందుకోసం కలిసి వచ్చే వామపక్షాలు, వర్గ, సామాజిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థ, ప్రజాస్వామ్య అభ్యుదయ శక్తులు, వ్యక్తులను సమీకరించాలని నిర్ణయించింది. ఇటువంటి సమీకరణాలలో బూర్జువా పార్టీ పాత్ర ఏమిటన్న అంశాన్ని కూడా స్పష్టపరచింది. మహాసభ రాజకీయ తీర్మానంలోని 2.71 పేరా ఈ విధంగా చెప్పింది:

"పార్టీ స్వతంత్ర శక్తిని పెంపొందించడం, పార్టీని నిర్మించడంపై ప్రధానంగా కేంద్రీకరిస్తుంది. అదే సమయంలో ప్రజల సమస్యలపైన, దేశ సార్వభౌమత్వ పరిరక్షణ, రాష్ట్రాల హక్కుల రక్షణకోసం, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఇతర ప్రజాతంత్ర శక్తులు, కాంగ్రెసేతర లౌకిక పార్టీలతో కలిసి ఐక్య ఉద్యమాలు పెంపొందించేందుకు కృషి చేస్తుంది. పార్టీ స్వతంత్ర శక్తి విస్తరించాలంటే ప్రజా ఉద్యమాల ఉమ్మడి వేదికలు, ఐక్య పోరాటాలు తప్పనిసరి అవసరం. సమైక్య కార్యాచరణల ద్వారానే వర్గ, ప్రజా సంఘాలు కాంగ్రెస్, బిజెపి ఇతర బూర్జువా పార్టీల వెనుకనున్న ప్రజా బాహుళ్యాన్ని రాబట్టగలుగుతాయి".

కాబట్టి ప్రజాస్వామిక శక్తులు, కాంగ్రెసేతర లౌకిక పార్టీలు ఎప్పుడైనా ముఖ్య మైన ప్రజా సమస్యలపై పై నిబద్ధతతో కలిసివచ్చి నప్పుడు, అవి ప్రజలను కదిలించడంలో చిత్తశుద్ధి చూపినప్పుడు వామ పక్షాల సమీకరణకరణకు, ఐక్యతకు ఇబ్బంది లేనప్పుడు, వాటితో కలిసి వ్యవహరించడానికి వెనుకాడాల్సిన అవసరం లేదు. అలాగే ఆ పార్టీలు స్వతంత్రంగా ముఖ్యమైన ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తున్నప్పుడు వాటికి మద్దతు ఇవ్వడంలో తప్పులేదు. ప్రజా సమస్యలపై ఆందోళనలలో ఈ పార్టీలతో కొన్ని సందర్భాలలో కలిసి వ్యవహరించినంత మాత్రాన, ఎన్నికలలో కూడా కలిసి వ్యవహరిస్తామని అనుకోకూడదు. ఎన్నికల్లో ఎత్తుగడలను వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలపర్చుకోవడం దృష్టితో నిర్ణయించు కుంటాం. పైన పేర్కొన్న రాజకీయ విధానాన్ని అనుసరించే వైఎస్ఆర్ సిపి ప్రజా సమస్యలపై తీసుకున్న కార్యక్రమాలకు సిపిఐ (ఎం) మద్దతు ప్రకటించింది. ❋

# నండూరి ప్రసాదరావు

(2వ పేజీ తరువాయి)

కాలంలోనే రాష్ట్ర కమ్యూనిస్టు నాయకుల సమావేశం రహస్యంగా కాకినాడలో జరిగింది. ఆకస్మికంగా పోలీసులు దాడిచేస్తే తీర్మానాల కాపీలు, పత్రాల వంటివి దొరక్కుండా కాల్చివేసేందుకు నండూరి రెండు స్పిరిట్‌తో ఉన్న సీసాలు తెచ్చి ఉంచారు. అంటే ఆ సమావేశం అంత పకడ్బందీగా జరిగింది. దానికి హాజరైన ప్రతినిధులు మొత్తం పదిమందిలోపే. వారిలో పుచ్చలపల్లి సుందరయ్య, పోలేపెద్ది నరసింహ మూర్తి, పులుపుల శివయ్య, జొన్నలగడ్డ రామలింగయ్య, అల్లూరు సత్యనారాయణరాజు, నండూరి పాల్గొన్నారు. ఆ సమావేశంలో నలుగురితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. పోలేపెద్ది, అల్లూరు, మరొకరు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆ సమావేశం నుంచి తిరిగొచ్చాక నండూరి గుంటూరులోని 'ఫ్రెండ్స్ హోం'ను ఎత్తేశారు. అది అప్పటికి నష్టాలబాట పట్టింది. దీంతో ఆయన స్వగ్రామానికి తిరిగొచ్చారు. కొంతకాలం తరువాత ఓ రోజు సుందరయ్య ఆరుగొలను వచ్చి నండూరిని కలిశారు. తూర్పు గోదావరి జిల్లాలో పార్టీని ఆర్గనైజ్ చేయడానికి అక్కడకు వెళ్లి బాధ్యతలను నిర్వహించాలని కోరారు. నండూరి రాజమండ్రిలో ఓ సత్రంలో ఉంటూ హోటళ్లలో భోజనం చేస్తూ పార్టీ నిర్మాణం జరుపుతుండేవారు. హోల్‌టైమర్ వేతనం కిందసుందరయ్య ఆయనకు ప్రతినెలా 14 రూపాయలు పంపించేవారు. అలా ఆ జిల్లాలో పార్టీని రహస్యంగా నిర్మిస్తుండేవారు.

1936 చివరి నుంచి 1937 ప్రారంభం వరకూ కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి నాయకత్వంలో 'రైతు రక్షణ యాత్ర' జరిగింది. ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ 1300 మైళ్ల వరకూ కొనసాగిన ఈ యాత్రకు తూర్పు గోదావరి జిల్లాలో రూట్ నిర్ణయించడమేగాక యాత్ర జిల్లా దాటే వరకూ నండూరి ఎంతగానో కృషి చేశారు. రైతు రక్షణ యాత్ర సందర్భంగా రైతుల నుంచి వచ్చిన వేలాది విజ్ఞాపనలన్నీ క్రోడీకరించి సమగ్ర రిపోర్టు తయారు చేసి మద్రాసు ప్రధాని రాజాజీకి వినతిపత్రంగా అందజేశారు. 1937 మధ్య భాగంలో నండూరి విజయవాడలోని రాష్ట్ర రైతు సంఘ కార్యాలయానికి వచ్చేశారు. అప్పట్లో రాష్ట్ర రైతు సంఘానికి కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్షులుగానూ, చలసాని వాసుదేవరావు ప్రధాన కార్యదర్శిగానూ, నండూరి సహాయ కార్యదర్శిగానూ ఉండేవారు. మునగాల పరగణాలో జమీందారీ విధానం, అత్యాచారాలు, రైతుల ఈతిబాధల గురించి విచారించడానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఒక విచారణా సంఘాన్ని నియమించింది. అందులో నండూరి కూడా ఉన్నారు. విచారణా నివేదిక తయారీ నండూరి పైనే పెట్టారు. ఆయన అందజేసిన నివేదికను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పెట్టి ఆమోదించారు. తరువాత 1938లో మునగాల పరగణాలో జమీందారీ వ్యతిరేక పోరాట నిర్మాణానికీ, రైతు సంఘ ఏర్పాటుకూ నండూరిని కమ్యూనిస్టు పార్టీ అక్కడికి పంపింది. తనకు తోడుగా వచ్చిన జోశ్యభట్ల సత్యనారాయణ, మోటూరు పరంధామయ్యలను కలుపుకొని అక్కడి రైతాంగాన్ని కూడగట్టి రైతు సంఘాన్ని ఆర్గనైజ్ చేశారు. మునగాల పరగణాలో 41 గ్రామాల్లోనూ రైతు సంఘ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతిగ్రామంలోనూ కూలి పోరాటాలను నిర్వహించారు. వీరి నేతృత్వంలో పరగణా జమీందారు కోట ముట్టడించి రైతులు తమ సమస్యలను పరిష్కరించుకున్నారు.


1944లో రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో పెద్ద కరువులు వచ్చాయి. రైతు సంఘం తరపున ఆయన ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. అదే ఏడాది బెజవాడలో చారిత్రాత్మక రైతు మహాసభల సమయంలో నండూరి రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు. ఆయన బెజవాడలోనే ఉంటూ డెప్యుటేషన్లు, నెగోషియేషన్లు, ఇతర ఆఫీసు పనుల్లో నిమగ్నమై ఉండేవారు. 1946లో ప్రకాశం పంతులు ప్రభుత్వం ఆంధ్ర కమ్యూనిస్టులపై తీవ్ర నిర్బంధం అమలు జరిపింది. అనేక మంది నాయకులను జైళ్లలో పెట్టింది. నండూరి పది నెలలపాటు జైల్లో ఉన్నారు. స్వాతంత్ర్య దినానికి ఒక రోజు ముందు ఆయన విడుదలయ్యారు. రైతు సంఘం తరపున జాతీయ జెండాలు ఎగురవేసి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదనే భావన ఆయనలో ఉండేది. 1947 డిసెంబరులో మరలా ఆయనను అరెస్టు చేసి కైకలూరు జైలులో పెట్టారు. 1948లో ఆయన మరో ఆరుగురితో కలిసి జైలు నుంచి తప్పించుకున్నారు. అదే ఏడాది సెప్టెంబరులో హైదరాబాద్‌పై పోలీసు యాక్షన్ జరిగింది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం జరుగుతోంది. ఆ సందర్భంలో పార్టీ ఆదేశాల మేరకు ఆయన తెలంగాణా వెళ్లి అడవుల్లోని రహస్య స్థావరాల్లో ఉంటూ దళాల సభ్యులకు తరగతులు నిర్వహించేవారు. 1952 లో అజ్ఞాతవాసం నుంచి బయటకు వచ్చారు. సుందరయ్య, బసవపున్నయ్య తదితర నాయకులతో కలిసి రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణంలో పాలుపంచుకున్నారు. 1953లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, సిపిఎం ఆవిర్భావానంతరం ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా సుదీర్ఘకాలం పని చేశారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా కూడా పనిచేశారు. పార్టీలో సైద్ధాంతిక విభేదాలు తలెత్తినప్పుడు ఆయన నికరమైన మార్క్సిస్టు సిద్ధాంత పరిరక్షణ కోసం గణనీయమైన కృషి చేశారు. ఒడిదుడుకులు, కష్టనష్టాలు ఎన్ని ఎదురైనా మొక్కవోని దీక్షతో మున్ముందుకు సాగిపోయారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆటుపోట్లు, ముఖ్యంగా సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత కమ్యూనిజం పట్ల అచంచల విశ్వాసంతో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఆయన కృషి ఎనలేనిది.

కార్మికోద్యమ నాయకత్వ బాధ్యతలను చేపట్టి మూడు దశాబ్దాల కాలంపాటు నిర్వహించారు. ఆంధ్రరాష్ట్ర కార్మికోద్యమ నిర్మాణంలో, ముఖ్యంగా సిఐటియు నిర్మాణంలో ఆయన అద్వితీయమైన పాత్ర నిర్వహించారు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య ఉపాధ్యక్షునిగా కొంతకాలం పనిచేశారు. కమ్యూనిస్టు, కార్మికోద్యమాలకే కాకుండా ప్రపంచ శాంతి ఉద్యమాలకు సైతం నాయకత్వ పాత్ర నిర్వహించారు.

నండూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను ఔపోసన పట్టారు. రామాయణ, భారత, భాగవతాది పురాణాలు మొదలు కారల్ మార్క్స్ 'క్యాపిటల్' వరకూ ఆయనకు కరతలామలకాలు. ఆయన ఎంతో వైవిధ్యం కలిగిన రచయిత. సాహిత్యం, కళలు, తత్వశాస్త్రం, చరిత్ర, రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలు, సిద్ధాంతాలు ఇలా అనేక విషయాలపై ఆయన వందల సంఖ్యలో వ్యాసాలు, పదుల సంఖ్యలో పుస్తకాలు రాశారు. చివరికాయన భారత క్రికెట్ జట్టు ఆటతీరుపై కూడా వ్యాసాలు రాశారు. ప్రజాప్రతినిధిగానూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. శాసన మండలి సభ్యునిగానూ, రాజ్యసభ సభ్యునిగానూ ఎన్నికయ్యారు. రైతు ఉద్యమంలో విశేషానుభవం కలిగిన నండూరి, ద్వితీయ, తృతీయ పంచవర్ష ప్రణాళికల్లో భూ సంస్కరణల ఉప సంఘంలో సభ్యునిగా సేవలందించారు. కార్యకర్తల పట్ల ఎనలేని ఆప్యాయతానురాగాలను ప్రదర్శించేవారు. కార్యకర్తల కుటుంబాల్లో ఆయనోపెద్దగా వ్యవహరించేవారు. తొమ్మిది పదుల నిండు జీవితాన్ని గడిపిన కామ్రేడ్ నండూరి ప్రసాదరావు 2001 నవంబర్ 29న కన్నుమూశారు. మొఖాసాదారీ భూస్వామ్య కుటుంబంలో జన్మించి తన కంటూ ఏమీ మిగుల్చుకోకుండా చివరి శ్వాస వరకూ కష్టజీవుల, కార్మికుల బాగు కోసం విప్లవోద్యమానికే అంకితమైన ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-11-2015 Postal Regd. No L1/SD/407/13-15

# కమ్యూనిస్టు సమాజం



## - శివవర్మ

“కమ్యూనిస్టు సమాజం వర్గరహిత సమాజం. దీనిలో యజమానులు, కూలీలు ఉండరు. ధనిక, పేద తేడాల్లేకుండా స్వతంత్ర వ్యక్తులతో నిండి ఉంటుంది. ఉత్పత్తి సాధనాలు ఏ ఒక్కరి సొంతమూ కాదు. అందరూ కలిసి అందరి క్షేమం కోసం పాటుపడతారు. సమాజం అందరి అవసరాలు తీర్చడానికి కృషి చేస్తుంది. దీనివలన అందరూ సుఖంగా, విశ్రాంతిగా జీవిస్తారు. దీన్ని మరొకవిధంగా చెప్పాలంటే ప్రతి ఒక్కరూ శక్తికొద్దీ పనిచేస్తారు. అవసరాన్ని అనుసరించి ప్రతిఫలం పొందుతారు.

“ఈ పరిస్థితి ఏర్పడాలంటే అవసరమైన వస్తువుల కొరత లేకుండా పుష్కలంగా ఉండాలి. నేటివలే కొరత పరిస్థితి ఉండరాదు. అందరికీ అన్ని వస్తువులు లభ్యమయ్యేటట్లు చూడాలి. కేవలం తిండి, బట్ట మొదలైన జీవితావసరాలు తీర్చడమే కాక పాఠశాలలు, ఆటస్థలాలు, ప్రదర్శనశాలలు, పుస్తకాలు, వినోదం మొదలైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. అందిరికీ జీవితంలో శారీరక, మానసిక సుఖాలననుభవించడానికి ఏ రకమైన లోటు లేకుండా చూడాలి.

“కమ్యూనిస్టు సమాజం అంతర్జాతీయ సమాజంగా ఉంటుంది. ఇతర దేశాలు విప్లవకర సహకారం లేకుండా ఒక దేశంలో కమ్యూనిస్టు సమాజ స్థాపన సాధ్యం కాదు. పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికుల ఆందోళన, అర్ధ వలస దేశాల స్వతంత్రోద్యమాల సహకారం, ప్రపంచంలో ప్రగతిశీల శక్తుల మద్దతు లభించి ఉండకపోతే రష్యాలో సోషలిస్టు విప్లవ విజయం సాధ్యమయ్యేది కాదు.

“కమ్యూనిస్టు సమాజం అన్నిదేశాల మధ్య పరస్పర సహకారం, సోదరభావంతో ఉంటుంది. కాగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలకు తమ సరుకులు అమ్ముకోవడానికి, పెట్టుబడులు పెట్టడానికీ, వలసలు, మార్కెట్లు కావాలి. వీటికొరకు యుద్ధాలను తీసుకొస్తాయి. కమ్యూనిస్టు సమాజానికి వీటితో పనిలేనందున అన్ని దేశాలను సౌభాగ్యంగా ఉంచుతుంది. అందుచేత యుద్ధాలు ఉండవు.

“నేడున్న పాలక సంస్థల అవసరం కమ్యూనిస్టు సమాజ అభివృద్ధితో తీరిపోతుంది. ఉదాహరణకు సైన్యం, కోర్టులు, జైళ్ళు లాంటివాటి అవసరం ఉండదు. కమ్యూనిస్టు సమాజంలో దేశాల మధ్య సోదరభావమే తప్ప శత్రుత్వం, యుద్ధాలు ఉండవు.

“అందువలన సైన్యం, యుద్ధ సామగ్రి అవసరం కూడా ఉండదు. ఫలితంగా వినియోగ వస్తువులు అధికంగా ఉత్పత్తి అయి అందరికీ సులభంగా అందుబాటులో ఉంటాయి. దీనివలన దొంగతనం, దోపిడీ, మోసం మొదలైనవి ఉండవు. ఇవన్నీ ఎప్పుడైతే ఉండవో కోర్టులు, పోలీసులు, జైళ్ళు కూడా ఉండవు. మరొక మాటలో చెప్పాలంటే కమ్యూనిస్టు సమాజంలో రాజ్యాంగ యంత్రం, అంటే పై సంస్థల అవసరం ఉండదు. సమాజం ఒక పెద్ద వివిధ జాతుల అంతర్జాతీయ సమాజంగా తయారవుతుంది. ఈ స్థితిలో వ్యక్తులు తమ సామర్థ్యాన్ని, శక్తియుక్తులను ప్రకృతిపై విజయం సాధించడానికి వినియోగించగలరు.

“కమ్యూనిస్టు సమాజంలో శ్రమ చేయడం పొట్ట నింపుకునే అవసరంగానే మిగలదు. అది మనిషి స్వభావంలో భాగంగా తయారవుతుంది. ప్రజలకు తమ శక్తి నైపుణ్యాలననుసరించి పని లభిస్తుంది. పనితీరు, స్వభావంలోనే మార్పు వస్తుంది. విజ్ఞానం వికాసం చెందే కొద్దీ శ్రమభారం, కాఠిన్యం తగ్గి పని పట్ల ఆసక్తి లేకపోవడం అనేది కూడా ఉండదు. పనిపట్ల భౌతిక దృక్పథమే మారిపోతుంది. పనిని సామాజిక కర్తవ్యంగా అర్థం చేసుకొని పూర్తి చేస్తారు.

“కమ్యూనిస్టు సమాజపు ఆర్థిక పునాది ఉత్పత్తి సాధనాలపై మొత్తం సమాజం యాజమాన్యంలో ఉంటుంది. పెట్టుబడిదారీ సమాజంలో రాజ్యాధికారం దోపిడీ వర్గానిది. దీని ద్వారా అధిక సంఖ్యాకులైన పీడిత వర్గంపై అధికారం చలాయిస్తుంది. సోషలిస్టు సమాజంలో రాజ్యాధికారం కార్మిక, కర్షక వర్గాధికారం అవుతుంది.

“కమ్యూనిస్టు సమాజంలో వర్గాలు అంతం అయిన కారణంగా రాజ్యాధికారం యొక్క అవసరం ఉండదు. ఇది మొత్తం ప్రపంచంలో కమ్యూనిజం విజయం సాధించినప్పుడే సాధ్యమవుతుంది. సోవియట్ దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించిన తరువాత కూడా ఇతర దేశాల్లో పెట్టుబడిదారీ ప్రభుత్వాలున్నంత వరకు ఆ దేశాల దాడుల నుండి కమ్యూనిస్టు సమాజాన్ని రక్షించుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం అవసరమవుతుంది. అధిక దేశాలలో సోషలిస్టు సమాజ స్థాపన జరిగినప్పుడు కమ్యూనిస్టు సమాజంలో ప్రభుత్వ యంత్రాంగం అవసరం తీరిపోతుంది”.

**(శివవర్మ రాసిన 'మార్క్సిస్టు సిద్ధాంత పరిచయం' నుండి ఈ భాగం గ్రహించబడింది)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.6. Published on November 1, 2015